


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

15.08.2026

శనివారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 94

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## సోషల్ మీడియాలో భాష జాగ్రత్త

- జనసేన శ్రేణులకు పవన్ వార్నింగ్
- వ్యక్తిగత దూషణలొద్దు
- వారి ట్రాప్‌లో పడొద్దని సూచన
- పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై
- పార్టీ శ్రేణులకు జనసేన అధినేత సూచనలు



2లో..

**అమరావతి, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్**

సోషల్‌మీడియాలో విభిన్నమైన అంశాలపై మాట్లాడే సమయంలో, పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమ పార్టీ శ్రేణులకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం భాషను ఉపయోగించడం మంచిది కాదన్నారు. ప్రసార మాధ్యమాలు, సోషల్‌మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నేతలు, జన సైనికులు, వీర మహిళలు కచ్చితంగా పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని సూచించారు.

## సీమాంధ్ర పాలకుల చెప్పుచేతుల్లో ప్రభుత్వం



2లో..

- ప్రభుత్వంపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఫైర్
- రాష్ట్ర వ్యాప్తంగా కామెంట్లు వైరల్
- ఉద్యమకారులకు గౌరవం దక్కలేదు
- సీమాంధ్ర మీడియా చేతుల్లో ప్రభుత్వం

## మా సహనం పరీక్షించొద్దు

- అజిత్ దోవల్ మాస్ వార్నింగ్
- ఆపరేషన్ సిందూర్‌పై తొలిసారి కామెంట్



7లో..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్**

పాకిస్తాన్‌పై భారత్ నిర్వహించిన ''ఆపరేషన్ సిందూర్''పై జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ ఇచ్చిన తొలి ఇంటర్వ్యూ 'డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్' అనే డిస్కవరీ డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ప్రసారం కానుంది. రెండు భాగాలుగా వచ్చే ఈ డాక్యుమెంటరీ ఇది ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీ ఛానల్, దాని స్ట్రీమింగ్ సర్వీస్ అయిన డిస్కవరీ+లో ప్రసారం అవుతుంది.

# పోలవరం పనులు స్పీడప్ చేయాలి

## ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- 36 ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టాలి
- అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు
- నీటి లభ్యత, భూగర్భ జలాలపై సూచనలు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా
- ప్రణాళికలు రూపొందించాలి
- ప్రాజెక్టులో 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి

**అమరావతి, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పురోగతి, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్న 36 ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. లోటు వర్షపాతం నేపథ్యంలో రాష్ట్రంలో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలు, నీటి నిర్వహణ ప్రణాళికపై సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. జలధార, జలహారతి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసి నీటి వనరులను సంరక్షించడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.



పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై అధికారులు సీఎంకు వివరాలు అందించారు. నిన్నటి వరకు ప్రాజెక్టులో 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కీలకమైన ఎడమ కాలువ పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌లో గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ప్రాజెక్టు ప్రధాన నిర్మాణ పనులతో పాటు డ్యామ్ సైట్ వద్ద అవసరమైన రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశంలో సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఇటీవల గోదావరిలో 14 లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహాలు వచ్చినప్పటికీ, నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పనులను కొనసాగించగలిగామని అధికారులు సీఎంకు తెలిపారు. వరద పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటూనే నిర్మాణ వేగాన్ని కొనసాగించడంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. పోలవరం సమీపంలోని గండి పోశమ్మ ఆలయానికి సంబంధించి కూడా సీఎం కీలక సూచనలు చేశారు.

2లో..

## చర్యలు తీసుకోవడానికి ఎవరు?

- విద్యార్థులు శాంతియుతంగా నిరసన
- నిరసన తెలపడం విద్యార్థుల హక్కు
- ఇది విద్యార్థులకు, నాకు మధ్య జరుగుతున్న సంభాషణ
- ఇందులో వేరొకరు జోక్యం చేసుకోవద్దు



7లో..

## 'కడప స్మార్ట్ కిచెన్'కు నీతిఆయోగ్ గుర్తింపు

- కటింగ్ నుంచి కుకింగ్ వరకూ అంతా మెషీన్లే.. 7లో..
- మంత్రి నారా లోకేష్ నీతిఆయోగ్‌కు ధన్యవాదాలు
- విద్యార్థులకు పౌష్టికాహారం, రక్షణ సేవలు బలోపేతం



**అమరావతి, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు నీతిఆయోగ్ నుంచి ప్రశంసలు దక్కాయి. దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ కడప జిల్లాలో స్మార్ట్ కిచెన్‌ను ఏపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. కడప స్మార్ట్ కిచెన్లపై నీతిఆయోగ్ ప్రశంసలు కురిపించింది. స్మార్ట్ కిచెన్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పంపిణీలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తోందంటూ ట్వీట్ చేసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా రోజూ 11 లక్షల మంది విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారని వివరించింది.

## అసెంబ్లీకి రా...నీకు నచ్చిన అంశంపై చర్చిద్దాం

- జగన్ కు మంత్రి సవిత సవాల్
- నీలా మేం దూషించం... అవమానించం
- ఒకరోజు కాకపోతే రెండ్రోజులైనా చర్చకు మేం రెడీ
- కళ్లున్న కబోదిలా .. ప్రెస్ మీట్ ల్లో మాట్లాడడం కాదు

2లో..



## పోలవరం సివిల్ వర్క్స్ 90 శాతం పూర్తయ్యాయి

- వెలిగొండ నిర్వాసితులకు నెలాఖరులోగా 600కోట్లు ఇస్తాం
- విశాఖలో డేటాసెంటర్లకు 3 టిఎంసిల గోదావరి జలాలు
- 36 ప్రాజెక్టుల నెలవారీ వర్క్ ప్రోగ్రెస్ ఇవ్వాలని సిఎం ఆదేశించారు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

2లో..



## గీత దాటితే సహించేది లేదు

- రాజగోపాల్‌రెడ్డి అలా మాట్లాడటం సరికాదు
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం
- ఇదే కాంగ్రెస్ విధానం రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం



**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదు'' అని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.

2లో..

## మోదీ ఫొటో ఎందుకు పెట్టరు?

- ఎంపీ రఘునందన్ రావు
- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో ఉండాలి
- కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి..
- రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదు

2లో..



**హైదరాబాద్, ఆగస్ట్ 14, అనంతనశక్తి న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు.

# సోషల్ మీడియాలో భాష జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

"వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లొద్దు. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకనుగుణంగానే స్పందించాలి. ఏదైనా విషయంపై మాట్లాడే సమయంలో ఆవేశాలకు గురికావొద్దు. అసభ్య పదజాలాన్ని వాడొద్దు. మహిళలను గౌరవించి మాట్లాడండి. పార్టీ అంతర్గత విషయాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడొద్దు. పార్టీ భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడే వారిని ఉపేక్షించం. పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. వారి ప్రభావానికి లోనవ్వొద్దు. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలి. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో చిక్కుకోవద్దు. పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి. పార్టీ అభ్యున్నతి, కష్టపడి పనిచేసే వారి సంక్షేమం పార్టీ దృష్టిలో ఉంటుంది. సోషల్ మీడియాలో రకరకాల విష ప్రచారాలను తిప్పి కొట్టండి" అని పవన్ పిలుపునిచ్చారు.

ఈ క్రమంలోనే జనసేన శ్రేణులకు పవన్ కళ్యాణ్ పలు సూచనలు చేశారు. ఎవరూ కూడా వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లవద్దని సూచించారు. అలాగే పార్టీల సిద్ధాంతాలు , మార్గదర్శకాలకి అనుగుణంగా స్పందించాలని స్పష్టం చేశారు. ఏదైనా విషయంపై మాట్లాడే సమయంలో ఆవేశానికి గురికావొద్దని.. అసభ్య పదజాలాన్ని వాడవద్దని ఆదేశించారు. మహిళలను గౌరవించి మాట్లాడాలన్న పవన్ కళ్యాణ్.. జనసేన అంతర్గత అంశాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడకూడదని స్పష్టం చేశారు. జనసేన భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడేవారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మరోవైపు జనసేన క్రమశిక్షణావళికి విఘాతం కలిగించేలా వ్యవహరించేవారు, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసేవారితో జాగ్రత్తగా ఉండాలని పార్టీ శ్రేణులకు పవన్ కళ్యాణ్ సూచించారు. అలాంటి వారి ప్రభావానికి లోను కావొద్దని.. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలని సూచించారు. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో పడొద్దని.. జనసేనలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. జనసేన పార్టీ కోసం కష్టించి పనిచేసేవారిని మరిచిపోనన్న పవన్ కళ్యాణ్.. సోషల్ మీడియాలో వచ్చే విష ప్రచారాలను తిప్పి కొట్టాలని సూచించారు.

మరోవైపు జనసేన పార్టీ ఎన్ఆర్ఐ ప్రతినిధిని ఉద్దేశించి.. ఒంగోలుకు చెందిన జనసేన నాయకుడు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై సదరు నేత ఇప్పటికే క్షమాపణలు కూడా తెలియజేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఇలాంటి ప్రకటన రావటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సీమాంధ్ర పాలకుల చెప్పుచేతుల్లో ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణలో ప్రజా పాలన అన్నప్పుడు తెలంగాణ ఉద్యమకారులకు, ఆది నుంచి ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు గౌరవం దక్కాలేగానీ సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పు చేతుల్లో కాంగ్రెస్ పార్టీ గానీ, ప్రభుత్వం గానీ ఉండొద్దని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. శుక్రవారం చౌటుప్పలో జరిగిన సీతా రామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన రాజగోపాల్ రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్లు, రాహుల్ గాంధీ నాయకత్వంలో కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు. తాను ఎక్కడా కాంగ్రెస్ పార్టీని విమర్శించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో బయటి నుండి వచ్చిన వ్యక్తుల ఆధిపత్యం పెరిగి నిజమైన కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందనేదే తమ బాధ అన్నారు. తెలంగాణ ఉద్యమం నడిచిందే ఆత్మగౌరవం కోసం, అట్లాంటప్పుడు ఇక్కడి ప్రజల ఆత్మగౌరవం నిలిచేలా ప్రజా పాలన ఉండాలని తెలిపారు.

**నిజమైన కార్యకర్తలకు, నేతలకు అన్యాయం చేయొద్దు**

ప్రభుత్వం పేదల కోసం పని చేయాలి. అంతేకానీ కాంట్రాక్టర్ల కోసం, పెట్టుబడిదారుల కోసం పని చేయకూడదన్నారు. ఇలాంటి వాటితో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో బలహీనపడవద్దనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ సైనికుడిగా తాను మాట్లాడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ వచ్చింది, కాంగ్రెస్ పార్టీతోటే పేదలకు న్యాయం జరుగుతుంది, కాంగ్రెస్ పార్టీ తోటే తెలంగాణ అభివృద్ధి అవుతుందని అదీ రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతుందన్నారు. బయట నుండి వచ్చి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు, నేతలకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి, కాంగ్రెస్ పార్టీలో ఉన్నోళ్లనే అణిచివేయాలని, అగౌరవ పరచాలని, అవమానించాలని చూస్తే సహించేది లేదని రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు.

**ఆ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి క్లారిటీ**

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు.

**ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి..**

తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# మంత్రి నారాయణ చంద్రబాబుకు రిలీఫ్

అమరావతి, ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్

అమరావతి ల్యాండ్ పూలింగ్ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పి. నారాయణకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. వీరిద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. చంద్రబాబు, పి. నారాయణపై 2021లో నమోదైన క్రిమినల్ కేసును జూలై 15న ఏపీ హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది. 2021 మార్చి 12న ఏపీ సీఐడీ ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే ప్రభుత్వ విధాన నిర్ణయాలు తీసుకోవడం, వాటికి సంబంధించి జీవోలు జారీ చేయడాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని క్రిమినల్ కుట్రగా పరిగణించలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

**సుప్రీంకోర్టులో ఆళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్**

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునే కారణాలు కనిపించడం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇక, అమరావతి ల్యాండ్ పూలింగ్ వ్యవహారానికి సంబంధించిన ఈ తీర్పు ఇతర కేసులపై ప్రభావం చూపదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆయా కేసులను వాటి స్వంత మెరిట్స్ ఆధారంగా నిర్ణయించాలని పేర్కొంది. దీంతో ఇతర కేసుల్లోని అంశాలను ఈ తీర్పుతో ముడిపెట్టకూడదని ధర్మాసనం స్పష్టం చేసినట్లయింది.

**రాజకీయ పోరాటాలను కోర్టులో చేయొద్దు**

విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో న్యాయస్థానం అవసరమైన రక్షణ కల్పిస్తుందని స్పష్టం చేశారు. అయితే రాజకీయ పోరాటాలను కోర్టుల వేదికగా చేయకూడదని వ్యాఖ్యానించారు. రైతుల హక్కులు, ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకుంటాయని, అయితే రాజకీయ వివాదాలను న్యాయపరమైన పోరాటాలుగా మార్చడం సరికాదని సూచించారు.

# మోదీ ఫొటో ఎందుకు పెట్టరు?

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.



# పోలవరం సివిల్ వర్క్స్ 90 శాతం పూర్తయ్యాయి

విజయవాడ ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్

పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు లతో పాటు మొత్తం 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు, ఐడిసి లిఫ్ట్స్ స్కీం, వంటి అంశాలతో పాటు, ఎల్ నినో వచ్చినటువంటి సందర్భంలో త్రాగునీటి అవసరాల నిమిత్తం ఏ రకంగా ప్రణాళిక తీసుకుంటూ ఉన్నాం, అనే అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశంలో చర్చించడం జరిగిందని తెలిపారు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**పోలవరం వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్.**

పోలవరం ప్రాజెక్టు సివిల్ వర్క్స్ 90% పూర్తయిందని, భూసేకరణ 94% పూర్తిచేశామని, అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు తరలింపు 52% పూర్తయిందని, ఇలా మొత్తం పోలవరం ప్రాజెక్టు ఈనాటికి 77% పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు. మిగిలిన బ్యాలెన్స్ పనులు కూడా త్వరితగతిన, అంటే ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్, అదేవిధంగా భూసేకరణకు సంబంధించి, కాలనీలకు సంబంధించిన పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యే విధంగా... అంటే ప్రాజెక్టును ప్రారంభించడానికి ఒక ఆరు నెలలు ముందుగానే ఒక షెడ్యూల్ ని కూడా రూపొందించుకుని, ఆ షెడ్యూల్ ప్రకారం ఆర్ అండ్ ఆర్, భూసేకరణ, కాలనీలు పూర్తి కావాలని సిఎం చంద్రబాబు నాయుడు గారు ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా పోలవరం అనేది ఒక ఇరిగేషన్ ప్రాజెక్టుగానే కాదు, భవిష్యత్తులో ఒక టూరిజం హబ్ గా కూడా చేసేవిధంగా, 10,000 ఎకరాలతో రేడియల్ సర్వే చేసి, అభివృద్ధి చేయడంతో పాటు, పోలవరం స్పిల్ వే కి సంబంధించి బ్యూటిఫికేషన్, అదేవిధంగా కనెక్టివిటీ బ్రిడ్జ్ ని కూడా ఐకానిక్ మోడల్ లో తయారు చేసుకోవడం, హైవేస్ కనెక్టివిటీ గాని, పోలవరం ప్రాజెక్ట్ నుంచి భద్రాచలం వరకు కూడా రివర్ బేస్డ్ టూరిజాన్ని అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందని అన్నారు.

**2027 మార్చి నాటికే పోలవరం పూర్తి.**

ఈవిధంగా పోలవరం ప్రాజెక్టుకు వాస్తవంగా ఇచ్చినటువంటి షెడ్యూల్ 2027 డిసెంబర్, కానీ చంద్రబాబు నాయుడు గారు పుష్కరాలు వస్తూ ఉన్నాయి కాబట్టి, పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయండి, మార్చి నెలకే అని ఆదేశాలు ఇచ్చారని, దాని ప్రకారమే ఈ 2027 మార్చి కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే లక్ష్యంగానే పనులు జరుగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవల మొదటి సారి, గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినటువంటి పరిస్థితిలో కూడా పనులు ఆగకుండా జరుగడం పట్ల సిఎం చంద్రబాబు అభినందించారని తెలిపారు. అందుకే గ్యాప్1 ఈసిఆర్ఎఫ్ పనులు 48%, గ్యాప్2 ఈసిఆర్ఎఫ్ పనులు 36% పూర్తయ్యాయని వివరించారు. ఈవిధంగా ఈసిఆర్ఎఫ్ డిజైన్స్ ప్రకారం 45.72 మీటర్లకు పూర్తి చేసుకోగలుగుతున్నామని, ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణం వల్ల ఆప్రాంతంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న గండిపోచమ్మ దేవాలయాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని సిఎం ఆదేశించారని అన్నారు మంత్రి నిమ్మల. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ప్రశ్నార్థకం చేసేసి, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేము అన్నటువంటి దశ నుంచి, 2027 కల్లా పోలవరాన్ని పూర్తి చేస్తున్నాము అనేటటువంటి భరోసాను ప్రజలకు కల్పించామని స్పష్టం చేశారు.అదేవిధంగా పోలవరంకి సంబంధించినటువంటి లెఫ్ట్ మెయిన్ కెనాల్ (LMC) 2019 2024 ఐదు సంవత్సరాల్లో కి సంబంధించి ఎక్కడా కూడా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఉత్తరాంధ్రాకి సాగునీరు, తాగునీరు, విశాఖపట్నానికి పారిశ్రామిక అవసరాలకు సైతం నీళ్ళిచ్చేటువంటి, పోలవరం ఎడమ ప్రధాన కాలువని ఐదు సంవత్సరాలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి, ఆ ప్రాజెక్టుని నీరుగారిస్తే, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1500 నుండి 1800 కోట్ల రూపాయలు ఖర్చుచేసి, ఎల్ఎంసి (లెఫ్ట్ మెయిన్ కెనాల్) చాలా క్రిటికల్ వర్క్స్ తో పాటు, 11 చోట్ల నేషనల్ హైవేస్ క్రాస్ చేసేటటువంటి క్రిటికల్ వర్క్స్ ని సైతం అధిగమించామని అన్నారు. పంపా, తాండవ, ఏలేరు రిజర్వాయర్, అదేవిధంగా వరాహ, ఇటువంటి నదులను అన్నీ కూడా, క్రాస్ చేసేటటువంటి కెనాల్ వర్క్స్ గాని, ఇలా క్లిష్టమైన పనులను కేవలం రెండేళ్ళలోనే పూర్తి చేసుకుని, ఈ నెలాఖరు కల్లా ఆ పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుండి నీటిని విడుదల చేసి, ఉత్తరాంధ్రాకి అనకాపల్లి వరకు కూడా గోదావరి జలాలు తీసుకెళ్లే పనులు పూర్తి చేస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు.

**విశాఖ డేటా సెంటర్లకు గోదావరి జలాలు.**

కొంతమంది గొడ్డలి పార్టీ నాయకులు మాట్లాడుతూ విశాఖపట్నంలో గూగుల్ తో పాటు వచ్చే ఇతర డేటా సెంటర్స్ కు నీళ్లే లేవని మాట్లాడుతూ ఉన్నారు. వాళ్ల పరిపాలన ఉంటే అట్లానే ఉంటుంది. కానీ ఈరోజు పరిపాలన కూటమి ప్రభుత్వ పరిపాలన, చంద్రబాబు నాయుడు గారి పాలన. ఈరోజు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ తోటి విశాఖకి గాని, ఉత్తరాంధ్రాకి గాని పుష్కలంగా నీరు వస్తుంది. గూగుల్ గాని, ఇతర డేటా సెంటర్స్ గాని మొత్తం సంవత్సరానికి మూడు టిఎంసి ల నీళ్లు అవసరం అవుతాయని, ఆనీటిని పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అందిస్తామని అన్నారు.

**వెలిగొండ నిర్వాసితులకు 600 కోట్లు క్లియర్ చేయబోతున్నాం.**

మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు. ఆ వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి కూడా హెడ్ రెగ్యులేటర్స్, టన్నెల్స్ లో లైనింగ్, బెంచింగ్, ఫీడర్ కెనాల్ కి సంబంధించినటువంటి సిసి వాల్, ఫీడర్ కెనాల్ సిసి లైనింగ్, నల్లమల సాగర్ కి సంబంధించినటువంటి రెగ్యులేటర్స్ పనులన్నిటినీ కూడా ఈ నెల 25కి పూర్తి చేసుకుంటూ, దానితో పాటుగా. టన్నెల్ 2 లో చిక్కుకున్నటువంటి టిబిఎమ్ మిషన్ కూడా, దగ్గర దగ్గర 1900 టన్నుల ఐరన్ కి గానూ, ఇప్పటికీ 1500 టన్నులు తొలగించామని చెప్పారు. మిగిలిన బ్యాలెన్స్ 400 టన్నులని కూడా డిస్మాంటిల్ చేసి అది కూడా కటింగ్ అవ్వకపోతే మళ్లీ గ్రానైట్ కటింగ్ మిషన్ తో సహా, డైమండ్ కటింగ్ మిషన్ ని కూడా తీసుకొచ్చి దానికి కూడా ట్రయల్ చేసి... ఇలా ఇన్ని కష్టాల మధ్య అర్ధరాత్రి కూడా షిఫ్టులు పెట్టుకుని పనులు జరుగుతూ ఉన్నాయి అని అన్నారు. ఇలా ఉంటే, గత ముఖ్యమంత్రేమో, వెలిగొండ పూర్తయిపోయిందని జాతికి అంకితం చేసేసానని ఒక దగా, మోసం చేశాడని, 2026 ఆగస్టులో కూడా రాత్రి పగలు తేడా అనేది లేకుండా డే అండ్ నైట్ వెలిగొండ పనులు జరుగుతూ ఉన్నాయని వివరించారు.

అదేవిధంగా వెలిగొండ నిర్వాసితులకు గత ఐదేళ్ల పాలనలో 900 కోట్ల రూపాయలు ఆర్ అండ్ ఆర్ ఇవ్వాల్సి ఉంటే, ఐదు సంవత్సరాల్లో ఒక్క చిల్లి గవ్వ, ఆ నిర్వాసితులకి ఇవ్వడానికి జగన్ కు మనసు రాలేదని, కానీ జాతికి అంకితం అంటూ, దగా, మోసం చేశాడని దుయ్యబట్టారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆర్ అండ్ ఆర్ కి సంబంధించి ఇటీవలే 318 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగింది. మిగిలినటువంటి నిర్వాసితులకు ఇవ్వవలసిన 600 కోట్లను 17వ తారీకు నుంచి ఒక షెడ్యూల్ ప్రకారం 24వ తేదీ లోపల ఇవ్వాలని చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం జరిగింది అని పేర్కొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించి చిన్న చిన్న సమస్యలు కూడా గురువారం మార్కాపురం కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో గుర్తించి, వాటిని కూడా మానవతా దృక్పథంతో ఎంతవరకు వాళ్లకు సహాయం చేయగలిగితే అంతవరకు కూడా సహాయం చేయమని చంద్రబాబు నాయుడు గారు చెప్పడం జరిగింది అని అన్నారు. ఆ రకంగానే హ్యూమన్ గ్రౌండ్స్ లో జెన్యూన్ గా ఎవరైతే ఉంటారో వాళ్లందరికీ కూడా న్యాయం చేసేటటువంటి బాధ్యత కూడా ఈ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చెప్పారని స్పష్టం చేశారు.

**ఇరిగేషన్ క్యాలెండర్ తో పాటు ప్రాజెక్టుల వర్క్ షెడ్యూల్ ఇవ్వాలి.**

ఇదేవిధంగా హంద్రీనీవా, ఎల్ఎంసి (లెఫ్ట్ మెయిన్ కెనాల్), వెలిగొండ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఒక షెడ్యూల్ ఇచ్చాం, ఆ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తూ ఉన్నాం అని, తరువాత పోలవరం ప్రాజెక్టు 2027కి షెడ్యూల్ పెట్టి పూర్తి చేస్తూ ఉన్నాం అని అన్నారు. భవిష్యత్తులో కూడా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులని పూర్తి చేయడానికి, ఇరిగేషన్ క్యాలెండర్ ని రూపొందించి, ఆ ఇరిగేషన్ క్యాలెండర్ లో ఉన్నటువంటి ప్రాజెక్టుల యొక్క ప్రగతి కూడా నెలవారీ ప్రణాళిక వేసుకుని... నెలవారీ ప్రణాళిక తోపాటు, వర్క్ ప్రోగ్రెస్. ఏ నెలకానెల కూడా ఆ 36 ప్రాజెక్టుల మీద కూడా త్వరగా ఇవ్వాలని సిఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి నిమ్మల తెలిపారు.

**ఐడిసికి పూర్వ వైభవం తీసుకొస్తున్నాం.**

గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1040 లిఫ్టులు ఉంటే, అందులో పూర్తిస్థాయిలో పనిచేసేవి కేవలం 150 లిఫ్టులు మాత్రమే. 8 లక్షల ఎకరాల ఆయకట్టు లిఫ్టు స్కీం ల ద్వారా సాగవుతుండగా, ఈ స్కీంలు నిర్వీర్యమైపోవడంతో సగానికి పైగా సాగుదెబ్బతింది. ఐదు సంవత్సరాల గత గొడ్డల పార్టీ పాలనలో ఆ లిఫ్టుల్ని నిర్వీర్యం చేసేస్తే రైతులందరూ కూడా వ్యవసాయం వదులుకున్నటువంటి పరిస్థితి. అటువంటి స్థితిలో ఆ లిఫ్టులన్నింటినీ కూడా ప్రభుత్వమే తీసుకుని, ప్రభుత్వమే ఆ లిఫ్టుల్ని బాగుచేయడానికి, అదేవిధంగా రిపేర్లు చేయడంతో పాటు, ఇంకొక 10 సంవత్సరాల పాటు ప్రభుత్వమే ఓ అండ్ ఎమ్ కూడా చేసేటటువంటి విధంగా కూడా ముందుకు వెళ్లమని చెప్పి కూడా సిఎం చంద్రబాబు ఆదేశించడం జరిగిందన్నారు. దాని ప్రకారమే రాబోయేటటువంటి రోజుల్లో ఆ లిఫ్టులన్నిటినీ కూడా ప్రభుత్వమే ఆ రిపేర్లు చేయడంతో పాటుగా 10 సంవత్సరాల పాటు మెయింటెనెన్స్ చేసేటటువంటి విధంగా కూడా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

**తాగునీటికే మొదటి ప్రాధాన్యత.**

ఎల్ నినో, సూపర్ ఎల్ నినో నేపథ్యంలో త్రాగునీటికి ప్రథమ ప్రాధాన్యతని ఇవ్వాలని, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కూడా సూచనలు చేసిందని, 2027 జూన్ వరకు కూడా ఇప్పుడు ఉన్నటువంటి నీటిని భద్రపరుచుకోవాలని సూచించిందని తెలిపారు. దీన్నే మనము కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోనూ కూడా ఇరిగేషన్, రెవెన్యూ, అగ్రికల్చర్, ఈ మూడు డిపార్ట్‌మెంట్లని కూడా కోఆర్డినేట్ చేసుకుంటూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రజలని, రైతులని ఎప్పటికప్పుడు ఎడ్యుకేట్ చేసుకుంటూ ఇచ్చేటటువంటి నీళ్లు తాగునీటికే ఉపయోగించుకోవాలి. తాగునీటి అవసరాలని మించి ఎక్కడైనా నీళ్లు ఉంటే అది ఆరుతడి పంటలకు మాత్రమే ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. ఒక్క గోదావరి డెల్టాకు మాత్రమే ఈ ఖరీఫ్ కి వరి సాగుకి ఇస్తున్నామో, మిగిలిన ప్రాంతాల్లో త్రాగునీటికే ప్రాధాన్యత. ఆ త్రాగునీటి కి మించి ఎక్కడైనా మనకు ఉంటే అది ఆరుతడి పంటలకు మాత్రమే వెళ్లాలి తప్ప మరి వేరే వాటికి ఉపయోగించరాదని స్పష్టం చేశారు.

# అసెంబ్లీకి రా...నీకు నచ్చిన అంశంపై చర్చిద్దాం

పులివెందుల/కడప ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్

'కళ్లున్న కబోదుల్లా మాట్లాడడం కాదు... ప్రెస్ మీట్లు పెట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రా... రాయలసీమ, పులివెందుల అభివృద్ధి, మెగా డీఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల్లో అక్రమాలు... మీకు నచ్చిన ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం. గతంలో టీడీపీ సభ్యులను, వారి కుటుంబ సభ్యులను మీరు దూషించినట్లు మీ కుటుంబ సభ్యులను మేం దూషించం... గౌరవంగా సభను నిర్వహిస్తున్నాం...ఒకరోజు కాకుంటే రెండ్రోజులు చర్చిద్దాం... సభకు రా..' అని జగన్ ను జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేది ప్రజలు మాత్రమే, తాము కాదని అన్నారు. పులివెందుల ప్రజలు ఎమ్మెల్యేగా జగన్ కు అవకాశమిచ్చారని, తమ నియోజకవర్గవాసుల ఆకాంక్షలను నెరవేర్చేలా అసెంబ్లీకి రావాల్సిన బాధ్యత ఆయన ఉందన్నారు. గ్రూప్ 1 జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చడానికే జగన్, ఆయన బ్యాచ్ మెగా డీఎస్సీలో అక్రమాలంటూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కడప జిల్లాలో రూ.220 కోట్లకుపైగా ఆర్ అండ్ బి రోడ్లు, ఇతర రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఆ పనులన్నీ 80 శాతం పూర్తి కావొచ్చాయని, మిగిలిన 20 శాతం త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. పులివెందులలో ఒకరోజు పర్యటన నిమిత్తం వచ్చిన జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత... మరో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి ఆర్ అండ్ బి రహదారులు, బీసీ సంక్షేమ పథకాలపై శుక్రవారం సమీక్షలు నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో పులివెందుల నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవితో కలిసి మంత్రులు మాట్లాడారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంతో పాటు రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రైజింగ్ రాయలసీమే లక్ష్యంగా ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తూనే, మరోవైపు పరిశ్రమలను స్థాపిస్తున్నారన్నారు. కర్నూలు, ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తూ, రాయలసీమను పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

**మెగా డీస్సీపై డైవర్షన్ పాలిటిక్స్**

తాను చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోడానికి జగన్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను సిట్ బట్టబయలు చేసిందన్నారు. ఈ అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ జగన్, ఆయన బ్యాచ్ పెద్ద డ్రామాకు తెరతీసిందన్నారు. గొడ్డలి పార్టీ నాయకులు ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. చివరికి విద్యార్థులను, కూలీలను ధర్నాలకు తరలించే దుస్థితికి వైసీపీ నాయకులు దిగజారిపోయారని మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

**అసెంబ్లీకి రా...నీకు నచ్చినంత సమయం ఇస్తాం**

తమకు ప్రతిపక్ష హోదా లేదని, అందుకే శాసనసభకు వెళ్లడం లేదని జగన్ అనడం విడ్డూరంగా ఉందని మంత్రి సవిత అన్నారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేది కూటమి ప్రభుత్వం కాదని, ప్రజలను స్పష్టంచేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ కు ఈ విషయం తెలియదా..? అని ప్రశ్నించారు. కళ్లున్న కబోదుల్లా మాట్లాడడం కాకుండా, ప్రెస్ మీట్లు పెట్టడం కాకుండా దమ్ముంటే అసెంబ్లీకి రావాలని జగన్ కు మంత్రి సవిత సవాల్ చేశారు. ఆయనకు నచ్చిన అంశంపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాయలసీమ, పులివెందుల అభివృద్ధి, మెగా డీఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల్లో అక్రమాలు... ఇలా ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైసీపీ హయాంలో టీడీపీ సభ్యులను, వారి కుటుంబ సభ్యులను గొడ్డలి పార్టీ నాయకులు దూషించినట్లు తమ వ్యవహరించబోమన్నారు. జగన్ కుటుంబ సభ్యుల ఊసే ఎత్తబోమని, సభను ఇంటిల్లిపాది చూసేలా గౌరవంగా సభను నిర్వహిస్తున్నామన్నారు. జగన్ కు ఎంతసమయం కావాలంటే అంతసేపు మైక్ ఇస్తామని, ఒకరోజు కాకుంటే రెండ్రోజులు చర్చిద్దామని, సభకు రావాలని కోరారు.

**గడువులోగా రోడ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సిందే...**

అంతకుముందు పులివెందుల ఆర్ అండ్ గెస్ట్ హౌస్ లో కడప జిల్లాలో రోడ్ల నిర్మాణాలపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి మంత్రి సవిత సమీక్షించారు. ఏయే ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో..? అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, దీన్ని అనుకూలంగా తీసుకుని సకాలంలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్థిక ఇబ్బందులున్నా రహదారుల నిర్మాణానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డును కూడా నిర్మించలేదన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారని మంత్రి సవిత గుర్తు చేశారు.

**అర్హులైన నేతన్నలందరికీ ఆర్థిక సాయం**

అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో పథకం కింద రూ.25 వేలు ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఇంకా అర్హులు ఉంటే గుర్తించి, వారికి కూడా నేతన్నల సేవలో పథకాన్ని వర్తింపజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపైనా మంత్రి సవిత సమీక్షించారు. విద్యార్థులను కంటికి రెప్పల చూసుకోవాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో తాజా ఆహారం, వేడి చేసి చల్లార్చిన నీటిని అందివ్వాలన్నారు. బయట ఆహారం హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాల్లోకి అనుమతివ్వొద్దని స్పష్టం చేశారు. హాస్టళ్లను, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వచ్చే టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలను రాబట్టడానికి ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశాల్లో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేశ్ రెడ్డి, పులివెందుల నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి, ఆర్ అండ్ బి, బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

# గీత దాటితే సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు తెరపైకి వచ్చాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారగా..వాటిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణను ఎవరూ ఉల్లంఘించరాదని.. గీత దాటితే ఎంతటి నాయకుడైనా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

ఈ వ్యవహారాన్ని ఏఐసీసీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి..ఆ తర్వాత చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి నుంచి సాధారణ కార్యకర్త వరకు అందరికీ ఒకే విధమైన రూల్స్ వర్తిస్తాయని తేల్చి చెప్పారు. పార్టీపై బహిరంగంగా విమర్శలు చేయడం క్రమశిక్షణారాహిత్యంగా పరిగణించాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు.

అయితే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామనే హామీ ఇచ్చారని జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఎన్నికల సమయంలో ఏదైనా హామీ ఇచ్చి ఉండొచ్చని.. అయితే మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలి అనేది పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి నాయకుడి కోరికను ఒకేసారి నెరవేర్చడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఇక పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కాదని పేర్కొన్న మహేశ్‌కుమార్ గౌడ్.. సమిష్టి నిర్ణయాలతోనే ముందుకు సాగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల ఆధిపత్యం పెరగడం వల్ల.. అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు కూడా గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# పోలవరం పనులు స్పీడప్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆలయాన్ని పరిరక్షిస్తూ, స్థానిక ప్రజల సెంటిమెంట్‌కు ఎలాంటి భంగం కలగకుండా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులతో పాటు స్థానిక విశ్వాసాలు, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని నీటి వనరుల సమర్థ నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, భవిష్యత్ తాగు, సాగునీటి అవసరాలపై సమీక్షలో సమగ్రంగా చర్చ జరిగింది. పోలవరం పనులను నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయడంతో పాటు అనుబంధ మౌలిక వసతులను కూడా సమాంతరంగా అభివృద్ధి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అధునాతన అగ్నిమాపక వాహనాలు ప్రారంభం**

రాష్ట్ర అగ్నిమాపకశాఖలోకి మరికొన్ని ఆధునిక వాహనాలు రానున్నాయి. తాజాగా 58 ఆధునిక ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు.. 20 వాటర్ బౌజర్లు.. 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలను లాంచ్ చేశారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 25 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలను అగ్నిమాపక శాఖ సమకూర్చుకుంది. భారీ అగ్నిప్రమాదాల్లో మంటలను అదుపు చేయడానికి అవసరమయ్యే నిరంతర నీటి సరఫరాకు 20 వాటర్ బౌజర్లు కొనుగోలు చేసింది. ఇరుకైన, రద్దీ ప్రాంతాల్లోకి వేగంగా చేరుకునేలా 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలు పనిచేస్తాయి. తొలి దశలో ఇప్పటికే రూ.33 కోట్లతో 65 ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వాహనాల ప్రత్యేకతలను అధికారులు సీఎంకు వివరించారు. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు.



# జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలు.. నోటిఫై చేసిన ప్రభుత్వం



హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, లద్దాఖ్‌లతో పాటు కొన్ని ప్రాంతాల్లో సెప్టెంబర్ 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుంది. ఈ క్రమంలోనే జనగణనలో అడగాల్సిన 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. వీటిలో కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు.

ఈ ప్రాంతాలలో జనాభా గణన సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జరుగుతుంది. అంతకుముందే, ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (ఎస్ఈ) పోర్టల్‌ను, జనగణనకు సంబంధించి పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా.. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనగణన వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది.

**రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా రూపొందించిన ప్రశ్నలలో కొన్ని..**

జన్మస్థలం, ప్రస్తుత నివాస స్థలం, వలసకు కారణం
ప్రస్తుతం ఉన్న ప్రదేశంలో ఎంత కాలం నుంచి ఉంటున్నారు? ఎందుకు ఉంటున్నారు?
వ్యక్తి వైవాహిక స్థితి.. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ, మాతృభాష, మాట్లాడగలిగే ఇతర భాషల వివరాలు
అక్షరాస్యతతో పాటు... డిజిటల్ అక్షరాస్యత స్థితి
ఆర్థిక కార్యకలాపాల వివరాలు
ఉద్యోగం కోసం వెతుకుతుంటే... ఎలాంటి పనికోసం వెతుకుతున్నారనే విషయంపై స్పష్టత
వివాహిత, వితంతువు, విడాకులు తీసుకున్న మహిళలకు సంబంధించి... పిల్లలతో సహా అన్ని వివరాల నమోదు
కొవిడ్19 వ్యాక్సినేషన్ చేయించుకున్న ప్రదేశం
బ్యాంకు ఖాతాలు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలతో కలిపి... మొత్తం 40 అంశాలపై వివరాల సేకరణ

# 1057 మందికి గ్యాలంట్రీ/సేవా పతకాలు.. ఏపీ, తెలంగాణ పోలీసులకు ఇలా..

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్, పౌర రక్షక వంటి విభాగాల్లో సేవలందిస్తోన్న సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం గ్యాలంట్రీ/సేవా పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1057 మందిని ఈ పతకాలకు హోంశాఖ (MHA) ఎంపిక చేసింది. వీరిలో 92 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు ఇవ్వనుంది. 301 మందికి పోలీసు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 664 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) అందించనుంది.

గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్న 301 మందిలో అత్యధికంగా 197 మంది తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులున్నారు. జమ్మూకశ్మీర్‌లో పనిచేస్తోన్న 51 మంది, ఈశాన్య రాష్ట్రాల్లో విధులు నిర్వర్తిస్తోన్న 12 మంది పోలీసులకు ఈ పతకాలు దక్కాయి. ప్రాణాలను, ఆస్తులను కాపాడటం, నేరాలను నిరోధించడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారికి కేంద్ర హోంశాఖ ఏటా ఈ అవార్డులను అందజేస్తోంది.




**తెలుగు రాష్ట్రాల పోలీసులకు ఇలా..**

తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పోలీసులకు ఈ పతకాలు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 21 మంది వీటికి ఎంపికయ్యారు. ఇందులో ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు లభించనున్నాయి. ఏపీకి చెందిన ఐజీ గుడి విజయ్ కుమార్, ఐజీ బలంకారి వెంకట రామిరెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. హెడ్ కానిస్టేబుళ్లు కొర్లాన మహేశ్, పైడి శ్రీరామమూర్తి, అడారి హేమసుందర రావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రుతాల కన్నబాబుకు గ్యాలంట్రీ మెడల్స్ దక్కాయి.

తెలంగాణ నుంచి 15 మంది జాబితాలో ఉన్నారు. వీరిలో ముగ్గురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 10 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. తెలంగాణ అదనపు డిప్యూటీ కమిషనర్ జోగుల నర్సయ్య, ఎస్పీ ఆర్. జగదీశ్వర్ రెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు అందుకోనున్నారు. జూనియర్ కమాండోలు బి. సత్యరావు, కె. సందీప్ కుమార్, జె. వంశీకృష్ణ గ్యాలంట్రీ మెడల్‌స్‌కు ఎంపికయ్యారు.

**21 మంది సీబీఐ అధికారులకు..**

ఇక, కేంద్ర దర్యాప్తు సంస్థలో పనిచేస్తోన్న 21 మంది అధికారులకు కూడా
ఈ పతకాలు దక్కాయి. వీరిలో ఆరుగురు అధికారులకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 15 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. వీరిలో విశాఖపట్నం డీఎస్పీ (సీబీఐ)గా ఉన్న సంజయ్ కుమార్ సమాల్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం దక్కింది.

# 'కరూర్' బాధితులకు ఉద్యోగాలు.. విజయ్‌కు సుప్రీంలో ఊరట



కరూర్ తొక్కిసలాట ఘటన బాధితులకు ఉద్యోగాల వ్యవహారానికి సంబంధించి విజయ్‌ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నియామకాలు చెల్లవంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పిటిషన్‌దారులకు నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా సుప్రీంధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంటి పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరా ఇవ్వొద్దా? అని వ్యాజ్యదారులను ప్రశ్నించింది.

''తొక్కిసలాట జరిగింది.. ప్రజలు చనిపోయారు. ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థిక పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాంటప్పుడు వారికి ఉద్యోగం ఇవ్వడాన్ని ప్రశ్నించడం సమంజసమేనా? ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేందుకు మీరెవరు? ఒకవేళ సంపాదించే ఇంటిపెద్ద ప్రమాదవశాత్తూ మరణిస్తే.. ఆ వ్యక్తి కుమార్తె లేదా కుమారుడికి ప్రభుత్వాలు ఉపాధి ఇవ్వకూడదా?'' అని సుప్రీం ధర్మాసనం పిటిషన్‌దారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు విజయ్ సర్కారు ఉద్యోగాలు కల్పించడంపై మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై జులైలో విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఆ నియామకాలు చెల్లవని తీర్పునిచ్చింది. ''ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు'' అని నాడు హైకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. దీంతో హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించగా.. విజయ్ సర్కారుకు తాజాగా ఊరట లభించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. విజయ్ ఎన్నికల ప్రచారం నిమిత్తం టీవీకే పార్టీ ఏర్పాటు చేసిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్.. అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. అన్నట్లుగానే.. జులై 10వ తేదీన కరూర్‌లో పర్యటించి.. అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవం ముందురోజు.. దిల్లీలో పలు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందురోజు దేశరాజధాని దిల్లీ లో బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. దిల్లీ హైకోర్టు, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహా ఇతర ప్రాంతాలకు శుక్రవారం బెదిరింపు మెయిల్ వచ్చింది. ఖలిస్థాన్ పేరిట దీనిని పంపినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

దిల్లీ హైకోర్టులో శనివారం మధ్యాహ్నం 2.11 గంటలకు బాంబు పేలుతుందని, ఆ తర్వాత దిగువ కోర్టుల్లో పేలుళ్లు జరుగుతాయని ఆ మెయిల్‌లో దుండగులు హెచ్చరించారు. ఖలిస్థానీ వేర్పాటువాద సభ్యులు ఇప్పటికే రాజధాని నగరానికి చేరుకున్నారని పేర్కొన్నారు. జామ్‌నగర్ హౌస్, ఝుండేవాలన్ బిల్డింగ్, సాకేత్ ఆఫీస్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఆఫీస్, విమానాశ్రయం టర్మినల్ 3, దిల్లీ మెట్రో, అంబాలాకు వెళ్లే రైళ్లు.. ఇలా పలు ప్రదేశాలను దుండగులు మెయిల్‌లో ప్రస్తావించారు. స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో దిల్లీలో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమల్లో ఉన్నాయి. ఈ బెదిరింపు మెయిల్ నేపథ్యంలో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తమయ్యారు. అందులో చెప్పిన ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతానికి అనుమానాస్పదంగా ఏమీ గుర్తించలేదని అధికారిక వర్గాల సమాచారం.



# తప్పు చేశా.. ఎవరూ ఆ రూట్‌లో అమెరికాకు వెళ్లొద్దు!



భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన 'డంకీ' మార్గాల్లో అమెరికా సహా ఇతర విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో డంకీరూట్‌లో మెక్సికోకు వెళ్లిన ఓ పంజాబ్ యువకుడి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఏజెంట్ల మాటలు నమ్మి తాను మోసపోయానని.. ఎవరూ డంకీ మార్గంలో విదేశాలకు వెళ్లొద్దని అతడు చేతులు జోడించి వేడుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. సురక్షితంగా తీసుకువెళ్తామని నమ్మించి.. డంకీ మార్గంలో మెక్సికో కు తీసుకువెళ్లిన

ఏజెంట్లు తనను బంధించారని ఆరోపించారు. వారి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించగా.. తనపై తీవ్రంగా దాడి చేశారన్నారు. మరో వ్యక్తి సాయంతో తాను తప్పించుకోగలిగానని.. తీవ్ర గాయాల కారణంగా నడవలేని స్థితిలో ఉన్నానని పేర్కొన్నారు. అలాంటి ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని భారతీయులకు సూచించారు. గురువారం పోస్ట్ చేసిన ఈ వీడియోలో అతడి పేరు, చిరునామా వంటి విషయాలను వెల్లడించలేదు.

**ఏమిటీ డంకీ రూట్?**

**విదేశాలకు అక్రమంగా వెళ్లేందుకు అనుసరించే మార్గాన్నే 'డంకీ' రూట్‌గా వ్యవహరిస్తుంటారు. ఇది పంజాబీ వాడుక భాష నుంచి వచ్చింది. అంటే ఎటువంటి ప్రణాళిక లేకుండా ఒకచోట నుంచి మరోచోటకు వెళ్లడం. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, షిప్ కంటైనర్లు, వాహనాల్లో రహస్య కంపార్టుమెంట్లలో దేశ సరిహద్దులు దాటిస్తారు. ఇందుకోసం భారీ మొత్తంలో ఏజెంట్లు డబ్బులు వసూలు చేస్తారు. ప్రమాదకర పరిస్థితుల్లో అంతర్జాతీయ సరిహద్దులు దాటించుకుంటూ చట్టవిరుద్ధంగా ఓ దేశంలోకి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తారు. యూరోపియన్ యూనియన్ ఇచ్చే షెంజెన్ టూరిస్టు వీసాతో ఈ పద్ధతి మొదలవుతుంది. దీనివల్ల 26 దేశాల్లో తిరిగేందుకు వీలుంటుంది. నకిలీ దస్త్రాలు లేదా వాహనాల్లో రహస్యంగా యూకే లేదా అమెరికా దేశాలకు వెళ్లేందుకు అక్కడి కన్సల్టెంట్ల సాయం తీసుకుంటారు. కొందరు భారతీయులు మాత్రం కెనడా, అమెరికా, యూకేలకు అక్రమంగా వెళ్లేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.**

## దెయ్యాల భయంతో.. హాస్టల్ నుంచి వెళ్లిపోయిన 608 మంది విద్యార్థులు



హాస్టల్‌లో దెయ్యాలు తిరుగుతున్నాయనే భయం తో ప్రభుత్వ బోర్డింగ్ హాస్టల్ నుంచి 608 మంది విద్యార్థులు వెళ్లిపోయారు. ఈ ఘటన మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో చోటుచేసుకుంది. డోమా ప్రభుత్వ బోర్డింగ్ హాస్టల్‌లో అర్ధరాత్రి సమయంలో విచిత్రమైన, భయానక శబ్దాలు వినిపిస్తున్నాయని కొంతమంది బాలికలు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌లో దెయ్యాలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయనే వార్తలు వ్యాపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వందలాది మంది విద్యార్థులు హాస్టల్‌ను విడిచి ఇళ్లకు వెళ్లిపోయారు.

అయితే, ఇది మానసిక ఆరోగ్య సమస్య అని హాస్టల్ యాజమాన్యం తెలిపింది. ఫిర్యాదు చేసిన బాలికలను మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించినట్లు పేర్కొంది. సదరు విద్యార్థినులు తీవ్రమైన హిస్టీరియా వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని వైద్యులు తెలిపినట్లు యాజమాన్యం వెల్లడించింది. వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపింది. దీనిపై వదంతులను వ్యాప్తి చేయవద్దని కోరింది. విద్యార్థుల్లో నెలకొన్న భయాలను తగ్గించి, వారి చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

# ఇండిగో విమానం రద్దు

**- లగేజీ బెల్ట్‌పైకి ఎక్కి మహిళ నిరసన**

అత్యవసరంగా వెళ్లాల్సిన సమయంలో ఇండిగో విమానం రద్దవడంతో ఓ మహిళ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. లగేజీ బెల్ట్ పైకి ఎక్కి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. భువనేశ్వర్ విమానాశ్రయంలో చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో వైరల్‌గా మారింది. అసలేమయ్యిందంటే..?

షెడ్యూల్ ప్రకారం..గురువారం మధ్యాహ్నం 2:35 గంటలకు ఇండిగో విమానం భువనేశ్వర్ నుంచి దిల్లీ బయల్దేరాల్సి ఉంది. ప్రయాణికులు గంటల పాటు విమానాశ్రయంలో ఎదురు చూసినప్పటికీ ఎయిర్‌లైన్స్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. సాయంత్రం 5:30 సమయంలో విమానం రద్దయినట్లు ప్రకటించారు. అనంతరం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో ఓ ప్రయాణికురాలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. లగేజీ బెల్టుపైకి ఎక్కి విమానాశ్రయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. వారి ఫైళ్లు విసిరికొట్టారు. అనారోగ్యంతో ఉన్న తన బిడ్డ దగ్గరకు వెళ్తున్నానని.. తనకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పట్టుబట్టారు. చివరకు సిబ్బంది జోక్యం చేసుకుని నచ్చచెప్పడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

## ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిన దేశ విభజన: ప్రధాని మోదీ



: దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది.

''ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయి'' అని మోదీ పేర్కొన్నారు.

## అది నాకు, విద్యార్థులకు మధ్య సమస్య.. మీ జోక్యం ఎందుకు?: సీజేఐ

నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ t)ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. ''రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు'' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. ''ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వాళ్లెవరు..?'' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.





# రుతుపవనాలపై ఎన్నో ప్రభావాలు!

నైరుతి రుతుపవనాలు భారతదేశానికి ఆయువు పట్టు. రుతుపవనాల్లో అస్థిరత ఏర్పడితే భారత్‌తోపాటు యావత్ దక్షిణాసియాలో ప్రజలకు మంచినీటి లభ్యత, వ్యవసాయం, ప్రజల జీవనోపాధులు దెబ్బతింటాయి. నైరుతి రుతుపవన వర్షపాతాన్ని అనేక వాతావరణ, సముద్ర పరిణామాలు ప్రభావితం చేస్తాయి. వీటిలో అల్పపీడనాలు, ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్, హిందూ మహాసముద్ర డైపోల్, పసిఫిక్ డెకేడల్ ఆసిలేషన్ (పీడీవో), అట్లాంటిక్ మల్టీడెకేడల్ ఆసిలేషన్ (ఏఎంవో) ఉంటాయి. ఇవన్నీ కలసికట్టుగా పనిచేస్తాయి.

వాతావరణంలో అల్పపీడనం ఏర్పడిన ప్రాంతంలో చుట్టుపక్కల ప్రాంతాలకంటే పీడనం తక్కువగా ఉంటుంది. వేసవిలో భారతీయ భూభాగం తన చుట్టుపక్కల సముద్రాలకంటే చాలా వేగంగా వేడెక్కుతుంది, ఫలితంగా అల్పపీడన ప్రాంతం లేదా తుపాను ఏర్పడుతుంది. ఖండాలపై పెద్దయెత్తున ఏర్పడే అల్పపీడన ప్రాంతాలు రుతుపవన ప్రవాహాలను నడిపించడంలో సహాయపడతాయి. పెద్ద భూభాగాలపై ఏర్పడే అల్పపీడనాల వల్ల రుతుపవన ప్రవాహాలు ఏర్పడతాయి. దీనివల్ల భూమి వైపు స్థిరమైన గాలులు వీస్తాయి. మహాసముద్రాల పైనుంచి తేమతో కూడిన గాలి భూమిపైకి వస్తుంది. రుతుపవన కాలంలో భారత భూభాగంపైనున్న వాతావరణ పొరల్లో దిగువ నుంచి మధ్య ట్రోపోస్ఫియర్ వరకు తేమ బాగా పెరుగుతుంది. ఈ తేమ మన ప్రాంతంలో అధిక వర్షపాతానికి తోడ్పడుతుంది. రుతుపవన కాలంలో అల్పపీడనాలకు బలం చేకూరుతుంది. అల్పపీడన వ్యవస్థల జీవితకాలం 3-5 రోజులు ఉంటుంది. ఇవి తరచుగా బంగాళాఖాతంలో, దాన్ని ఆనుకున్న భూభాగంలో ఏర్పడి భారతదేశం వైపు ప్రయాణిస్తాయి. ఇవి భారత ఉపఖండం పైకి పెద్ద మొత్తంలో తేమను మోసుకొస్తాయి. దేశంలో సుమారు 50శాతం రుతుపవన వర్షపాతానికి ఈ అల్ప పీడనాలే కారణమవుతాయి. వర్షా భావ ప్రాంతాలకు వానలు తెస్తాయి. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఎంత తరచుగా ఏర్పడతాయనేదాని మీద రుతుపవన ద్రోణి ఆధారపడి ఉంటుంది. రుతుపవన ద్రోణి అనేది వేసవిలో భూమిపై వేడి బాగా పెరిగినప్పుడు ఏర్పడే ఒక అల్పపీడన వాతావరణ మండలం. తేమతో కూడిన సముద్రపు గాలులు పొడి గాలితో ఢీకొన్నప్పుడు ఏర్పడే ఈ అల్పపీడన ద్రోణి ప్రపంచ వాతావరణానికి చోదక శక్తిగా పనిచేస్తుంది.

సముద్ర ఉష్ణోగ్రతల మూలంగా...

హిందూ మహాసముద్ర ద్విధ్రువత(ఐవోడీ)ను 'ఇండియన్ నినో' అని కూడా పిలుస్తారు. హిందూ మహాసముద్ర పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రతల్లోని వ్యత్యాసాన్నే ద్విధ్రువత (డైపోల్) అంటారు. పశ్చిమ హిందూ మహాసముద్రం వెచ్చగా ఉంటే దాన్ని సానుకూల ఐవోడీ అంటారు. అది ఇండియాలో మంచి రుతుపవన వర్షపాతానికి అనుకూలంగా ఉంటుంది. ఈ సానుకూల దశలో, సుమత్రా-జావా తీరం వెంబడి సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణంకంటే తక్కువగా ఉంటాయి, అదే సమయంలో పశ్చిమ ఉష్ణమండల హిందూ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. ఐవోడీ పాజిటివ్ దశ అత్యంత సానుకూలంగా ఉంటే, తూర్పు శీతలీకరణ బలపడుతుంది. ఇది భూమధ్యరేఖ వెంబడి తూర్పు నుంచి మధ్య హిందూ మహాసముద్రం వరకు అసాధారణ పొడి పరిస్థితులను సృష్టిస్తుంది. ఎన్సో (ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్) అనేది పసిఫిక్ మహాసముద్ర ఉష్ణమండల ప్రాంతంలో సహజంగా పునరావృతమయ్యే వాతావరణ చక్రం. ఇది ప్రపంచ వాతావరణాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఎన్సోలో వెచ్చని(ఎల్ నినో), చల్లని(లా నినా), తటస్థ దశలుంటాయి. ఎన్సో చక్రం రెండు నుంచి ఏడేళ్లకోసారి పునరావృతమవుతుంది. ఎల్ నినో ఇండియా, ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియాలకు వెచ్చని పొడి వాతావరణాన్ని తీసుకొస్తుంది. లా నినా భారత్‌లో వర్షపాతాన్ని పెంచుతుంది.

ఎల్ నినో, లా నినాలలో ఏదీ తటస్థ దశలో క్రియాశీలంగా ఉండదు; వాతావరణ పరిస్థితులు, వాయు ప్రవాహాలు సాధారణ స్థితిలో ఉంటాయి. ఎన్సో, రుతుపవన వర్షపాతాల మధ్య సంబంధం ఉత్తర, మధ్య, దక్షిణ భారత ప్రాంతాల్లో భిన్న రకాలుగా వ్యక్తమవుతుంది. తూర్పు పసిఫిక్ మహాసముద్రంపై సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే ఉత్తర భారతదేశంలో వర్షపాతం మొత్తంగా తగ్గడానికి, దక్షిణ భారతదేశంలో పెరగడానికి దోహదపడుతుంది. ఎల్ నినో సమయంలో మేఘాల నిర్మాణం తగ్గడం వల్ల భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం తగ్గుతుంది. ఫలితంగా కరవు పరిస్థితులు ఏర్పడి, వ్యవసాయ ఉత్పత్తి తగ్గుతుంది. రిజర్వాయర్లలో నీటిమట్టాలు తగ్గి సాగు, తాగునీటి కొరత ఏర్పడుతుంది. ఎల్ నినో సాధారణంగా భారతీయ రుతుపవనాలను బలహీనపరచవచ్చు కానీ, అలా ఎల్లవేళలా జరుగుతుందని చెప్పలేం. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, వాతావరణంలో 20-80 సంవత్సరాల వ్యవధిలో వచ్చే హెచ్చుతగ్గులను సూచించే డోలనాన్ని అట్లాంటిక్ మల్టీడెకేడల్ ఆసిలేషన్ (ఏఎంవో) అంటారు. అది భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో రుతుపవన వర్షా లను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఉత్తర-అట్లాంటిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతకూ భారతదేశంలో దుర్భిక్షానికీ సంబంధం ఉందని గతానుభవం చెబుతోంది. పసిఫిక్ బహుళ దశాబ్ద డోలనం (పీడీవో) సానుకూలంగా ఉంటే లా నినా ఏర్పడుతుంది. దీనివల్ల భారత ద్వీపకల్పంలో, పశ్చిమ-మధ్య ప్రాంతాల్లో కొండ ప్రాంతాల్లో 21-150 శాతం వరకు అధిక వర్షపాతం సంభవిస్తుంది.

ఈ ఏడాది ఎల్ నినో వేగంగా తీవ్రత సంతరించుకోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈసారి నైరుతి రుతుపవనాల కాలంలో హిందూ మహాసముద్ర డైపోల్ తటస్థంగా ఉంటుందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. అంటే బలం పెరుగుతున్న ఎల్ నినోను ఎదుర్కోవడానికి బలీయమైన పరిహార యంత్రాంగం ఏదీ లేదు.

# స్వాతంత్ర్య భారతదేశ మార్గదర్శకులు

**భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ మహోత్సవాల వేళ ప్రతి భారతీయునికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. భారతదేశ స్వాతంత్ర్య సిద్ధి కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులందరికీ నివాళులు అర్పిస్తున్నాను. గత వారం అండమాన్ నికోబార్ దీవుల పర్యటన సందర్భంగా, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మన జాతీయ పతాకాన్ని ఎగురవేసే గౌరవాన్ని పొందాను. గొప్ప దేశభక్తుడైన శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ తొలిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఘట్టానికి నివాళులర్పించాను. 1943 డిసెంబర్ 30న భారత భూభాగంలో నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్ మొట్టమొదటిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన పవిత్ర నేలపై ఉండడం నాకు ఎంతో భావోద్వేగభరితమైన అనుభవం. పసుంపోన్ ముత్తురామలింగ తేవర్ ఆహ్వానం మేరకు 1939 సెప్టెంబర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ మధురైని సందర్శించిన విషయాన్ని కూడా ఈ సందర్భం నాకు గుర్తుచేసింది. ఆ చారిత్రక ఘట్టం ఆ ప్రాంతంలోని అనేక మంది దేశభక్తులకు స్ఫూర్తినిచ్చింది.**





**– సీపీ రాధాకృష్ణన్**
**(భారత ఉపరాష్ట్రపతి)**

జాతీయ స్మారక సెల్యులార్ జైలు సందర్శన, నాకు ఎంతో స్ఫూర్తినిచ్చిన మరో క్షణం. భరతమాత గొప్ప వీరులైన వీర్ సావర్కర్, యోగేంద్ర శుక్లా, బటుకేశ్వర్ దత్, సచింద్రనాథ్ సన్యాల్, ఇంకా ఎందరో వలసవాద శక్తులచే ఖైదై ఇక్కడ ఒంటరి నిర్బంధానికి గురయ్యారు. భారతదేశం స్వేచ్ఛగా, గౌరవంతో జీవించాలనే ఆశయంతో ప్రాణాలర్పించిన వారి ధైర్యం, దుఃఖము, గొప్ప త్యాగాల గాథలు నేటికీ ఆ జాతీయ స్మారక చిహ్నం యొక్క గోడలపై ప్రతిధ్వనిస్తున్నాయి. లక్షలాది ప్రజలలో దేశభక్తిని రగిలించి, దేశాన్ని స్వాతంత్ర్యం దిశగా నడిపించిన ఆ మార్గదర్శకులందరికీ నివాళిగా ఈ వ్యాసం రాసేందుకు ఆ సందర్శన నన్ను ప్రేరేపించింది.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని పురస్కరించుకుని, ఆగస్టు 9న అండమాన్ దీవులలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రారంభించడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. 1942లో, జాతిపిత మహాత్మా గాంధీజీ 'క్విట్ ఇండియా ఉద్యమాన్ని' ప్రారంభించి, 'దేశం కోసం చేయండి లేదా చావండి' అనే ప్రేరణాత్మక నినాదంతో పిలుపునిచ్చారు. ఫలితంగా, గొప్ప స్వాతంత్ర్య కాంక్ష దేశవ్యాప్తంగా వ్యాపించింది.

వలసవాద శక్తులకు వ్యతిరేకంగా నిలిచిన ఆ తరానికి ధన్యవాదాలు. ఈనాడు మనం స్వేచ్ఛా వాయువును పీలుస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలోని రాజ్యాంగ హక్కులతో జీవించే అదృష్టాన్ని అందుకున్నాము.

మన మాతృభూమిని స్వేచ్ఛగా చూసేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది స్వాతంత్ర్య సమర యోధులు అచంచలమైన అంకితభావం, త్యాగాలతో పోరాడారు. అనేక మంది వారి అమూల్యమైన ప్రాణాలను సైతం అర్పించారు.

స్వాతంత్ర్య సమరయోధుల గాథ

ఉత్తరాన కాశ్మీర్ నుంచి, దక్షిణాన తమిళనాడు నుంచి, పశ్చిమాన గుజరాత్ నుంచి, తూర్పున అస్సాం నుంచి, ఇలా అన్ని ప్రాంతాలు, నేపథ్యాలు, వయసు, లింగ భేదాలకు అతీతంగా స్వాతంత్ర్య సమరయోధులు ఒకే ఉమ్మడి లక్ష్యమైన మాతృభూమి స్వేచ్ఛ కోసం ఏకమయ్యారు.

తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రతిఘటనకు చిరస్మరణీయంగా నిలిచిన ఝాన్సీ రాణి లక్ష్మీబాయి శౌర్యం; మంగళ్ పాండే ధైర్యం; "స్వరాజ్యం నా జన్మహక్కు, నేను దానిని సాధిస్తాను" అనే నినాదంతో జాతిని మేల్కొల్పిన బాల గంగాధర్ తిలక్ నిర్భయ పిలుపు స్వాతంత్ర్య యాత్రకు బలాన్నిచ్చింది. వి.ఓ. చిదంబరం పిళ్లై భారతదేశ మొట్టమొదటి స్వదేశీ నౌకా రవాణా సంస్థను ప్రారంభించి, వలసవాద ఆర్థిక ఆధిపత్యాన్ని సవాలు చేసి, స్వాతంత్ర్య పోరాటం కేవలం యుద్ధభూమిలోనే కాదు, వాణిజ్యంలో కూడా జరిగిందని ఆయన నిరూపించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల విప్లవ స్ఫూర్తి స్వేచ్ఛా సాధన కోసం త్యాగాన్ని స్వీకరించేలా తరతరాలను ప్రేరేపిస్తోంది. ఈశాన్యంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన జ్వాలలను రాణి గైదిన్లియు అకుంఠిత స్ఫూర్తి రగిలించింది. క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ, అచంచలమైన ధైర్యంతో జాతీయ పతాకాన్ని మోస్తూ అస్సాంలో కనకలతా బారువా ప్రాణాలను అర్పించారు. భగవాన్ బిర్సా ముండా తో పాటుగా అనేక మంది గిరిజన నాయకులు వలసవాద పాలనకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక ప్రతిఘటనకు నాయకత్వం వహించారు. చరిత్ర పుటల నుంచి వెలికితీయగల స్థైర్యం, ధైర్యం, సంకల్పానికి సంబంధించిన కథలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ ధైర్యం, త్యాగాల వైభవాన్ని చాటుతూ, తరతరాలకు స్ఫూర్తినిచ్చే అసంఖ్యాకమైన వీరుల సమిష్టి సంకల్పంతోనే భారతదేశ స్వాతంత్ర్యం సాధ్యమైందని మనకు గుర్తుచేస్తాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలో తిరుప్పూర్

ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మనం జరుపుకుంటున్న సందర్భంగా, 'కోడి కథ కుమారన్' (పతాక సంరక్షకులు)గా ప్రసిద్ధి చెందిన తిరుప్పూర్ కుమారన్‌కు నివాళులర్పిస్తున్నాను. స్వాతంత్ర్య పోరాట సమయంలో, మరణం సంభవించిన జాతీయ పతాకాన్ని కింద పడనీయకుండా, నా స్వస్థలమైన తిరుప్పూర్‌లో ప్రాణ త్యాగం చేయడంతో ఆయనకు ఈ బిరుదు లభించింది.

చిన్న వయసులోనే కుమారన్ హృదయంలో దేశభక్తి జ్వాలు వెలిగాయి. "స్వరాజ్యం మన జన్మహక్కు" అనే పిలుపుతో ప్రేరణ పొంది, స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. మహాత్మా గాంధీ ఆదర్శాలచే అమితంగా ప్రభావితమైన కుమారన్, ప్రజలలో, ముఖ్యంగా యువతలో జాతీయవాద స్ఫూర్తిని మేల్కొల్పడానికి "దేశబంధు యూత్ అసోసియేషన్"ను స్థాపించారు. వలసవాద పాలనలోని అన్యాయాల పట్ల ప్రజలు చైతన్యవంతులై, వాటిని ప్రతిఘటించే ధైర్యాన్ని, స్పష్టతను పెంపొందించుకున్నప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధ్యమవుతుందని కుమారన్ గట్టిగా విశ్వసించారు. గాంధీజీ సాంఘిక సంస్కరణ సూత్రాలకు కట్టుబడి ఆయన, మద్యపాన నిషేధాన్ని సామాజిక, జాతీయ పునరుజ్జీవనానికి ఒక ఆవశ్యకమైన అడుగుగా భావిస్తూ, అందుకొరకు క్రియాశీలకంగా పోరాడారు. ఇందులో భాగంగా, మహోన్నతమైన భారతదేశ స్వాతంత్ర్య ఆశయం కోసం ప్రజలను మద్యపానాన్ని విడిచిపెట్టి, స్వీయ నియంత్రణను అలవర్చుకోవాలని ప్రోత్సహిస్తూ, కల్లు దుకాణాల వద్ద జరిగే నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

1932 జనవరి 10న జరిగిన శాసనోల్లంఘన ఉద్యమ సమయంలో కుమారన్ చేతుల్లో జాతీయవాద పతాకాన్ని పట్టుకుని, మరికొందరు ధైర్యవంతులతో కలిసి, తిరుప్పూర్ వీధుల్లో 'వందేమాతరం' నినాదాలు ప్రతిధ్వనించేలా ఒక యాత్రకు నాయకత్వం వహించారు. వలసవాద పాలన దళాలు ఆ బృందంపై దాడి చేశాయి. కుమారన్ తలకు గాయాలైన, పెదాలపై 'వందేమాతరం' నినాదాలతో, శరీరానికి పతాకాన్ని హత్తుకుని దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఆయన మరణించే నాటికి ఆయన వయస్సు కేవలం 27 ఏళ్లు మాత్రమే.

తిరుప్పూర్ కుమారన్ గురించి నేను రాస్తున్నప్పుడు, మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో యువకులు నాకు గుర్తుకు వస్తున్నారు. వారిలో కొందరు: భగత్ సింగ్ (23), సుఖ్‌దేవ్ (23), రాజ్‌గురు (22), ఖుదీరామ్ బోస్ (18), కనకలతా బారువా (18), అనంత లక్ష్మణ్ కన్హేరే (19), వంచినాథన్ (25) వంటి ఎందరో యువకులు వారి ప్రాణాలను త్యాగం చేసి, భారత స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో అమరులయ్యారు.

మన జాతీయ ఉద్యమంలో గుర్తింపు పొందని వీరులను వెలుగులోకి తీసుకువచ్చిన మన గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి చొరవను ప్రశంసిస్తున్నాను. ప్రసిద్ధి చెందిన, చెందని స్వాతంత్ర్య సమరయోధులందరికీ నివాళులు అర్పిస్తున్నాను.

ఈ మహత్తర వేళ, మన మాతృభూమి పట్ల మన నిబద్ధతను పునరాలోచించి, పునరుద్ధరించుకుందాం. ఈ అమృత యుగంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించేందుకు మనల్ని మనం అంకితం చేసుకుని, దేశ పురోగతి, సుసంపన్నత కోసం కలిసికట్టుగా కృషి చేద్దాం. అచంచలమైన ధైర్యంతో పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం వారి ప్రాణాలను త్యాగం చేసిన వీరయోధులకు మనం అర్పించగల అత్యంత సముచితమైన నివాళి ఇదే అవుతుంది.

**జై హింద్! భరతమాత వర్ధిల్లాలి!**

# ఆరోగ్య సంరక్షణకు అరుదైన అవకాశం

**దేశంలో ఏటా లక్షలమంది మహిళలు అనేక అనారోగ్య సమస్యలతో గర్భధారణలోకి ప్రవేశిస్తున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, రక్తహీనత, పోషకాహార లోపాలతోపాటు బయటపడని గుండెజబ్బులు కూడా ఉండవచ్చు. చాలామందిలో ఇవి ముందెప్పుడూ గుర్తించి ఉండకపోవచ్చు. కనీస పరీక్షలూ జరిగి ఉండవు. చాలామంది మహిళలు బాల్యం తర్వాత వైద్యుల దగ్గరికి వెళ్లేది గర్భధారణ సమయంలోనే. అందుకని, గర్భధారణను మహిళ జీవితంలో ఆరోగ్య సంరక్షణకు, అనారోగ్య నివారణకూ కీలక ఘట్టంగా భావించాలి.ప్రసవానికి ముందు సంరక్షణ అంటే అందరికీ తెలిసింది గర్భిణిని బాగా చూసుకోవడం, శిశువు ఆరోగ్యంగా జన్మించేలా జాగ్రత్తపడటమే. ఇదంతా ముఖ్యమే. కానీ ఈ క్రమంలో మనం ప్రివెంటివ్ మెడిసిన్‌లో గొప్ప అవకాశాన్ని విస్మరిస్తున్నాం. గర్భధారణ అనేది కేవలం పునరుత్పత్తికి దారితీసేది మాత్రమే కాదు. అది సమగ్ర ఆరోగ్య పరీక్షల నిర్వహణకు ఒక అవకాశం కూడా. జీవితంలో ఏ ఇతర దశలోనూ గర్భధారణ మాదిరిగా తొమ్మిది నెలలపాటు వైద్య సంప్రదింపులు, పరీక్షలు, శారీరక పర్యవేక్షణ, నిరంతర కౌన్సెలింగ్ జరగదు. గర్భధారణ దాదాపు ప్రతి అవయవంపై ప్రభావం**



**చూపుతుంది. గర్భవతిలో రక్తపరిమాణం నాటకీయంగా పెరుగుతుంది. గుండె మరింతగా శ్రమిస్తుంది. శరీరం ఇన్సులిన్‌ను ఉపయోగించుకునే తీరులో మార్పులు వస్తాయి. మూత్రపిండాల పనితీరు, ఎండోక్రైన్ గ్రంథుల వ్యవస్థ మార్పులు చెందుతుంది. దాగిఉన్న వ్యాధులు సైతం బయటపడతాయి.**

అతిగా పరీక్షలు అక్కర్లేదు కానీ...

కుటుంబమంతా ఒక మహిళ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించే అరుదైన ఘట్టాలలో గర్భధారణ ఒకటి. కాబట్టి చాలా మంది గతంలో వాయిదా వేసుకున్న ఆరోగ్య పరీక్షలను క్రమంతప్పకుండా, ఇష్టపూర్వకంగా చేయించుకుంటారు. పోషకాహారం, వ్యాయామం, బరువు పెరగడంపై సలహాలను శ్రద్ధగా పాటిస్తారు. మందులనూ మరవకుండా వేసుకుంటారు. మామూలు రోజుల్లో రోగ నివారణ, ఆరోగ్య సంరక్షణలపై పెద్దగా శ్రద్ధపెట్టని కుటుంబాలు కూడా గట్టిగా పట్టించుకుంటాయి. ఇలాంటప్పుడు ఆహార విహారాలకు సంబంధించిన పాత అలవాట్లను వదిలించుకుంటే తక్షణ ఫలితాలు కనిపిస్తాయి. పాశ్చాత్య ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలలో కుటుంబ వైద్యులు నిరంతర నివారణ, సంరక్షణ సేవలు అందిస్తారు. అలాంటిది మన దేశంలో లేదు. చాలామంది మహిళలకు దీర్ఘకాల ఆరోగ్య రికార్డులు ఉండవు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్యులతో దీర్ఘకాలిక సంప్రదింపులు లేకుండానే గర్భం ధరిస్తారు. గర్భిణి దశలో బరువు పెరగడం, ఆలస్య ప్రసవాలు, మధుమేహం, రక్తపోటు వంటివి మరింతగా సమస్యాత్మకం అవుతాయి. దీనికితోడు సరైన వైద్య రికార్డులు లేకపోవడం గర్భవతి సంరక్షణను ఇంకా జటిలం చేస్తుంది. ఇలాంటి స్థితిలో గర్భధారణ అనేది కేవలం తల్లి సంరక్షణకే పరిమితమయ్యే దశ కాదనీ, ఆమెలో దీర్ఘకాలిక వ్యాధిని ముందే గుర్తించడానికి, దీర్ఘకాల ఆరోగ్య సంరక్షణకు అందివస్తున్న అవకాశంగా గుర్తించాలి. అలాగని విచక్షణారహితంగా వైద్య పరీక్షలు చేయాలనీ కాదు. మంచి వైద్యమంటే అతిగా పరీక్షలు చేయడం కాదు. సంపన్న దేశాల అనుభవాల నుంచి రూపుదిద్దుకున్న సిఫార్సులను గుడ్డిగా అనుకరించడమూ కాదు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా, భారతీయ మహిళకు కావాల్సిన పరీక్షలు, వైద్య సేవలు అందించడం అవసరం. అందుకు గర్భధారణ ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. ప్రసవానికి ముందు తీసుకోవాల్సిన సంరక్షణపై మరింత స్పష్టమైన దృక్పథాన్ని అలవరచుకోవాల్సి ఉంది.

అవగాహన ముఖ్యం

చక్కగా ప్రసవమైనంత మాత్రానే వైద్య సేవలు, సంరక్షణ విజయవంతమైనట్లు కాదు. ఒక మహిళ గర్భం ధరించినప్పటితో పోలిస్తే, బిడ్డను ప్రసవించిన తర్వాత మరింత ఆరోగ్యంగా ఇంటికి వెళ్లడమే కీలకం. ఒకవేళ ఆమెకు మధుమేహం, హృద్రోగం, థైరాయిడ్ వ్యాధి ఉంటే చికిత్స చేయడం ప్రధానం. గర్భవతిగా ఉన్నప్పుడు రక్తహీనతకు చికిత్స చేశారా, అవసరమైన టీకాలన్నీ వేశారా, మానసిక సమస్యలేవైనా ఉంటే పరిష్కరించారా, భవిష్యత్తులో నివారణ, సంరక్షణల కోసం స్పష్టమైన ప్రణాళిక చేపట్టారా అన్నవీ ముఖ్యమే. అయితే ఇదంతా ఒక్క గర్భధారణ కాలానికే పరిమితం కాకూడదు. తదుపరి గర్భం ధరించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సేవలను పొందడంపై అవగాహన కల్పించాలి. దీనివల్ల మహిళలు ఎప్పటికప్పుడు వైద్యుల సాయం కోరతారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకుంటారు. దీర్ఘకాల వ్యాధుల ముప్పుల్ని ఎదుర్కోగలుగుతారు. ఇదంతా తదుపరి గర్భధారణలకూ ఉపకరిస్తుంది. దీనివల్ల కుటుంబాలు ఆరోగ్యకరంగా మారతాయి. అంతిమంగా ఆరోగ్య భారతాన్ని సాకారం చేస్తాయి. తల్లులు, నవజాత శిశువుల సంరక్షణ కోసం ఇండియా భారీ వనరులు, సేవలను కేటాయిస్తోంది. ఈ కృషిని మరింతగా విస్తరించాల్సి ఉంది. ఈ క్రమంలో గర్భధారణను కేవలం తొమ్మిది నెలలపాటు సురక్షితంగా ప్రయాణించాల్సిన దశగానే కాకుండా, మహిళ జీవితకాలంలో దీర్ఘకాల అనారోగ్య నివారణకూ అందివస్తున్న అపూర్వ అవకాశంగా పరిగణించాలి. మనం ఈ తత్వాన్ని బోధపరచుకుంటే, ప్రసవానికి ముందు సంరక్షణ కాన్పుతోనే ముగియదు అక్కడి నుంచి ఆరోగ్యవంతమైన జీవితానికి అది నాంది అవుతుంది.

# పల్లెల్లో డిజిటల్ వసతుల కరవు!

**పౌరసేవల పంపిణీలో వేగంతో పాటు పారదర్శకతను పెంపొందించడానికి డిజిటల్ వసతులు ఎంతో తోడ్పడతాయి. ప్రభుత్వాలు నేరుగా ప్రజలతో అనుసంధానం కావడానికి అవి మార్గం సుగమం చేస్తాయి. కాబట్టి, ముఖ్యంగా 60శాతానికి పైగా జనాభాకు నెలవులైన గ్రామాలకు ఆధునిక సాంకేతికతను సమర్థంగా చేరువచేసినప్పుడే వికసిత భారత ఆశయాల సాధనకు అవకాశాలు విస్తారమవుతాయి. ఈ వాస్తవాన్ని గుర్తించే ప్రభుత్వాలు డిజిటల్ పంచాయతీలు, ఈ-గ్రామ్‌స్వరాజ్ వంటి కార్యక్రమాలకు నడుంకట్టాయి. పంచాయతీల్లో అధికారిక రాతకోతలన్నీ కంప్యూటర్‌లోనే సాగేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయి. తద్వారా ధ్రువీకరణ పత్రాల జారీ, పన్నుల వసూళ్లు, ఆస్తుల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళికలు, నిధుల పర్యవేక్షణ వంటివి చాలాచోట్ల సులభతరమవుతున్నాయి. ప్రజలకు అనవసర వ్యయప్రయాసలూ తప్పుతున్నాయి. కానీ, సర్కారీ లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా 56వేలకు పైగా పంచాయతీల్లో కంప్యూటర్లు కరవయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలికవసతుల కొరతను తగ్గిస్తూ ఈ-గవర్నెన్స్‌కు ఊతమిచ్చేందుకు కేంద్రం తాజాగా 'దాన్‌వీర్' కార్యక్రమాన్ని ప్రకటించింది. దీనికింద ఉదారులు ఎవరైనా పంచాయతీలకు కంప్యూటర్లను సమకూర్చవచ్చునని పిలుపిస్తోంది. గ్రామీణాభ్యుదయాన్ని ఆశించేవారు ఇందులో భాగస్వాములైతే పల్లెల ప్రగతి కొత్త దశలోకి ప్రవేశిస్తుంది!**

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నివేదిక ప్రకారం నిరుడు మార్చి నాటికి పంజాబ్‌లో దాదాపు రెండుశాతం గ్రామ పంచాయతీల్లోనే కంప్యూటర్లు ఉన్నాయి. తెలంగాణలో ఏడున్నర వేలకు పైగా, ఏపీలో మూడువేలకు పైగా పంచాయతీల్లో అవి మృగ్యమయ్యాయి. బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణాలలోనూ చాలా పంచాయతీల్లో కంప్యూటర్లు లేవు. అవి ఉన్నచోట్లా ఇంటర్నెట్ సౌకర్యం కొరవడటంతో అలంకారప్రాయంగా మారాయి. దేశీయంగా పలు ప్రాంతాల్లో ఇలాంటి దుస్థితే రాజ్యమేలుతోంది. సమ్మిళిత అభివృద్ధి కోసం డిజిటల్ భారత్‌ను ఆవిష్కరించుకోవాలన్న సదాశయానికి అది విఘాతం కలిగిస్తోంది. వాస్తవానికి దేశవ్యాప్తంగా రెండున్నర లక్షలకు పైగా పంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ ద్వారా నాణ్యమైన ఇంటర్నెట్‌ను అందించేందుకు 'భారత్‌నెట్' పథకం తెచ్చారు. అందులో భాగంగా 2.15 లక్షల పంచాయతీలను బ్రాడ్‌బ్యాండ్ సేవలతో అనుసంధానించారు. కానీ, చాలీచాలని నెట్ వేగం, తరచూ తెగిపోతున్న కేబుళ్లను వెంటనే మరమ్మతు చేయకపోవడం, విద్యుత్ కోతలతో భారత్‌నెట్ లక్ష్యాలు నీరుగారుతున్నాయి. దాంతో దట్టమవుతున్న డిజిటల్ అసమానతలు ప్రగతి ఫలాలను అందరికీ చేరువచేయడంలో ఆటంకాలవుతున్నాయి.

**మన పల్లెల్లో ప్రతి వందమందికి సగటున 48.31 ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు ఉంటే- పట్టణ ప్రాంతాల్లో అవి 126.80గా లెక్కతేలుతున్నాయి. గ్రామీణ-నగర భారతాల మధ్య నెలకొన్న డిజిటల్ అంతరాలకు ఇది అద్దంపడుతోంది. భారత్‌నెట్ కింద 13లక్షల ఇళ్లకు స్థిర కనెక్షన్లు అందిస్తే, మొన్న మార్చి నాటికి వాటిలో ఎనిమిది లక్షలే క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. గజిబిజి టారిఫ్‌లకుతోడు సాంకేతిక లోపాలు ప్రతిబంధకాలవుతున్నాయి. పల్లెల్లో డిజిటల్ సేవలు విస్తృతమైతే పింఛన్లు, రాయితీలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరతాయి. ఆన్‌లైన్ తరగతులు, ఈ-లెర్నింగ్‌లతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగవుతాయి. పంటల రక్షణ, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు నిపుణుల సూచనలు లభిస్తాయి. డిజిటల్ మార్కెట్లకు చేరువవ్వడం ద్వారా తమ ఉత్పత్తులను అన్నదాతలు లాభసాటి ధరలకు విక్రయించుకోగలుగుతారు. ఇవన్నీ సాకారం కావాలంటే- పల్లెల్లో అంతర్జాల సదుపాయ కల్పనకు, డిజిటల్ అక్షరాస్యత పెంపునకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి!**

# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

శనివారం ⁞ అనంతపురం ⁞ 15.08.2026 ⁞ 01


## మడకశిరలో ముగిసిన అంగన్వాడీ ఇంటర్వ్యూలు

**- ఆర్డీఓ నాగప్రసన్న లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల ఆధ్వర్యంలో ముగిసిన ప్రక్రియ**

**మడకశిర, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**



మడకశిర, గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మినీ నుంచి మెయిన్ సెంటర్లుగా ఉన్నతీకరించిన అంగన్వాడీ కేంద్రాల్లో ఆయాల భర్తీకి సంబంధించి మడకశిరలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మడకశిర ఆర్డీఓ నాగప్రసన్న లక్ష్మి, శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ ప్రక్రియ నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, మడకశిర సీడీపీఓ రాధ, గుడిబండ సీడీపీఓ రహమతీయ సమక్షంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. మడకశిర ప్రాజెక్ట్ పరిధిలో 38 పోస్టులకు 55 మంది అభ్యర్థులు హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. గుడిబండ ప్రాజెక్ట్ లో 17 పోస్టులకు 25 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల తెలిపారు. ఇంటర్వ్యూ ప్రక్రియ ముగిసిందని, అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసాక.. జాబితా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అనుమతికి పంపనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ ఆమోద ముద్ర వేశాక అభ్యర్థులకు ఆయా ప్రాజెక్టుల సీడీపీఓలు నియామక పత్రాలు అందిస్తారని ప్రకటించారు. ఇంటర్వ్యూలు పూర్తి పారదర్శకంగా నిర్వహించామన్నారు

# దేశ ప్రగతికి యువశక్తి... .

# అభివృద్ధికి యువతే చోదక శక్తి



**- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అనంత జనశక్తి ప్రత్యేక కథనం.**
**- -స్వాతంత్ర్య స్ఫూర్తి... దేశ నిర్మాణానికి నేటి పిలుపు.**
**- దేశ నాయకుల స్ఫూర్తితో విద్యార్థుల ప్రగతి పతం.**
**- ప్రతి పౌరుడు దేశానికి ఆదర్శంగా నిలవాలి.**
**- దేశం మనకు ఏమిచ్చింది కాదు... దేశానికి మనం ఏమి చేశామన్నదే ముఖ్యం.**
**- ప్రతి పౌరుడు దేశానికి ఆదర్శంగా నిలవాలి.**

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్:**

స్వేచ్ఛ కోసం పోరాడిన తరం ఒక చరిత్రను రాస్తే.. స్వేచ్ఛను కాపాడాల్సిన తరం మరో చరిత్రను రాయాలి. ఆగస్టు 15 కేవలం జాతీయ జెండా ఎగురవేసి, దేశభక్తి నినాదాలు చేసే రోజు కాదు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ.. దేశం ఏ దిశగా పయనిస్తోంది? మన బాధ్యత ఏమిటి? అనే ప్రశ్నలను మనకు మనమే వేసుకునే రోజు.
నేడు భారత్ ప్రపంచ వేదికపై తన సత్తాను చాటుకుంటోంది. సాంకేతికత నుంచి అంతరిక్షం వరకు, మౌలిక వసతుల నుంచి డిజిటల్ విప్లవం వరకు దేశం వేగంగా ముందుకు సాగుతోంది. అయితే అభివృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే నిజమైన స్వాతంత్ర్యానికి కొలమానం కాదు. పేదరికం, నిరుద్యోగం, అవినీతి, అసమానతలు, మహిళల భద్రత, రైతుల సమస్యలు, విద్యా.....వైద్య రంగాల్లో లోపాలు తొలగినప్పుడే స్వాతంత్ర్య ఫలాలు ప్రతి పౌరుడికి అందినట్లవుతుంది.
ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఈ స్వాతంత్ర్య దినోత్సవం ఒక కీలకమైన సందేశాన్ని ఇస్తోంది. రాష్ట్ర అభివృద్ధి అంటే కేవలం రాజధాని నిర్మాణాలు, రహదారులు, భవనాలు మాత్రమే కాదు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుకు భరోసా, యువతకు ఉపాధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పేదలకు మెరుగైన వైద్యం, మహిళలకు భద్రత, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే అసలైన అభివృద్ధి.రాజకీయాలు ప్రజా సేవకు మార్గం కావాలి.. అధికార ప్రదర్శనకు వేదిక కాకూడదు. ప్రజల పన్నులతో నడిచే వ్యవస్థలో ప్రతి రూపాయి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. అధికారంలో ఉన్నవారు జవాబుదారీతనంతో పనిచేయాలి. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా ప్రశ్నించాలి. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలి.
స్వాతంత్ర్యం మనకు హక్కులు ఇచ్చింది.. అదే సమయంలో బాధ్యతలను కూడా అప్పగించింది. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదాలను దాటి దేశ ప్రయోజనాన్ని ముందుంచాల్సిన సమయం ఇది. సోషల్ మీడియాలో దేశభక్తి సందేశాలు పంచుకోవడం కంటే... మన చుట్టూ ఉన్న ఒక సమస్యను పరిష్కరించేందుకు ముందడుగు వేయడం గొప్ప దేశభక్తి. నేటి యువత చేతుల్లోనే రేపటి భారత్ ఉంది. వారి ఆలోచనల్లో ఆవిష్కరణ ఉండాలి... చేతుల్లో



నైపుణ్యం ఉండాలి. గుండెల్లో దేశభక్తి ఉండాలి. రాజకీయ నాయకత్వం కూడా యువతకు అవకాశాలు కల్పిస్తూ, విద్య... ఉపాధి రంగాల్లో బలమైన పునాదులు వేయాలి. జండా ఎగరవేయడం ఒక కార్యక్రమం మాత్రమే... జెండా గౌరవాన్ని నిలబెట్టేలా జీవించడం అసలైన దేశభక్తి. త్యాగధనుల రక్తంతో సాధించిన స్వాతంత్రాన్ని అవినీతి, వివక్ష, స్వార్థ రాజకీయాలకు బలి చేయకుండా... సమానత్వం, న్యాయం, అభివృద్ధి, మానవత్వంతో కూడిన భారత దేశాన్ని నిర్మించడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

**నాయకుల స్ఫూర్తితో విద్యార్థుల ప్రగతి పథం.**
దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుంది. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి దిశా నిర్దేశం చేసే నాయకులు. అందుకే విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, మహనీయ నాయకుల జీవితం, వారి పోరాట పటిమ, క్రమశిక్షణ, నిబద్ధత, దేశభక్తి నుంచి స్ఫూర్తి పొందాలి. అడ్డంకులు ఎదురైనప్పుడల్లా వెనుకడుగు వేయకుండా"లక్ష్యం పెద్దదైతే కష్టం చిన్నదే"అనే సంకల్పంతో ముందుకు సాగాలి. నాయకులు సాధించిన విజయాల వెనుక ఉన్న త్యాగం, పట్టుదల, నిరంతర శ్రమను ఆదర్శంగా తీసుకోవాలి. నాయకత్వం అంటే పదవి కాదు.... బాధ్యత. అధికారం కాదు... ప్రజాసేవ. ఈ విలువలను చిన్ననాటి నుంచే అలవర్చుకుంటే విద్యార్థులు భవిష్యత్తులో సమాజ మార్పుకు శక్తివంతమైన ప్రతినిధులుగా ఎదుగుతారు. దేశాన్ని మార్చేది కేవలం నాయకులు కాదు... నాయకుల ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని ఆచరణలు పెట్టే యువత. కాబట్టి ప్రతి విద్యార్థి కలలు కనాలి, లక్ష్యాలను నిర్దేశించుకోవాలి, కష్టపడి సాధించాలి. పుస్తకాల్లోని పాటలతో పాటు జీవిత పాఠాలను నేర్చుకొని, జ్ఞానం... నైతికత... సేవాభావంతో ముందుకు సాగితేనే బలమైన భారత భవిష్యత్తుకు పునాది పడుతుంది. నాయకుల స్ఫూర్తి విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టాలి. వారి పట్టుదల భవిష్యత్తుకు బాటలు వేయాలి. వారి విజయాలు దేశ ప్రగతికి చోదక శక్తిగా మారాలి.

**ప్రతి పౌరుడు దేశానికి ఆదర్శంగా నిలవాలి.**
**దేశాభివృద్ధి అనేది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు... ప్రతి పౌరుడి క్షేత్రస్థాయి భాగస్వామ్యం, త్రికరణ శుద్ధితో కూడిన బాధ్యతాయుత ప్రవర్తనతోనే దేశం మరింత బలపడుతుంది. దేశం కోసం గొప్ప పనులు చేయాలంటే పదవులు అవసరం లేదు... నిబద్ధతతో కూడిన ఆలోచన, నిజాయితీతో కూడిన ఆచరణ, బాధ్యతతో కూడిన జీవన విధానం చాలు. దేశం మనకు ఏమిచ్చిందని ప్రశ్నించే ముందు దేశానికి మనం ఏమి ఇచ్చామని ఆత్మ పరిశీలన ప్రతి ఒక్కరిలో రావాలి. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటించడం నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు ప్రజా ఆస్తులను కాపాడటం నుంచి పనులు చెల్లించడం వరకు ప్రతి చిన్న బాధ్యతలను దేశభక్తి ప్రతిబింబించాలి. మనసులో దేశం... మాటలు నిజం... చేతల్లో సేవ ఉండాలి. ఆలోచన, మాట, చేతల్లో ఏకత్వం చూపించే త్రికరణశుద్ధి ప్రతి పౌరుడి జీవన విధానంగా మారాలి. సమాజంలో మార్పు కోసం ఇతరుల వైపు చూసే బదులు, మార్పును మన నుంచే ప్రారంభించాలి. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై స్పందించే పౌరుడు, సమాజ హితం కోసం ఒక అడుగు ముందుకు వేసే యువత, చట్టాలను గౌరవించే ప్రతి వ్యక్తి దేశ నిర్మాణంలో భాగస్వామి. దేశం గొప్పదవ్వాలంటే ముందుగా పౌరుడి బాధ్యత గొప్పదవ్వాలి. ప్రతి పౌరుడు తన కర్తవ్యాన్ని త్రికరణ శుద్ధితో నిర్వహిస్తే... ప్రతి గ్రామం ఆదర్శంగా మారుతుంది. ప్రతి పట్టణం బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుంది. చివరికి భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది. దేశభక్తి నినాదాల్లో కాదు... నిత్య జీవితంలోని బాధ్యతాయుత ఆచరణలో కనిపించాలి. ప్రతి పౌరుడి కర్తవ్యనిష్టే దేశానికి నిజమైన గౌరవం.**

**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, నిస్వార్థ సేవలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. కేవలం అవకాశాల కోసం ఎదురు చూడకుండా బాధ్యత, క్రమశిక్షణ, కర్తవనిష్టతో క్షేత్రస్థాయిలో ముందడుగు వేసినప్పుడే దేశ ప్రగతికి నిజమైన బాటలు పడతాయి. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసినట్టే, నేటి యువత తమ ప్రతిభను దేశాభివృద్ధికి అంకితం చేసి ప్రతి రంగంలో స్ఫూర్తిదాయకంగా నిలవాలి. యువశక్తి సద్వినియోగమైతేనే భారతదేశం మరింత బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచ వేదికపై దూసుకు వెళ్లగలదు.**



## పాండురంగ స్వామి ఆలయానికి
# రూ.1.25 కోట్లతో పునర్వైభవం

**- 80 ఏళ్ల చరిత్ర కు కొత్త శోభ తీసుకొస్తాం: మంత్రి సత్యకుమార్ యాదవ్.....**

**ధర్మవరం ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం పట్టణంలోని సుమారు 80 ఏళ్ల చరిత్ర కలిగిన పాండురంగ స్వామి ఆలయానికి పునర్వైభవం తీసుకువచ్చేందుకు రూ.1.25 కోట్లతో అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పాండురంగ స్వామి ఆలయంలో నిర్వహించిన పునర్నిర్మాణ శిలా పూజ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులతో కలిసి శిలా పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాండురంగ స్వామి ఆలయం ధర్మవరం ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత భక్తులకు మెరుగైన దర్శన, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనులను నాణ్యతతో, ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

**ఆలయాలు మన సంస్కృతికి ప్రతీకలు....**
ఆలయాలు కేవలం ప్రార్థనా మందిరాలు మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయాలను పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు వాటి వైభవాన్ని అందించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు.

**రైతులు సుభిక్షంగా ఉండాలి....**
పాండురంగ స్వామి వారి ఆశీస్సులతో ధర్మవరం నియోజకవర్గ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రకృతి అనుకూలించి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, పూజారి శ్రీధర్ శర్మ, ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్, ఆలయ ఈవో నాగరత్న, ఆలయ కమిటీ సభ్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో చిలకం మధుసూదన్ రెడ్డి

**ధర్మవరం ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని మారుతి నగర్‌లో నిర్వహించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో జన సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం మహోత్సవ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు చిలకం మధుసూదన్ రెడ్డిని సత్కరించారు.



## సమిశ్రగూడెం చెరువు సుందరీకరణ, శివాలయ నిర్మాణ పనులను
# పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్

**- రూ.50 లక్షలతో సమిశ్రగూడెం చెరువు అభివృద్ధి.. త్వరలోనే చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు**
**- రూ.1.25 కోట్లతో శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణం.. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**

**నిడదవోలు ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్**

ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో సమయం గడిపేలా నిడదవోలు రూరల్ మండలంలోని సమిశ్రగూడెం చెరువును అత్యద్భుతంగా సుందరీకరిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.శుక్రవారం సమిశ్రగూడెం చెరువు వద్ద రూ.50 లక్షల వ్యయంతో జరుగుతున్న ఆధునికీకరణ మరియు రివిట్ మెంట్ పనులను మంత్రి దుర్గేష్ స్వయంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో కలసి నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలించి, పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రస్తుతం మట్టితో బండ్ లెవలింగ్ పనులు పూర్తయ్యాయని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు అనంతరం మరొక దఫా లెవలింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. చెరువు వద్ద పిల్లల కోసం చిల్డ్రన్ పార్క్, వ్యాయామ ప్రియుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు, దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని తెలిపారు.చెరువు మధ్యలో ఉన్న సర్ ఆర్థర్ కాటన్ దొర విగ్రహం వద్దకు సందర్శకులు వెళ్లేందుకు వీలుగా గట్టు నుండి బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు కోరగా, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ అన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ మరియు ఆధునికీకరణ పనులకు కావలసిన మరో రూ.10 లక్షల అదనపు నిధులను త్వరలోనే సేకరించి కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు.అనంతరం రూ.1.25 కోట్ల గోదావరి పుష్కరాలు 2027 (సీజీఎఫ్) నిధులతో నిర్మిస్తున్న శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. ఆలయ నిర్మాణంలో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా, పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



# ఆధ్యాత్మిక, దేశ భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్న పరిటాల శ్రీరామ్



- పాండురంగస్వామి ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమానికి హాజరు
- శ్రీ అహోబిలేశ్వరస్వామి నాగుల ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామ్
- టీడీపీ కార్యాలయంపై జాతీయ జెండా ఎగురవేసిన శ్రీరామ్

ధర్మవరం ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం తెలుగుదేశంపార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ నియోజకవర్గంలో జరిగిన పలు ఆధ్యాత్మిక, దేశ భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ధర్మవరం పట్టణంలోని పురాతన పాండురంగ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా శ్రీరామ్ కు ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన శిలాఫలక ఆవిష్కరణలో పాలొన్నారు. అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. మొత్తం రూ.1.25 కోట్లతో ఈ పనులు చేపట్టినామని నిర్వాహకులు తెలిపారు. సుమారుగా 8 దశాబ్ధాల చరిత్ర కల్గిన ఆలయ పునర్నిర్మాణం జరుగుతుండటం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా శ్రీరామ్ అన్నారు. ఆ పాండురంగస్వామి ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలని.. ఆలయం అద్భుతంగా నిర్మాణం జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం అనంతరం ధర్మవరం మండలం కామిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ అహోభిలేశ్వరస్వామి నాగుల ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమంలో కూడా శ్రీరామ్ పాల్గొన్నారు. అర్చకులు, గ్రామస్థులు శ్రీరామ్ కు ఘన స్వాగతం పలుకుతూ ఆలయానికి ఆహ్వానించారు. ముందుగా ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో అంతా సమిష్టిగా ఆలయం నిర్మించుకోవడం చాలా సంతోషకరమని.. ఆ అహోబిలేశ్వరస్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శ్రీరామ్ ధర్మవరం టీడీపీ కార్యాలయంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ ఇళ్లు, కార్యాలయాలపై జాతీయ జెండాలను ఎగురవేయాలన్నారు. మన దేశ సమైక్యతను చాటే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి, కొత్తపేట ఆది, మైనార్టీ నాయకులు నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి బాబు, బొట్టు కిష్ట, జింకల రాజన్న, వంట రమేష్ మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యకర్తలతో మమేకమై.. ఆత్మీయత చాటిన ఉషశ్రీచరణ్



పెనుకొండ ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్

మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ కార్యకర్తలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్యకర్తలతో సరదాగా ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. నాయకత్వం అంటే కేవలం పదవిలో ఉండటం కాదని, కార్యకర్తలతో కలిసి నడుస్తూ వారి కష్టాల్లో తోడుగా నిలవడమే నిజమైన నాయకత్వమని ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు.కార్యకర్తలతో ఉషశ్రీచరణ్ గడిపిన ఆత్మీయ క్షణాలు నాయకురాలికి-కార్యకర్తలకు మధ్య ఉన్న కుటుంబ అనుబంధాన్ని చాటిచెప్పాయి. పదవులు, పరిస్థితులు మారినా కార్యకర్తలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని ఆమె తెలిపారు. "కార్యకర్తలే నా బలం.. కార్యకర్తలే నా కుటుంబం.. వారి కోసం ఎప్పుడూ ముందుంటా" అని ఉషశ్రీచరణ్ అన్నారు.

# ప్రజల అర్జీలకు తక్షణ పరిష్కారం చూపండి

- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు:

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందజేసే అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించి, నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు.పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రధానంగా రెవెన్యూ, విద్యుత్, తాగునీరు, రహదారులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.అర్జీలను కేవలం స్వీకరించి వదిలేయకుండా, వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. "ప్రజలకు మంచి చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలి" అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




# జెండా వేడుకల్లో జాతీయ భావం ఉట్టి పడాలి

- ఏర్పాట్లు పక్కాగా జరగాలి..
- జాయింట్ కలెక్టర్
- సి . విష్ణు చరణ్

అనంతపురం, ఆగస్టు 14: అనంత జనశక్తి న్యూస్

జిల్లాస్థాయి 80భారత స్వాతంత్రదినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించే క్రమంలో ప్రతి హృదయంలో జాతీయ భావం ఉట్టిపడేలా ఆయా ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ వివిధ శాఖ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఉదయం అనంతపురం పోలీస్ పెరేడ్ మైదానంలో జరుగుతున్న ఆయా ఏర్పాట్ల ముందస్తు పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధికారులు ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులుమరియుశాసనసభ వ్యవహారాలశాఖమాత్యులు పయ్యావుల కేశవ్ గారు జెండా వందనం గావిస్తారని దీనికిసంబంధించిపెండింగ్ పనులనుశుక్రవారంసాయంత్రం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రముఖులు, న్యాయాధికారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలు తదితరులు వచ్చే మార్గాలను స్థలాలను ఈసందర్భంగాపరిశీలించారు.

కార్యక్రమం ప్రారంభం నుండి జాతీయ గేయం



ముగింపు వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళిక బద్ధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ఆయా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రోటోకాల్ ను తప్పకుండాఅమలుచేయాలని పెరియడ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశాలు ఉంటాయని అందుకు తగిన విధంగా కూర్చునే ప్రదేశాలు,త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పార్కింగ్ ప్రదేశము, వాహనాల రద్దీ ట్రాఫిక్ మళ్లింపులు పక్కాగా ఉండాలని , నిరంతర విద్యుత్సరఫరా ,పారిశుద్ధ్య పనులు ,మొబైల్ టాయిలెట్ల ఏర్పాట్లు ,వైద్య ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు ,పి.టి.సి. బ్యాండ్ ఏర్పాటు, ప్రభుత్వ విధుల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ,సామాజికకార్యకర్తలకు సంబంధించిన ప్రశంసా పత్రాలప్రధానం తదితర అంశాలపై ఆయా శాఖ అధికారులు పనులను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఆయా శాఖలు తమ ప్రగతిని ప్రదర్శించే శకటాలు తయారీ పూర్తి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజలకు తెలియజేసే విధంగా స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. అలాగే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.ప్రతి హృదయం దేశభక్తితో ఉప్పొంగే విధంగా విద్యాశాఖ ద్వారా విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఈ నేపథ్యంలో వేడుకలకు అవసరమైన అన్ని పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో ప్రేమంత కుమార్ , మున్సిపల్ కమిషనర్ జస్వంత్ , ఏ ఎస్ పిలు (ఏ ఆర్) షేక్ ఇలియాస్ భాష, నీలకంతేశ్వర్ రెడ్డి, డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున రెడ్డి, రామ్మోహన్, కిరణ్మయి, శ్రీమతి పద్మావతి డిపిఎం, డీఈవో అయుబ్ హుస్సేన్, డిఐపిఆర్ఓ బాల కొండయ్య, ఎస్ ఈ ఏపీఎస్పీడీసీఎల్ శేషాద్రి, ఆర్టీవో సురేష్ నాయుడు డి ఎం హెచ్ ఓ డా. వెంకటేశ్వర్లు, డిపిఓ నాగరాజు నాయుడు, ఆర్టీవో డి ఆర్ డి ఎ పి డి శైలజ, పవర్ సరఫరాల శాఖ మేనేజర్ రమేష్ రెడ్డి, జిల్లా చేనేత శాఖ అధికారి బసవరాజు, డిఎస్ఓ శోభారాణి, ఐ సి డి ఎస్ పి డి సాజిదున్నిసా, తాసిల్దార్ లు రాజా, ఉదయ భాస్కర్ మోహన్ కుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# దేశభక్తి , జాతీయ సమైక్యతను పెంపొందించడమే లక్ష్యం

- హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ను విజయవంతం చేయాలి....
- డి ఆర్ ఓ . ఎ .మాలోల
- అనంత లో భారీ ఎత్తున జరిగిన ర్యాలీలో రెపరెప లాడిన త్రివర్ణ పతాకం...

అనంతపురం, ఆగస్టు 14: అనంత జనశక్తి న్యూస్

"హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీగా నిర్వహించిన ర్యాలీ ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చి దేశభక్తిని చాటుకుంది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాలోల ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ను ఆవిష్కరించి, ర్యాలీని ప్రారంభించారు. ఆర్ట్స్ కాలేజీ నుండి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన ర్యాలీ లో 80 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని విద్యార్థులు ,అధికారులు, ఉపాధ్యాయులు , యువతీ యువకులు,స్వయం సహాయక మహిళాసంఘాల సభ్యులు,ప్రభుత్వఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలు స్థానిక ప్రజలు, ఎన్ఎస్ఎస్, యన్ సి సి, నర్సింగ్ కాలేజీవిద్యార్థులు , మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగసిబ్బంది, పలువురు క్రీడాకారులు వాకర్సు తదితరులు అత్యంత భక్తిశ్రద్ధలతో చేత బూని "మేరా భారత్ మహాన్" "వందేమాతరం"భారత్ మాతాకీ జై అంటూ చేసిన నినాదాలు అనంత ప్రధాన వీధులలో దేశభక్తి, జాతీయసమైక్యత, సోదర భావం మరియు దేశ ప్రగతి పట్ల సమాజంలో భావం ఉప్పొంగింది. అలాగేకన్నుల పండుగగా జన సందోహం మధ్య ఘనంగా జరిగింది. అంతకు ముందు ఆర్ట్స్ కాలేజీ




మైదానంలో అటవీ శాఖఆధ్వర్యంలోఏర్పాటుచేసిన పలు మొక్కలను డిఆర్ఓ నాటారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూఅధికారిమాలోలమాట్లాడుతూ ప్రపంచంలో మన భారత దేశం విభిన్న సంస్కృతి,సాంప్రదాయాలకు నిలయంగా ఉందన్నారు. అలాగే జాతీయ జెండా మన భారతదేశ సార్వభౌమా ధికారానికిత్యాగానికి జాతీయ సమైక్యతకు ప్రతీకగాఉండిమాతృభూమి స్వాతంత్రం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్పందించుకోవడానికి "హర్ ఘర్ తిరంగా " కార్యక్రమం ఒక గొప్ప అవకాశం అని సమాజంలోని ప్రతి ఒక్కరూ దేశభక్తిని మరియు జాతీయ సమైక్యతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 80 వ భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై వ్యాపార సముదాయాలపై స్వచ్ఛందంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిదేశభక్తి స్ఫూర్తిని చేటాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత తరుణంలో ప్రజలు నేటి యువత , విద్యార్థులు జాతీయభావాన్నిమరింతగా అలవర్చుకోవాలని దేశభక్తి ఐక్యతను పెంపొందించడంతోపాటు జాతీయ జెండాపై పెంచుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో వేలాదిమంది పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి డిఆర్ఓ తన ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్ డి ఓ కుమార్, డీఎఫ్ఓ గురు ప్రభాకర్, జిల్లా టూరిజం అధికారి రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, డీఈవో అయుబ్ హుస్సేన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి , ఐసిడిఎస్ పిడి సాజిదున్నిసా, మెప్మా పిడి విశ్వ జ్యోతి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ, ఆర్ ఐ ఓ వెంకటరమణ నాయక్ , డి ఐ పి ఆర్ ఓ బాల కొండయ్య, ఆర్కాలజీ ఏడి స్వామి నాయక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సూగప్ప, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంజుల, ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, యూత్ వెల్ఫేర్ అన్వర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

# కదిరిలో రెపరెపలాడిన 1000 అడుగుల త్రివర్ణ పతాకం

- 1000 అడుగుల భారీ త్రివర్ణ పతాకంతో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ
- మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు వైభవంగా సాగిన తిరంగా ప్రదర్శన
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్,కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్
- మారుమోగిన "వందేమాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలు

కదిరి,ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కదిరి పురవీధులలో దేశభక్తి ఉప్పొంగింది. శుక్రవారం కదిరి పట్టణంలో 1000 అడుగుల సుదీర్ఘమైన భారీ త్రివర్ణ పతాకంతో నిర్వహించిన తిరంగా ర్యాలీ అత్యంత కన్నులపండువగా, జనసందోహం మధ్య ఘనంగా జరిగింది.స్థానిక కదిరి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి,



ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు.మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన మహాత్మా జ్యోతిరావు పూలే సర్కిల్ మీదుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. 1000 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పట్టుకుని అడుగులు వేశారు. పట్టణ వీధులన్నీ త్రివర్ణ శోభతో మెరిసిపోగా, విద్యార్థుల "వందేమాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలతో కదిరి పురవీధులు మారుమోగాయి. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... "జాతీయ జెండా మన భారతదేశ సార్వభౌమాధికారానికి, త్యాగానికి, విభిన్న సంస్కృతుల ఐక్యతకు దివ్య ప్రతీక. మన మాతృభూమి స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడానికి 'హర్ ఘర్ తిరంగా' ఒక గొప్ప అవకాశం. ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై, వ్యాపార సముదాయాలపై స్వచ్ఛందంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలి. ఈ కార్యక్రమాన్ని ఇంతటి విజయవంతం చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, మున్సిపల్ సిబ్బందికి, జిల్లాల అధికారులకు నా ప్రత్యేక ధన్యవాదాలు."పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజానీకం ఈ భారీ ర్యాలీలో శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం ,కదిరి ఆర్డీఓ కలావతి, కదిరి తహశీల్దార్ రెడ్డి శేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ పాఠశాలల మరియు కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలసి దేశ సమగ్రత, ఐక్యత మరియు దేశసేవపై దేశభక్తి ప్రతిజ్ఞ చేయించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

కదిరి,ఆగస్టు ,14:అనంత జనశక్తి న్యూస్

ప్రజా ఫిర్యాదుల సత్వర, సక్రమ పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఒక నెల - ఒక్క నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" వ్యవస్థీకృత మొదట పర్యటన శుక్రవారం కదిరి ఆర్డీఓ కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్,జాయింట్ కలెక్టర్,కదిరి ఆర్డీఓ మరియు కదిరి తహసీల్దార్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 73 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం ప్రతి శుక్రవారం అధికారుల బృందం నియోజకవర్గంలో పర్యటిస్తుందని వివరించారు.మొదటి వారం ప్రజల నుంచి నేరుగా అర్జీలు/ఫిర్యాదులు స్వీకరిస్తారు.మూడో వారం స్వీకరించిన అర్జీల పరిష్కారం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తారు.నాల్గో వారం పరిష్కరించిన అర్జీల పత్రాలను అర్జిదారులకు ,ఈ నెలంతా కదిరి నియోజకవర్గంలో సేవలు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కావున కదిరి నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కదిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ... జిల్లా యంత్రాంగమంతా ఒక నియోజకవర్గానికి కేటాయించబడి, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించడమే కాకుండా, పరిష్కారమైన వివరాలను తిరిగి అర్జీదారులకే అందజేసే వినూత్న కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.

చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ తదితర సమస్యలను అధికారులే ప్రజల వద్దకు వచ్చి స్వీకరించి పరిష్కరించడం అభినందనీయమన్నారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజాసేవలో పాల్గొంటున్న జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి విజయ కుమారి, కదిరి ఆర్డిఓ కలావతి ,తహసీల్దార్ రెడ్డి శేఖర్,వివిధ శాఖల మండల అధికారులు, గ్రామస్థులు, రైతులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# బీటీపీకి నీళ్లు ఇస్తే ప్రతి ఇంట్లో సీఎం ఫొటో పెట్టుకుంటారు

**- 2028 మార్చి నాటికి బీటీపీ పూర్తి చేసి నీళ్లు తీసుకొస్తా : ఎమ్మెల్యే అమిలినేని**

**బ్రహ్మసముద్రం, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**




నియోజకవర్గ ప్రజల జీవనాడిగా ఉన్న బీటీపీ ప్రాజెక్టును 2028 మార్చి నాటికి పూర్తి చేసి సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. బీటీపీకి నీళ్లు అందిస్తే ప్రతి ఇంట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటో పెట్టుకుంటారని తాను సీఎంకు చెప్పానని, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అమిలినేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, మహర్షి వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు బీటీపీ పనులకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లించాల్సిన సర్వే నంబర్లు, భూమి ఎంత మేరకు సేకరిస్తున్నారు, రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు తదితర అంశాలను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు 18 నెలల సమయం పట్టిందన్నారు. బీటీపీ పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు.కన్నెపల్లి బ్రిడ్జి నిర్మాణానికి మూడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న ప్రతి రోడ్డును తారు రోడ్డుగా మార్చి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఒకటిన్నర నెలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన మూడు ఎకరాల భూమిని పది రోజుల్లో అందిస్తామని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు యూనిఫాం, షూస్, బెల్ట్, బ్యాగులు, పుస్తకాలు అందిస్తూ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంచి చదువుపై దృష్టి పెట్టేలా చూడాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యం లేక 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లడం చూసి సైకిళ్లు అందించాలని నిర్ణయించుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఎస్సార్సీ సంస్థ తరఫున రూ.5 కోట్ల వ్యయంతో నియోజకవర్గవ్యాప్తంగా 7,300 సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని, ఈ కార్యక్రమం వెనుక సంస్థలో పనిచేస్తున్న సుమారు 7,000 మంది శ్రమ ఉందన్నారు.వైసీపీ ప్రభుత్వం అమ్మవడి పథకం కింద రూ.5,500 కోట్లు ఖర్చు చేసిందని, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద రూ.10,190 కోట్లు కేటాయించి ఒక ఇంట్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నా అందరికీ ప్రయోజనం కల్పించిందని పేర్కొన్నారు. విద్యార్థులకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమన్నారు.మోడీ సహకారంతో సీఎం చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకువస్తున్నారని తెలిపారు. తిమ్మసముద్రం ప్రాంతంలో ఇప్పటికే ఉన్న 1,200 ఎకరాలకు మరో 3,000 ఎకరాలు జోడించి రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూముల ధరలు కూడా పెరుగుతాయని అన్నారు.పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయనిధి, వైద్య సహాయం వంటి విషయాల్లో ఎలాంటి రాజకీయ భేదాలు చూడటం లేదన్నారు. సైకిళ్ల పంపిణీలోనూ టీడీపీ, వైసీపీ అనే తేడా లేకుండా అర్హులైన విద్యార్థులందరికీ అందిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ మండల, స్థానిక నాయకులు, ఎంఈఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అప్రమత్త ఆంధ్రప్రదేశ్‌కు 'సావధాన్ ఇండియా'




**- ఆమదాలవలసలో యాప్ ఆవిష్కరణ.. ప్రజల భద్రతకు సరికొత్త వేదిక**

**ఆమదాలవలస, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**

ప్రజల భద్రత, అప్రమత్తత, సామాజిక బాధ్యతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రూపొందించిన 'సావధాన్ ఇండియా' యాప్‌ను ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ఆమదాలవలసలో ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, బెందాళం అశోక్ కలిసి యాప్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ప్రజలకు ఉపయోగపడేలా రూపొందించిన ఈ యాప్ ద్వారా మిస్సింగ్ పర్సన్స్, దొంగతనాలు, అనుమానాస్పద కార్యకలాపాలు, అత్యవసర రక్త అవసరాలు వంటి ముఖ్యమైన సమాచారాన్ని ప్రజలు రిపోర్ట్ చేయవచ్చు. అలాగే తమ పరిసరాల్లోని సేఫ్టీ అలర్ట్స్, అత్యవసర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది.ప్రజలు కేవలం సమాచారాన్ని తెలుసుకోవడమే కాకుండా, తమ పరిసరాల్లో గుర్తించిన ముఖ్యమైన సమాచారాన్ని ఇతరులతో పంచుకోవడం ద్వారా భద్రతా వ్యవస్థలో చురుకైన భాగస్వాములుగా మారేందుకు ఈ యాప్ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా 'సావధాన్ ఇండియా' వ్యవస్థాపకులు మహర్షి నీల మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో మరింత సురక్షితమైన సమాజాన్ని నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. "అప్రమత్తతే రక్షణ.. ప్రజల భాగస్వామ్యమే భద్రతకు బలం" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మొదలవలస రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యమే మా లక్ష్యం

**- పేదల వైద్యానికి భరోసా**
**- మాటల్లో కాదు చేతల్లో వైద్యాభివృద్ధి: మంత్రి సత్యకుమార్.....**
**- ఏరియా ఆసుపత్రిలో కొత్త ఒపీ కేంద్రం ప్రారంభించిన మంత్రి సత్యకుమార్....**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగష్టు 14, అనంత జనశక్తి న్యూస్ :**




ధర్మవరం పేదలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒపీ నమోదు కేంద్రాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...... ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి తక్కువ సమయంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో ఒకే ఒపీ కౌంటర్ ఉండటంతో రోగుల రద్దీ, వేచి ఉండే సమయం పెరిగేదని, దీనిని తగ్గించేందుకు మహిళలు, పురుషులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**18 వేల నుంచి 22-24 వేలకు పెరిగిన ఒపీ లు....**

ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో గతంలో నెలకు 16-18 వేల వరకు ఒపీ లు నమోదయ్యేవని, ప్రస్తుతం నెలకు 22-24 వేల వరకు పెరిగాయని మంత్రి తెలిపారు. రోజుకు సుమారు 700-800 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్న నేపథ్యంలో OP విభాగాన్ని విస్తరించి రద్దీని క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు.

కొత్త ఒపీ కేంద్రం ఏర్పాటుకు పేషెంట్స్ కేర్ ఫండ్స్ నుంచి సుమారు రూ.11.48 లక్షలు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు. పాత ఒపీ కౌంటర్‌ను ఐపీ కౌంటర్‌గా మార్చి వినియోగంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

**అభా తో డిజిటల్ ఆరోగ్య రికార్డులు....**

ప్రతి రోగి అభా ఐడి నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు. దీంతో గత వైద్య చరిత్ర, పరీక్షల వివరాలు, మందుల వివరాలు డిజిటల్‌గా అందుబాటులో ఉంటాయని, భవిష్యత్తులో అనవసరమైన పరీక్షలు, ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు.

**రూ.2.10 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు....**

గత రెండేళ్లలో ధర్మవరం ఏరియా ఆసుపత్రికి సుమారు రూ.2.10 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. లాపరోస్కోపిక్ సర్జరీలు నిర్వహించే స్థాయికి ఆసుపత్రి వైద్య సామర్థ్యాన్ని పెంచినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఐదుగురు వైద్యులు, ఐదుగురు సీనియర్ రెసిడెంట్లు అందుబాటులోకి రావడంతో వైద్య సేవలు మరింత విస్తరించాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల సంతృప్తి స్థాయిని 85-90 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు.

**10 పడకల డయాలసిస్ కేంద్రం.. బ్లడ్ బ్యాంక్‌కు ఆమోదం....**

ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో 10 పడకల డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలో స్థానికంగానే రక్త సంబంధిత సేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**రోగులతో నేరుగా మాట్లాడిన మంత్రి....**

ఒపీ కేంద్రం ప్రారంభించిన అనంతరం మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి ఒపీ నమోదు ప్రక్రియ, వైద్యుల సేవలు, మందుల లభ్యత, శానిటేషన్, నర్సింగ్ సిబ్బంది పనితీరు పై ఆరా తీశారు. రోగులను గౌరవంగా చూసుకోవాలని, వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని అధికారులను ఆదేశించారు.

**'ఆరోగ్య ధర్మవరం' నిర్మాణమే లక్ష్యం....**

ధర్మవరంలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసి 'ఆరోగ్య ధర్మవరం' నిర్మించడమే లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేసి పేదలకు ఉచితంగా, నాణ్యమైన వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హరి శ్రీనివాస్, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు, ఏపీఎంఎస్ఐడీసీ డీఈఈ నవీన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ భాగ్యలక్ష్మి, వైద్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మన జాతీయ పతాకం భారతదేశ ఖ్యాతికి చిహ్నం



**- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి**
**- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు**
**- జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజుతో కలిసి ఇంటిపై జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే**

**అనంతపురం ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్**

మన జాతీయ పతాకం భారతదేశ ప్రతిష్టకు, ఆత్మగౌరవానికి నిదర్శనమని.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. తన నివాసంపై జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం జెండాకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపుమేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే 'హర్ ఘర్ తిరంగా' రాష్ట్రమంతా కనిపిస్తోందన్నారు. ప్రజలంతా ఉత్సాహంతో పాలుపంచుకుంటున్నారన్నారు. మువ్వన్నెల జెండా భారతీయులు అందరికీ నిరంతరం నూతన ప్రేరణను అందిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేస్తూ.. వికసిత్ భారత్‌స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ఈ విధంగా కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి మన ఉమ్మడి ఐక్యతను చాటాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ స్టోర్ చైర్మెన్ బోయపాటి శ్రీనివాసులు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు రాయల్ మధు, దలవాయి వెంకటనారాయణ, జోగి రాజేంద్రలు పాల్గొన్నారు.

# ఆరోజు చెప్పాను.. ఈరోజు చేసి చూపించాను

**- కాలువపల్లిలో రూ.42 లక్షలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన**

**పరిగి/శ్రీసత్యసాయి, ఆగస్టు 14: అనంత జనశక్తి న్యూస్**



రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. పరిగి మండలం కాలువపల్లి గ్రామంలో రూ.42 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని తెలిపారు."రోడ్డు నిర్మించిన తర్వాతే కాలువపల్లి గ్రామానికి వస్తానని ఆరోజు చెప్పాను.. ఈరోజు చేసి చూపించాను" అని మంత్రి సవిత పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.పరిగి మండలంలో రూ.5.40 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి శుక్రవారం భూమిపూజలు, ప్రారంభోత్సవాలు చేశారు. శ్రీరంగరాజుపల్లి పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపల్లిలో రూ.కోటితో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదే గ్రామంలో రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీరంగరాజుపల్లి తాతయ్య దర్గా నుంచి చెర్లోపల్లి వరకు రూ.4.11 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు.

**అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి**

ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత ఇసుక, పెన్షన్ల పెంపు వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు మంత్రి సూచించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబాన్ని కలిసి రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని వివరించాలని సూచించారు.

**తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు**

వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క రోడ్డయినా నిర్మించారా అని మంత్రి సవిత ప్రశ్నించారు. వైసీపీ పాలన, రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాలు, పంచాయతీల వారీగా జరిగిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.సీఎం చంద్రబాబు పాలనపై, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని వైసీపీ నాయకులను హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమాల్లో అధికారులు, స్థానిక ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో విజయలక్ష్మి

**రాప్తాడు ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండల పరిధిలోని మరూర్, చెర్లోపల్లి, బండమీదపల్లి, ఎర్రగుంట, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో బి. విజయలక్ష్మి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి. అశోక్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో (SGSW) కె. అచ్యుతానందబాబు, మరూర్ పంచాయతీ అభివృద్ధి అధికారి ఎస్. శైలజ, చెర్లోపల్లి,బండమీదపల్లి పంచాయతీ అభివృద్ధి అధికారి ఎన్. విజయ్, ఎర్రగుంట పంచాయతీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, గొందిరెడ్డిపల్లి పంచాయతీ అభివృద్ధి అధికారి సి. ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# వరుస చోరీలకు చెక్.. రూ.46 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**8 కేసులు ఛేదించిన అనంతపురం పోలీసులు.. 7 మంది అరెస్ట్, ఐదుగురు మైనర్లు అదుపులో**

**అనంతపురం, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**

ప్రయాణికులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముఠా ఆటకట్టించినట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ తెలిపారు. ఈ ముఠాకు చెందిన ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు మరో ఐదుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి మొత్తం రూ.46 లక్షల విలువైన 313.14 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతపురం టూ టౌన్, రూరల్ పరిధిలోని 8 చోరీ కేసులను ఛేదించినట్లు పోలీసులు తెలిపారు.

**ఇలా చోరీలకు పాల్పడుతూ..**

నిందితులు ఒకే ముఠాగా ఏర్పడి ఆర్టీసీ బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రయాణికులు, మహిళలను లక్ష్యంగా చేసుకునేవారని పోలీసులు తెలిపారు. వారి దృష్టిని మరల్చి నగలు, బ్యాగులు, సెల్‌ఫోన్లు తదితర వస్తువులను అపహరించేవారని వెల్లడించారు.2025 నవంబర్ 7న అనంతపురం రూరల్ మండలం ఆత్మకోటపల్లికి చెందిన ఓ మహిళ ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆమె దృష్టిని మరల్చి సుమారు 25 తులాల బంగారు ఆభరణాలను అపహరించిన ఘటనకు సంబంధించి కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుతో పాటు ఇతర చోరీ కేసుల్లో నిందితుల ప్రమేయాన్ని గుర్తించారు.

**పోలీసుల సమర్థ దర్యాప్తు**

బాటిలవారి పల్లెకు చెందిన ఓ కేసులో అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 240/2025 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితులను గుర్తించి వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు.అరెస్ట్ చేసిన వారిలో గుత్తి ప్రాంతానికి చెందిన వనార్పు వర్ధన్, దేవరాజు బుజ్జమ్మ, దేవరాజు శ్రీను, వనార్పు బాలయ్య, దేవరాజు వెంకటసాయి, దేవరాజు లక్ష్మీనరసింహ, వనార్పు మోహన్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఐదుగురు మైనర్లను అదుపులోకి తీసుకుని జువైనల్ కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

**అధికారులను అభినందించిన ఎస్పీ**




కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన అనంతపురం టూ టౌన్ సీఐ కె. పుల్లయ్య, ఎస్సైలు సి. రమేష్‌బాబు, బి. రామకృష్ణ, ఎన్. కరీప్ప తదితర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ అభినందించారు. నేరాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నిందితుల నుంచి రూ.46

# మా భూమి మాకు కావాలి



- తాసిల్దార్ కార్యాలయం ముందు రైతులు నిరసన.....

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 14 అనంత జన శక్తి న్యూస్.**

టిడిపి కార్యాలయానికి కేటాయించిన రెండు ఎకరాల భూమి తమ అంగీకారం లేకుండా తీసుకున్నారని ఆ భూమిని వదులుకోవడానికి మేము సంసిద్ధంగా లేమని కప్పల బండ గ్రామానికి చెందిన రైతులు తాసిల్దార్ ముందు శుక్రవారం మోర పెట్టుకున్నారు.

టిడిపి కార్యాలయానికి కప్పల బండ రెవిన్యూ పొలంలో సర్వేనెంబర్ 2843,4,5,6. లెటర్లో రెండు ఎకరాల భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ఎకరాకి ఏడాదికి 1000 రూపాయలు చొప్పున లీజు చెల్లించేలా 66 సంవత్సరాల నుండి పరిమితితో గరిష్టంగా 99 ఏళ్ల వరకు లీజును పునరుద్ధరించుకొని వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది.

2026 మార్చి 5న పుట్టపర్తి మండల తాసిల్దారు వారి ఆదేశాలు మేరకు కప్పలబండ గ్రామపంచాయతీ పరిధిలో కప్పల బండ గ్రామ సర్వేనెంబర్ 2843 విస్తరణ 1.05 సర్వేనెంబర్ 2844 విస్తరణ 0.04 సర్వే నెంబర్ 2845 విస్తరణ 0.63 తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి భూమిని కేటాయించారు. జూన్ 15న కప్పల బండ గ్రామపంచాయతీ కార్యాలయం లో ప్రత్యేక అధికారి కళ్యాణ్ చక్రవర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు. ఈ సమావేశానికి ఈ సర్వే నెంబర్లకు సంబంధించిన రైతులకు పిలవలేదు నోటీసులు కూడా ఇవ్వలేదు, ఇతర సభ్యులతో సమావేశం ముగించి, రైతుల అంగీకారం తెలిపినట్లు, నమోదు చేశారు. సమావేశానికి పిలువకుండా ఎవరితో, ఎలా తీర్మానం చేశారని ప్రస్తుత పుట్టపర్తి తాసిల్దార్ను రైతులు నిలదీసారు. ఉన్న ఈ భూమి కోల్పోతే తమకు బ్రతుకు తెరువు కష్టతరమవుతుందని వారు ఆవేదం వ్యక్తం చేశారు.

పై సర్వే నెంబర్లకు సంబంధించి రాజప్ప ,లక్ష్మమ్మ, గంగమ్మ గత 30 సంవత్సరాలు పైగా ఈ భూమి పై వ్యవసాయం చేస్తూ ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. టిడిపి కార్యాలయం పేరుతో రెండు ఎకరాలు లాగేసుకొని ఈ ముగ్గురు రైతులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా రెవిన్యూ అధికారులు బెదిరింపులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అని వారు వా పోయారు.వెంటనే ముగ్గురు రైతులకు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం వారికి నష్టపరిహారం చెల్లించాలని, లేదా మా భూమి మాకు అప్పగించాలని తాసిల్దార్ నిలదీశారు. లేనియెడల తమకు ఆత్మహత్య శరణ్యమని వారు వాపోయారు. వీరికి మద్దతుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ మద్దతు పలికారు. రైతులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య ,నాగేష్, నాగవేణి, గంగమ్మ, రాజప్ప ,రమేష్ బాబు, నాగేంద్ర, పెద్దక్క ,రేవంత్, అనూష తదితరులు పాల్గొన్నారు.



# బందరులో ఘనంగా 'హర్ గర్ తిరంగా' ర్యాలీ

- శ్రీ వాసవి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 100 అడుగుల భారీ జెండాతో ర్యాలీ
- దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలన్న మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్**

ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న ప్రతి పౌరుడూ.. దేశ సమగ్రతకై కట్టుబడి ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలో శ్రీ వాసవి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 100 అడుగుల భారీ జెండా ర్యాలీని ప్రారంభించారు.కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు గారు, కుంచె దుర్గాప్రసాద్ గారు ఇతర నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ పౌరులందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల పోరాటం.. వేలాది మంది ప్రాణ త్యాగాల ఫలితం ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. భారత దేశంలో స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్యం కోసం ఊపిరి వదిలిన వారికి కృతజ్ఞత చాటుకోవాలి. ప్రతి నిత్యం వారి పోరాటాన్ని గుర్తు చేసుకోవాలి. గాంధీజీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ లాంటి ఎంతో మంది వీరుల త్యాగాలు స్మరించుకోవాలి. భవిష్యత్ తరాలకు ఆయా పోరాటాల గురించి వివరించాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.



# ఆరోగ్య భద్రతకు అండగా కూటమి ప్రభుత్వం.

- వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడొద్దు..ప్రభుత్వం అండగా ఉంది.

*- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో మంత్రి సత్యకుమార్ యాదవ్.

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్:**

అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 34 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32,69,279/లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేద కుటుంబాల్లో తీవ్రమైన అనారోగ్యం సంభవించినప్పుడు వైద్య ఖర్చులు కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని, అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వారికి







# విద్యార్థి దశ నుంచే దేశ భక్తి పెంపొందించుకోవాలి

- తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన
- రాప్తాడు కస్తూరిబా, మోడల్ పాఠశాలల్లో కార్యక్రమం
- మెడల్ స్కూల్లో సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సునీత చొరవ
- తన ఇంటి పై జాతీయ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే సునీత

**రాప్తాడు ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థి దశ నుంచే దేశభక్తితో పాటు క్రమశిక్షణ పెంపొందించుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. తిరంగా యాత్రలో భాగంగా ఆమె రాప్తాడులోని కస్తూరిబా, మోడల్ పాఠశాలలకు వెళ్లారు. విద్యార్థులు,ఉపాధ్యాయులు,అధికారులు,ప్రజాప్రతినిధులు ఆమెకు

ఘన స్వాగతం పలకగా వారితో కలసి త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు.వందేమాతరం, భారత్ మాతాకీ జై, జై జవాన్ జై కిసాన్ అన్న నినాదాలతో ర్యాలీ సాగింది. అనంతరం మోడల్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సుమారు 200 మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలను, విద్యార్థులకు వంట చేయు ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రహరీ గోడ అసంపూర్తిగా నిలిచిపోవడం, వంటగది లేకపోవడం, పాఠశాల ఆవరణలో ఫ్లోరింగ్ మరమ్మతులకు గురికావడం, నూతన ప్లాట్ ఫార్మ్ నిర్మాణం, బాత్ రూముల మరమ్మతుల సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని అత్యంత ఘనంగా నిర్వహించడంతో పాటు మన దేశ ప్రజల ఐక్యతను చాటే విధంగా కార్యక్రమాలు చేయాలన్నారు. విద్యార్థులు ప్రధానంగా ఇందులో కీలక భాగస్వామ్యులు కావాలన్నారు. భవిష్యత్ తరాలకు మీరు వారధిగా ఉంటూ ఆ మహానీయులు సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికీ చాటి చెప్పాలన్నారు.

# శ్రీకాకుళం అభివృద్ధికి సమష్టి కృషి..

- ఐదేళ్లలో మౌలిక వసతుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం
- వంశధార వివాదానికి పరిష్కారం.. నేరడి బ్యారేజ్‌కు రూ.641
- శ్రీకాకుళం అభివృద్ధికి మహా ప్రణాళిక.. గార నుంచి జిల్లా కేంద్రం వరకు అభివృద్ధి జోరు
- రూ.11 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం
- సాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, పట్టణ మౌలిక వసతులకు పెద్దపీట

**శ్రీకాకుళం ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్**



శ్రీకాకుళం నియోజకవర్గం గార మండలంతో పాటు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు వేగం పెరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ సమన్వయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు విస్తృతంగా పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, పార్కులు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పనులను చేపట్టారు.శ్రీకాకుళం జిల్లాను సస్యశ్యామలం చేయడంతో పాటు ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

**గార–కళింగపట్నం ఎత్తిపోతల పథకం ప్రారంభం**

గార-కళింగపట్నం ఎత్తిపోతల పథకాన్ని మంత్రులు, ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.2.55 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకం ద్వారా ఆయా ప్రాంతాల్లో సాగునీటి అవసరాలను తీర్చేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు.అనంతరం గార నుంచి వమరవెల్లి వరకు బైక్ పై తిరంగ ర్యాలీ నిర్వహించారు. వమరవెల్లి వద్ద ట్యాంక్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ కార్యక్రమంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వంశధార వివాదానికి పరిష్కారం**

వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ఒడిశాతో దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్రాష్ట్ర వివాదానికి పరిష్కారం చూపడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా గెజిట్ సాధించామని అచ్చెన్నాయుడు తెలిపారు. నేరడి బ్యారేజ్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం లభించిందని, రూ.641 కోట్లతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.రానున్న రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, ఏడాదిన్నరలో నేరడి బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నేరడి బ్యారేజ్ పూర్తయితే వంశధార జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జిల్లాలో సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

మహాలక్ష్మి నగర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మహాలక్ష్మి నగర్‌లో రూ.2.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు.శ్రీకాకుళం నగరంలో లోవోల్టేజ్ తదితర సమస్యలకు పరిష్కారం చూపేందుకు విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం శ్రీకాకుళం ప్రజల 30 ఏళ్ల కల అని, ప్రస్తుతం ఆ కల సాకారం అవుతోందని అన్నారు.

నగరంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

శ్రీకాకుళం ప్రధాన మార్కెట్ -మెదరవీధిలో రూ.52 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. ఏడు రోడ్ల జంక్షన్‌లో రూ.56 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు.కృష్ణ పార్కు వద్ద రూ.16.54 లక్షలతో నిర్మించిన కల్వర్టును, డే అండ్ నైట్ జంక్షన్‌లో రూ.2.90 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన సెంట్రల్ డివైడర్‌ను ప్రారంభించారు.శ్రీకాకుళంలో రూ.1.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన నీటిపారుదల శాఖ ఈఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. వరం కాలనీలో రూ.39.95 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్లు, రూ.22.95 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కును కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్‌తో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.రాబోయే ఐదేళ్లలో ప్రజలు తమ సమస్యలను చెప్పాల్సిన అవసరం లేకుండా ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల సహకారంతో శ్రీకాకుళం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి, జిల్లా కేంద్రాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.శ్రీకాకుళం అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, పట్టణ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వివిధ శాఖల అధికారులు,

కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిసెంబర్ నాటికి 3వేల టిడ్కో ఇళ్లు ఇస్తాం

- ఎమ్మెల్యే దగ్గుపాటి
- అర్బన్ టీడీపీ కార్యాలయంలో 54వ ప్రజా దర్బార్ కార్యక్రమం
- సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం.. అందుకే అర్జీలు తగ్గాయన్న ఎమ్మెల్యే
- అనారోగ్యంతో ఉన్న మహిళకు రూ.5లక్షల ఎల్ఓసి ద్వారా సాయం
- వైసీపీ రంగుల పాలనపై ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు

**అనంతపురం ఆగస్ట్ 14, అనంత జనశక్తి న్యూస్**



వచ్చే డిసెంబర్ నాటికి 3వేల టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 54వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలు వింటూ వారి నుంచి అర్జీల స్వీకరించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు 54సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామని.. ఇందులో 1227అర్జీలు వచ్చాయని.. వాటిలో 1179 పరిష్కరించామన్నారు. కేవలం 45 మాత్రమే పెండింగ్ లో ఉన్నాయని..సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నా కాబట్టే అర్జీలు తగ్గుతున్నాయన్నారు. అర్జీల్లో ఎక్కువగా హౌసింగ్, పింఛన్ సమస్యలు ఉన్నాయని చెప్పారు. 201419సమయంలో టిడ్కో ఇళ్లు దాదాపు పూర్తి చేశామని.. ఆ తర్వాత వచ్చిన గొడ్డలి పార్టీ కేవలం తమ పార్టీ రంగులు వేసుకుని.. అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేశారని విమర్శలు చేశారు. మేము అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తున్నామని.. డిసెంబర్ నాటికి 3వేల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జగన్ రెడ్డి 10లక్షల కోట్ల అప్పులు పెట్టిపోవడంతో వలన రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఒక్క పింఛన్లకే 35వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెలఖరు లేదా వచ్చే నెల మొదట్లో కొత్త పింఛన్లు కూడామంజూరు చేస్తామని చెప్పారు. మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులకు అవసర రాద్ధాంతం చేస్తున్నారని.. 150రోజుల్లో 16347పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారన్నారు. టీచర్లను తన హయాంలో అవమానించిన జగన్ రెడ్డి ఈ రోజు డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆధారాలు చూపించమంటే వైసీపీ నాయకులు ముందుకు రావడం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు చేశారు...

**అనారోగ్యంతో ఉన్న మహిళకు రూ.5లక్షల సాయం**

అనంతపురం నగరంలోని 5వ రోడ్డుకు చెందిన నీరజ అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా.. కుటుంబసభ్యులు ఆమెను హైదరాబాద్ తరలించారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. విషయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని.. ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ఎల్.ఓ.సి మంజూరు చేయించారు. మొత్తం రూ.5లక్షల రూపాయలు వచ్చేలా చేశారు. ఈ పత్రాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వారు ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు...

# ఎమ్మెల్యే దగ్గుపాటికి రెడ్ క్రాస్ ప్రశంసా పత్రం

- ఈనెల 10న దగ్గుపాటి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం
- రక్తదానం చేసిన వారికి అభినందనలతో షీల్డులు అందజేసిన ఎమ్మెల్యే

**అనంతపురం ఆగస్ట్ 14 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు రెడ్ క్రాస్ సంస్థ ప్రశంసా పత్రాన్ని అందజేసింది. ఈనెల 10న దగ్గుపాటి పుట్టినరోజు సందర్భంగా క్లస్టర్ ఇన్ ఛార్జి కాయగూరల శ్రీధర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి రెడ్ క్రాస్ ప్రతినిధులు లక్ష్మణ్ ప్రసాద్, భరత్ కుమార్ లు వచ్చారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రశంసా పత్రాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మీ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటైందని.. భవిష్యత్ ఏదైనా పెద్ద కార్యక్రమం జరిగినప్పుడు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనికి ఎమ్మెల్యే దగ్గుపాటి కూడా సానుకూలంగా స్పందించారు. మరోవైపు రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ ఎమ్మెల్యే దగ్గుపాటి షీల్డ్ లు అందజేశారు. క్లస్టర్ ఇన్ ఛార్జి కాయగూరల శ్రీధర్ ను ప్రత్యేకంగా అభినందించారు. తన పుట్టిన రోజు సందర్భంగా నాపై ప్రేమతో రక్తదానం చేయడం వ్యక్తిగతంగా తనకు సంతోషాన్నివ్వడమే కాకుండా మీరు 50మంది ప్రాణాలు నిలిపే విధంగా చేశారన్నారు. భవిష్యత్ లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు.



# జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



- శ్రీ సత్యసాయి జిల్లా జనరల్ సెక్రెటరీ సూర్యప్రకాష్.




ధర్మవరం ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్:

**జాతీయస్థాయి హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని శ్రీ సత్యసాయి జిల్లా హాకీ జనరల్ సెక్రెటరీ సూర్యప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆగస్టు12 వ తేదీ నుండి 22 వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణే నగరంలో జరుగుతున్న జాతీయస్థాయి జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ షిప్ లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు సత్యసాయి జిల్లాకు చెందిన**

పతకమూరి ప్రవిత, రమావత్ వర్ష, పూజారి మధురిమా బాయి,ఎంపికయ్యారు అని తెలిపారు. జులై నెలలో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనారు అని తెలిపారు. అలాగే బాలుర విభాగంలో ధర్మవరం కు చెందిన రమావత్ ,లవన్ కుమార్ నాయక్ జూలై నెలలో కోయంబత్తూర్ లో జరిగిన జాతీయ జూనియర్ పురుషుల హాకీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారూ అనితెలిపారు.

ఎంపికైన క్రీడాకారులను హాకీ సత్య సాయి జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లెం.వేణుగోపాల్, బండి వేణుగోపాల్ హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్, హాకీ సత్య సాయి జిల్లా జనరల్ సెక్రటరీ

బి. సూర్య ప్రకాష్, హాకీ సత్యసాయి జిల్లా ప్రెసిడెంట్ బీ.వీ శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ గౌరీ ప్రసాద్, ఉడుముల రామచంద్ర, మహమ్మద్ అస్లాం,ఉకా రాఘవేంద్ర, ట్రెజరర్ అంజన్న,జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్, చందు, మారుతీ కుమార్, డైరెక్టర్లు అమునోద్దీన్, కిరణ్, ఇర్షాద్, సత్య సాయి జిల్లా హాకీ కోచ్ హస్సేన్ అభినందన శుభాకాంక్షలు తెలియజేసారు.

# యువ మోర్చా పగ్గాలు బాడం మధుసూదన్‌కు



అనంతగిరి, ఆగస్టు 14:
అనంత జనశక్తి న్యూస్

భారతీయ జనతా పార్టీ అనంతగిరి మండల యువ మోర్చా అధ్యక్షుడిగా బాడం మధుసూదన్ నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగయ్య అధికారికంగా ప్రకటించారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నూతన అధ్యక్షుడు బాడం మధుసూదన్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ యువతను సమన్వయం చేసి, క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.మధుసూదన్ నియామకంపై బీజేపీ కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు, అనంతగిరి మండల అధ్యక్షుడు సోమరాజు, ప్రధాన కార్యదర్శులు రామస్వామి, రామకృష్ణ, మండల ఇన్‌చార్జి డోంబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.యువ మోర్చా అధ్యక్షుడిగా మధుసూదన్ నియామకం మండలంలో పార్టీకి, ముఖ్యంగా యువతలో బీజేపీకి మరింత బలం చేకూరుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులతో కలిసి తిరంగా చేతబట్టి నడిచిన మంత్రి సత్యకుమార్

- 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా నిలపాలి....
- నేటి విద్యార్థుల చేతుల్లోనే 2047 భారత భవిష్యత్తు: మంత్రి సత్యకుమార్.....

ధర్మవరం ఆగష్టు 14 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఇంటికీ, ప్రతి మనసుకీ తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలో శుక్రవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ధర్మవరం కాలేజ్ గ్రౌండ్ నుంచి గాంధీ సర్కిల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విద్యార్థులతో కలిసి జాతీయ జెండా చేతబట్టి నడిచారు. విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తిరంగా కేవలం ఒక జెండా కాదని, వందల ఏళ్ల స్వాతంత్ర్య పోరాటానికి, అమరవీరుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం అనేక తరాలు పోరాడాయని, వేలాది మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ ప్రజాస్వామ్య దేశంలో జీవిస్తున్నామని పేర్కొన్నారు.

**అమరవీరుల త్యాగాలు వృథా కాకూడదు....**

భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, అష్ఫాఖుల్లా ఖాన్ తదితర మహనీయుల స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కేవలం ఆగస్టు 15న మాత్రమే స్మరించుకోవడం కాకుండా.. వారి ఆశయాలను జీవితంలో ఆచరించాలని సూచించారు.

స్వాతంత్ర్యం అంటే మనకు నచ్చిన విధంగా జీవించే హక్కు మాత్రమే కాదని, దేశం పట్ల బాధ్యతను నిర్వర్తించడం కూడా అని అన్నారు. విద్య, వృత్తి, ఆలోచన, ప్రతిభను స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా లభించిందని తెలిపారు.

**ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్....**

భారత్ నేడు సాంకేతికత, అంతరిక్షం, డిజిటల్ రంగం, వ్యాపారం తదితర అనేక రంగాల్లో ప్రపంచానికి తన సత్తాను చాటుతోందని మంత్రి సత్యకుమార్ అన్నారు. భారతీయ యువతలో ప్రపంచాన్ని నడిపించే ప్రతిభ, సామర్థ్యం ఉందని పేర్కొన్నారు.

2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతాయని, అప్పటికి భారత్‌ను ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశాల్లో ఒకటిగా తీర్చిదిద్దే బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. ఆర్థిక, రక్షణ, సాంకేతిక, మానవ వనరుల రంగాల్లో భారత్ అగ్రగామిగా ఎదగాలని ఆకాంక్షించారు.

**2047 భారత భవిష్యత్తు మీ చేతుల్లోనే.....**

''నేడు విద్యార్థులుగా ఉన్న మీరే 2047లో దేశాన్ని నడిపించే నాయకులు. భారతదేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది'' అని మంత్రి విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. దేశ భవిష్యత్తుతో పాటు తమ భవిష్యత్తును కూడా నిర్మించుకోవాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్తు కోసం కృషి చేస్తోందన్నారు.

**బాగా చదివి.. మంచి పౌరులుగా ఎదగాలి.....**

విద్యార్థులు బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలగాలని మంత్రి సూచించారు. పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. దేశాన్ని కూడా తల్లిదండ్రులను, గురువులను గౌరవించినంతగా గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడంతో ముగిసిపోకూడదని, దేశభక్తిని ప్రతి మనసులో నింపే ఉద్యమంగా మారాలని మంత్రి సత్యకుమార్ అన్నారు. తిరంగా మన స్వాతంత్ర్యానికి, ఐక్యతకు, అమరవీరుల త్యాగాలకు, భవిష్యత్తుపై మన ఆశలకు ప్రతీక అని పేర్కొన్నారు. తిరంగా ర్యాలీని విజయవంతం చేసిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మంత్రి ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి 'భారత్ మాతాకీ జై' నినాదాలు చేశారు.



ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా రాష్ట్ర కన్వీనర్ గుడిసె దేవా ఆనంద్, కాపు రామచంద్రారెడ్డి, బీజేపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఎంఈఓ గోపాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేషు, బీజేపీ పట్టణ మండల అధ్యక్షులు జింక చంద్ర, గొట్లూరు చంద్ర, ఆకులేటి భాస్కర్, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తమలపాకుల అలంకరణలో అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో విశేష అభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణం.

ధర్మవరం ఆగష్టు 14, అనంత జనశక్తి న్యూస్:



పట్టణంలోని సాలే వీధిలో వేంచేసియున్న శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు.

ఉదయం ఆలయ అర్చకులు వెంకటేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలు, విశేష మంగళ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం జరిపారు. అనంతరం బుగ్గ వంశస్థుల సమర్పణలో అమ్మవారిని తమలపాకులతో విశేషంగా అలంకరించారు. ఈ అలంకారంలో అమ్మవారు భక్తులకు విశేష రూపంలో దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలందరూ కలిసి శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో, భక్తజనసందోహంతో నిండిపోయింది.

# పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

- వీడియో కాన్ఫరెన్స్‌లో 9 వినతులు స్వీకరించిన అదనపు ఎస్పీ..

తక్షణ పరిష్కారానికి ఆదేశాలు

అనంతపురం, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్

పోలీసు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం తెలిపారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు సిబ్బంది, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రీవెన్స్ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల నుంచి అధికారుల వరకు సిబ్బంది ఎదుర్కొంటున్న వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను అదనపు ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వెల్ఫేర్ లోన్ల మంజూరు, ప్రమోషన్లు పొందిన సిబ్బందికి ఇంక్రిమెంట్ల మంజూరు, వేరికోస్ వేన్స్ ఆపరేషన్లు చేయించుకున్న సిబ్బంది వైద్య బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై వినతులు స్వీకరించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో మొత్తం 9 వినతులు అందగా, వాటిని పరిశీలించిన అదనపు ఎస్పీ సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడి తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# అనంతగిరి రెవెన్యూ కార్యాలయంలో గిరిజనుల గోస!

- కనీస వసతులు కరవు.. అధికారుల కోసం పడిగాపులు
- మెట్లపైనే దరఖాస్తులు.. ఎండలోనే నిరీక్షణ
- దూర ప్రాంతాల నుంచి వచ్చి రోజంతా వేచి చూస్తున్న గిరిజన రైతులు

అనంతగిరి,ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం గిరిజన రైతులకు అవస్థల కేంద్రంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మారుమూల కొండ ప్రాంతాల నుంచి భూ సమస్యలు, భూ ఆధార్, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని 24 పంచాయతీల్లో 20షెడ్యూల్, 4నాన్‌షెడ్యూల్ పంచాయతీలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రెవెన్యూ కార్యాలయానికి వస్తుంటారు. అయితే కార్యాలయంలో కూర్చోవడానికి సరిపడా కుర్చీలు, నిరీక్షించేందుకు నీడ, తాగునీరు వంటి కనీస వసతులు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు చెబుతున్నారు.

**మెట్లపైనే దరఖాస్తులు... ఎండలోనే నిరీక్షణ**

దరఖాస్తులు రాసుకునేందుకు కనీసం బల్లలు కూడా లేకపోవడంతో కొందరు కార్యాలయ మెట్లపైనే కూర్చొని దరఖాస్తులు రాసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. కార్యాలయం వెలుపల నీడ సౌకర్యం లేక పలువురు ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. చంటిబిడ్డలతో వచ్చే మహిళల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. తాగునీరు అందుబాటులో లేకపోవడంతో బయట దుకాణాలపై ఆధారపడాల్సి వస్తోందని చెబుతున్నారు.

**సుదూర పంచాయతీల ప్రజలకు తిప్పలు**

పెదకోట,పినకోట,జీనబాడు, రొంపల్లి,గరుగుబిల్లి, గుమ్మకోట, వెంగడ,పైనంపాడు తదితర సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు గంటల తరబడి ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. అయితే కార్యాలయానికి వచ్చిన తర్వాత కూడా తమ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక రోజంతా నిరీక్షించాల్సి వస్తోందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో?**

తమ ప్రాంతాలకు సంబంధించిన రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండే సమయంపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని ఆరోపిస్తున్నారు. చిన్నచిన్న పనుల కోసం కూడా పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు. రోజువారీ కూలి పనులు మానుకుని కార్యాలయానికి వస్తే పని పూర్తికాకపోగా ప్రయాణ ఖర్చులు, ఇతర ఖర్చులతో ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు వాపోతున్నారు.




**ఉన్నతాధికారులు స్పందించాలి**

మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అనంతగిరి రెవెన్యూ కార్యాలయంలో తక్షణమే సరిపడా సీటింగ్, తాగునీరు, నీడ, దరఖాస్తులు రాసుకునే సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుని, ప్రజల పనులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఉన్నతాధికారులను గిరిజన రైతులు కోరుతున్నారు.

# దేశభక్తి నినాదాలతో ర్యాలీ..



గాండ్లపెంట, ఆగస్ట్,14, అనంత జనశక్తి న్యూస్,

మండలం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మోహనరావు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారి దేశభక్తి నినాదాలతో మార్మోగింది.

ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మోహనరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను అలవర్చుకోవాలని తెలిపారు. జాతీయ జెండా పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో మెలగాలని కోరారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు జాతీయ సమైక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని మోహనరావు పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు.

ర్యాలీలో విద్యార్థులు జాతీయ జెండాలతో క్రమశిక్షణతో ముందుకు సాగుతూ దేశభక్తి నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద ర్యాలీ ముగిసిన అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులు సమీక్షించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ నాయక్, ఎంఈఓ-2 శ్రీనివాసులు, వీఆర్వో సునీత, ఏవో నరేంద్రారెడ్డి, మండల వ్యవసాయ అధికారి షాదబ్, ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, ఏపీఎం సూర్యనారాయణ, మండల కన్వీనర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు వసుంధర, అమరేశ్వరి, డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, సూపర్వైజర్ ఉపేంద్ర రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ విజయవంతంగా నిర్వహించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ఆనందం వ్యక్తం చేశారు.

# అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగరతీర మహాగణపతి ఉత్సవాలు



**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుండాలి**
- **ట్రాఫిక్, ఆహారం, తాగునీరు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి**
- **10 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది**
- **మంగినపూడిలో వినాయక చవితి ఏర్పాట్లపై అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష**

**మచిలీపట్నం ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్**

మచిలీపట్నం పర్యాటక శోభను ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా మంగినపూడి బీచ్ వద్ద ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల మహాగణపతి ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విగ్రహ నిర్మాణ పనుల్ని, బీచ్ వద్ద సదుపాయాలను అధికారులతో కలిసి పరిశీలించారు. కృష్ణా జిల్లా, మచిలీపట్నానికి చారిత్రక, వారసత్వ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పాలి. కార్యక్రమంలో ప్రతి ఒక్క పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుండి మట్టి తీసుకొచ్చి విగ్రహ నిర్మాణంలో భాగస్వామి కావాలన్నారు. తద్వారా ప్రతి పౌరుడూ, ప్రతి ఇల్లు ఈ మహత్కార్యంలో భాగస్వామి అయినట్లుగా భావిస్తామన్నారు. సాగరతీర మహాగణపతి ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ముఖ్యంగా.. బీచ్ పరిసరాల్లో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, డ్రైనేజీ, వేస్ట్ మేనేజ్ మెంట్ వంటి అంశాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. గతంలో ఎదురైన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలి. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులు, అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

# వరుపుల రాజా సేవలు చిరస్మరణీయం



**ఆయన ఆశయాల సాధనే ఘనమైన నివాళి: మంత్రి నారాయణ**

**కాకినాడ ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్**

దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. వరుపుల రాజా జయంతి సందర్భంగా ప్రత్తిపాడులో ఆయన విగ్రహాన్ని మంత్రి నారాయణ ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. దివంగత వరుపుల రాజా జన్మదినం సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సేవకు అంకితమైన రాజా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.

ప్రజల కోసం వరుపుల రాజా ఏర్పరచుకున్న ఆశయాలను ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు ముందుకు తీసుకెళ్లడం ఆయనకు అందించే ఘనమైన నివాళి అని మంత్రి నారాయణ అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వరుపుల సత్య ప్రభ.. రాజా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. వరుపుల రాజా ఆశయాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు సహకారం అందిస్తుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ప్రభుత్వం తరపున రాజా ఆశయాల కొనసాగింపునకు అవసరమైన విధంగా కృషి చేస్తామని తెలిపారు.

వరుపుల రాజా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వరుపుల సత్య ప్రభ, కొండబాబు, పంతం నానాజీ, కాకినాడ ఎంపీ సానా సతీష్, మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్కేయూ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన బీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్

**అనంతపురం, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) బొటానికల్ గార్డెన్‌ను బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) డెక్కన్ సర్కిల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రసింగం శుక్రవారం సందర్శించారు. కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన ప్రాజెక్టు కింద గార్డెన్‌లో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించి, ప్రాజెక్టు పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అరుదైన, ఔషధ ప్రాధాన్యత కలిగిన మెసువా ఫెర్రియా (నాగకేసరి), అక్విలేరియా అగల్లోచా (అగరువుడ్) మొక్కలను బొటానికల్ గార్డెన్‌లో నాటారు. అనంతరం గార్డెన్‌లోని 38 సెక్టార్లతో పాటు వివిధ మొక్కల ప్రొపగేషన్ నర్సరీలను సందర్శించి మొక్కల సంరక్షణ, వృక్షజాతుల పరిరక్షణ, వ్యాప్తి విధానాలను పరిశీలించారు. విలువైన వృక్షజాతుల జన్యు వనరులను (జర్మ్‌ప్లాజమ్) సంరక్షించేందుకు ప్రధాన పరిశోధకులు ప్రొఫెసర్ బి.ఆర్.పి. రావు చేస్తున్న కృషిని డాక్టర్ రసింగం అభినందించారు. అరుదైన, ప్రాముఖ్యత కలిగిన వృక్షజాతులను సంరక్షిస్తూ వాటి అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం ప్రశంసనీయమన్నారు. బొటానికల్ గార్డెన్‌లో చేపడుతున్న కార్యక్రమాలు, మొక్కల సంరక్షణ, జర్మ్‌ప్లాజమ్ పరిరక్షణకు సంబంధించిన వివరాలను కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, బోటనీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, పరిశోధక విద్యార్థులు, మాస్టర్ డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు. గార్డెన్‌లోని వృక్ష వైవిధ్యం, సంరక్షణ, మొక్కల పెంపకం విధానాలను పరిశీలించిన విద్యార్థులు ఈ సందర్శన ద్వారా విలువైన అనుభవాన్ని పొందారు.




# రాష్ట్రంలో రోజూ 7 వేల టన్నుల చెత్త ఉత్పత్తి

- **అక్టోబర్ నాటికి మున్సిపాలిటీల్లో మిగిలిన 70 లక్షల టన్నుల చెత్త తొలగింపు**
- **107 మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ నెలాఖరులోగా ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటు**
- **రాజమహేంద్రవరంలో మంత్రి నారాయణ**

**రాజమహేంద్రవరం:**
**ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసుతో కలిసి లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిరోజూ సుమారు 7 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను విధించినప్పటికీ, లక్షల టన్నుల చెత్తను పేరుకుపోయేలా చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. భూమిపై పేరుకుపోయిన 85 లక్షల టన్నుల చెత్తను ఇప్పటికే పూర్తిగా తొలగించామని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీల్లో ఇంకా మిగిలి ఉన్న 70 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామని వెల్లడించారు.

**వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటు**

201419 మధ్య కాలంలో రాష్ట్రంలో 10 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అయితే గత ముఖ్యమంత్రికి సరైన అవగాహన లేకపోవడంతో ఆ ప్లాంట్లను రద్దు చేశారని అన్నారు. ప్రస్తుతం కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురం ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. పెద్దాపురంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పూర్తయిన వెంటనే రాజమహేంద్రవరం నుంచి వచ్చే చెత్తను అక్కడికి తరలిస్తామని తెలిపారు.

**107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు**



వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పూర్తయ్యేలోగా వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు రాష్ట్రంలోని 107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ ప్లాంట్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఘన వ్యర్థాల నిర్వహణను చేపడతామని వెల్లడించారు.

**మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం**

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి నారాయణ తెలిపారు.

విలీన గ్రామాలకు సంబంధించిన అంశంపై కోర్టు తీర్పు వెలువడిన అనంతరం మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

# అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా బందరుని తీర్చిదిద్దుతాం

- **తాగునీటికి అవస్థలుపడే పరిస్థితి నుండి.. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు**

**మచిలీపట్నంలో సంక్షేమం అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం**
**రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి ప్రాజెక్టులకు పెద్దఎత్తున నిధులు కేటాయించాం**
**కరగ్రహారం బాబానగర్‌లో రూ.74 లక్షలతో ఓవర్ హెడ్ రిజర్వాయర్ శంకుస్థాపనలో మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్**

మచిలీపట్నంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు కరగ్రహారం పరిధిలోని బాబానగర్‌లో రూ.74 లక్షల వ్యయంతో ఓవర్ హెడ్ స్టోరేజి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ సహా పలువురు నాయకులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. భూమి పూజ చేసి.. పనుల్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మచిలీపట్నంలో ఉపాధి హామీ పథకంతో వందల కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశాం. గత ఐదేళ్లు కేంద్రం నుండి నిధులు తెచ్చుకోవడం చేతకాలేదు. గ్రామాల్లో రోడ్లు వేయలేదు. అభివృద్ధిని గాలికి వదిలేశారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అడుగేస్తే చేయని అభివృద్ధి ఏదీ లేదని గుర్తించి కలిసి అడుగేస్తున్నాం. గతంలో బందరు మున్సిపాలిటీ సహా అనేక ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు బిందెలతో రోడ్లపై కాపుకాయాల్సి వచ్చేది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి బందరులో ఏడు రిజర్వాయర్లు ఉంటే.. 201419 మధ్య కొత్తగా 8 రిజర్వాయర్లు కట్టించి ఇంటింటికీ మంచినీరు అందించాం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. జల్ జీవన్ మిషన్ పథకంతో ప్రతి ఇంటికీ తాగునీటి కులాయిలు ఏర్పాటు చేస్తున్నాం. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇప్పటికి రూ.6 కోట్లు వచ్చాయి. బాబానగర్‌లో రూ.28 లక్షలతో పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పుడు రూ.74 లక్షల వ్యయంతో ఓవర్ హెడ్ రిజర్వాయర్ నిర్మిస్తున్నాం. ఖాలేకాన్ పేట నుండి చిన్నాపురం వరకు అన్ని ప్రాంతాలకు తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ముందస్తు చర్యల్లో భాగంగా ఓవర్ హెడ్ రిజర్వాయర్లు ఏర్పాటు చేసుకుంటున్నాం.



మచిలీపట్నంలో అనేక సమస్యలున్నాయి. వాటన్నింటినీ పరిష్కరించే లక్ష్యంతో పని చేస్తున్నాను. 201419 మధ్య కాలంలో బందరులో 6200 టిడ్కో ఇళ్లు కట్టించాం. గత ఐదేళ్లు వాటిని లబ్దిదారులకు ఇవ్వకుండా వేధిస్తే మనం రాగానే అన్నింటినీ పంపిణీ చేశాం. కరగ్రహారం వద్ద సెంటు పట్టాల పేరుతో వైసీపీ నాయకులు డ్రామాలాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రాంతం మొత్తాన్ని మెరుగు పరిచాం. తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తున్నాం. మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చే సమయానికి రాష్ట్ర ఖజానా మొత్తం ఖాళీ చేశారు. అప్పుల్లో ముంచేశారు. కూటమి అధికారంలోకి చేపట్టిన తర్వాత వారు చేసిన అప్పులు తీర్చేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. మనకు వచ్చే ఆదాయం మొత్తం జీతాలకే సరిపోతోంది. అయినప్పటికీ.. ఆదాయం సృష్టించుకుంటూ అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. పరిశ్రమలు తీసుకొస్తున్నాం. పెట్టుబడులు వస్తున్నాయి. బందరు పోర్టును వచ్చే మార్చి నాటికి పూర్తి చేయబోతున్నాం. మెడికల్ కాలేజీ అభివృద్ధి జరుగుతోంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. ప్రతి పౌరుడికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా ఏంటో చూపించాలి. ప్రతి గ్రామంలో కూటమి జెండా ఎగరాలి. ప్రతి గడపనా అభివృద్ధి కనిపించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# ఉద్యోగాల కోసం ఎదురు చూడొద్దు.. ఉద్యోగాలు సృష్టించండి

- **ఎస్కేయూలో బయో-ఇన్నోవేషన్లపై వన్‌డే హ్యాకథాన్.. రాష్ట్రస్థాయికి ఆరు బృందాలు ఎంపిక**

**అనంతపురం, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**

యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్ పిలుపునిచ్చారు. ఎస్కేయూ, బెంగళూరుకు చెందిన ExcelR సంస్థ సహకారంతో బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో స్థిరమైన బయోఇన్నోవేషన్ ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించేందుకు శుక్రవారం వన్‌డే హ్యాకథాన్ నిర్వహించారు. RUSA గ్రాంట్ల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు వినూత్న స్టార్టప్ ఆలోచనలను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థాపకులు పుట్టుకతో తయారు కారని, విద్య, శిక్షణ, అనుభవం, అవకాశాల ద్వారా వారిని తీర్చిదిద్దవచ్చన్నారు. నిజ జీవిత సమస్యకు ఆచరణాత్మక పరిష్కారం చూపినప్పుడే ఆలోచన వ్యాపారంగా మారుతుందని తెలిపారు. వైఫల్యాలను ఎదుర్కొనే ధైర్యం ఉన్నప్పుడే విజయవంతమైన వ్యవస్థాపక ప్రయాణం సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు. హ్యాకథాన్‌లో విద్యార్థి బృందాలు బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధికి దోహదపడే వినూత్న ఆలోచనలు, స్టార్టప్ ప్రతిపాదనలను ప్రదర్శించాయి. JNTUA ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు, ఎస్కేయూ డాక్టర్ నరేంద్ర మద్దు నిపుణులుగా విద్యార్థుల ప్రాజెక్టులను మూల్యాంకనం చేశారు.




రాష్ట్రస్థాయికి ఆరు బృందాలు

హ్యాకథాన్‌లో ప్రతిభ కనబరిచిన ఆరు బృందాలు రాష్ట్రస్థాయి హ్యాకథాన్‌కు ఎంపికయ్యాయి. ఆగస్టు 18 నుంచి 22 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాకథాన్‌లో ఈ బృందాలు పాల్గొంటాయి. ఎంపికైన బృందాల్లో BioBridge Consulting Growth Service (SKIM), Banana Bloom (హిందూపురం N.S.P.R. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్), Gujri App (ప్రభుత్వ కళాశాల, అనంతపురం), Biofertilisers in Sustainable Development (SKP ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుంతకల్), Agrichill (S.V. డిగ్రీ కళాశాల, అనంతపురం), Regaining Tanks - Recharging Groundwater (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండ) ఉన్నాయి.

కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ బి. రవిప్రసాద్ రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ డి. అంజనేయులు, ExcelR సదరన్ ఆంధ్ర రీజినల్ మేనేజర్ సుభాష్ చంద్రబోస్, డా. బి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించి సత్తా చాటాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# పుట్టపర్తిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**పుట్టపర్తి, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**

**దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించడమే లక్ష్యంగా పుట్టపర్తిలో శుక్రవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. సత్యమ్మ ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి, చిత్రావతి రోడ్డు, గణేష్ సర్కిల్, ఎయిర్‌పోర్టు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మామిళ్లకుంట క్రాస్, కొత్తచెరువు ఎన్టీఆర్ సర్కిల్, బుక్కపట్నం మీదుగా సాగింది. జాతీయ జెండాలను చేతబట్టి 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా దేశ గౌరవం, ఐక్యతకు ప్రతీక అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల త్యాగాలను స్మరించుకోవాలని, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం ప్రాంతాల్లో ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.**

# గ్రీన్ క్యాంపస్ నిర్మాణానికి విద్యార్థినుల సంకల్పం

**అనంతగిరి ఆగస్టు 14 అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల-1 ప్రాంగణంలో విద్యార్థినుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగపండు అప్పల నాయుడు ముఖ్య అతిథిగా హాజరై తొలి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. డిప్యూటీ హెచ్‌ఎం ఎన్. రాధిక మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ తెలుగు ఉపాధ్యాయులు ఎస్. కోటేశ్వరరావు ప్రకృతిని ప్రేమించడం మన సంస్కృతిలో భాగమని విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌ఎల్ ఉపాధ్యాయులు టి. సుబ్బారావు, పీఎస్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, పీడీ కే. అప్పలరాజు, సోషల్ ఉపాధ్యాయురాలు పుష్పాలత, ఎస్జీటీ సరళ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో నీడనిచ్చే చెట్లు, పూల మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పించడంతో పాటు, నాటిన ప్రతి మొక్కను క్రమం తప్పకుండా సంరక్షిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# చర్యలు తీసుకోవడానికి ఎవరు?

**హైదరాబాద్, ఆగస్ట్ 14, అనంతజనశక్తి న్యూస్**

హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ నల్సార్ లా విద్యార్థులు నిరసన తెలపడంతో బీసీఐ వారి ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. బీసీఐ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన సీజేఐ.. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని ఆయన ఉద్ఘాటించారు. అంతేకాదు, నల్సార్ విద్యార్థులు లేదా అధ్యాపకులపై బీసీఐ కానీ, రాష్ట్ర బార్ కౌన్సిళ్లు కానీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**సీజేఐ ఫైర్**

''విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే చర్యలు తీసుకోవడానికి బీసీఐ ఎవరు? శాంతియుతంగా నిరసన తెలపడం విద్యార్థుల హక్కు. ఇది విద్యార్థులకు, నాకు మధ్య జరుగుతున్న సంభాషణ. ఇందులో వేరొకరు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు'' అని సీజేఐ వ్యాఖ్యానించారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. ముమ్మాటికీ బీసీఐ చర్య అర్థరహితమని అభిప్రాయపడింది. ఈ వివాదంపై తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

**వివాదం ఎలా మొదలైంది?**

త్వరలో జరగనున్న స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా నల్సార్ లా యూనివర్సిటీ ఆహ్వానించింది. అయితే, విషయాన్ని పునరాలోచించాలని యూనివర్సిటీ యాజమాన్యాన్ని విద్యార్థుల్లో ఓ వర్గం కోరడంతో ఈ వివాదం మొదలైంది. జులై 20న జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడికి సంబంధించిన విచారణ సందర్భంగా సీజేఐ చేసిన వ్యాఖ్యలను విద్యార్థులు తమ లేఖల్లో ప్రస్తావించారు. జులై 23 నుంచి యాజమాన్యానికి వివిధ బ్యాచ్ విద్యార్థులు కనీసం 6 విజ్ఞాపన పత్రాలను సమర్పించారు. విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్‌కు సంబంధించిన వీడియోలు చూడాలని లాయర్ కోరగా.. ''మాకు వీడియోలపై ఆసక్తి లేదు, చూడటానికి సమయం లేదు.. మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి'' అని సీజేఐ వ్యాఖ్యానించినట్లు విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐని ఆహ్వానించడం రాజ్యాంగ హక్కులు, న్యాయం అందించడం పట్ల యూనివర్సిటీకి ఉన్న నిబంధనలకు విరుద్ధమని వాదించారు. ''స్నాతకోత్సవం అనేది రాజ్యాంగ హక్కులు, విలువలు ప్రతిబింబించే వేడుక. నిరసనకారులపై పోలీసుల దాష్టికాన్ని తేలికగా తీసుకున్న ఒక ప్రముఖ వ్యక్తి చేతుల మీదుగా డిగ్రీలు తీసుకోవడం, నల్సార్‌లో మేము నేర్చుకున్న విలువలకే విరుద్ధంగా ఉంది'' అని ద్యార్థులు తమ లేఖలో స్పష్టం చేశారు.

ఈ లేఖలకు వందల మంది విద్యార్థులు మద్దతు తెలిపినట్లు సమాచారం. ''సీజేఐ పదవిని మేము గౌరవిస్తాం. కానీ మాకు రాజ్యాంగ విలువలు బోధించారు. వాటికి విరుద్ధంగా ఉన్న దేనికీ మేము మద్దతు ఇవ్వలేం'' అని స్టూడెంట్ బార్ కౌన్సిల్ సభ్యుడైన ఒక విద్యార్థి వ్యాఖ్యానించారు.

**ఎన్‌రోల్‌మెంట్‌పై బీసీఐ నిషేధం**

ఈ వ్యవహారం గురువారం మలుపు తిరిగింది. నల్సార్ 2026 గ్రాడ్యుయేట్లను అడ్వకేట్లుగా నమోదు చేయవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా రాష్ట్ర బార్ కౌన్సిళ్లను ఆదేశించడం వివాదం చెలరేగింది. ఈ నిరసన ఎవరు ప్రారంభించారు? ప్రోత్సహించింది ఎవరు? నివేదిక మూడు రోజుల్లో తమకు అందజేయాలని నల్సార్ వైస్‌ఛాన్సలర్‌ను బీసీఐ కోరింది. నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని, లేఖలపై సంతకాలు చేసినవారికి, అసలు ప్రచారాన్ని నడిపినవారికి తేడా చూపిస్తూ నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

న్యాయశాస్త్రం చదివి, దేశ అత్యున్నత న్యాయవ్యవస్థపై గౌరవం లేనివారు బాధ్యతాయుతమైన లాయర్‌గా, అధ్యాపకుడిగా లేదా న్యాయమూర్తిగా పనికిరాడని, అది వృత్తికే భారమని బీసీఐ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అంతేకాకుండా, వర్సిటీలోని కొందరు అధ్యాపకులే విద్యార్థులను ఎగదోసి 'నీచ రాజకీయాలు' చేస్తున్నారని ఆరోపించింది. యితే, ఈ నిర్ణయంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్‌తో సహా పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీజేఐని విద్యార్థులు వ్యతిరేకించడాన్ని సమర్థించకపోయినా, బీసీఐ నిర్ణయం ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఉందని ఆయన మండిపడ్డారు. తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో కొద్ది గంటల్లోనే తన నిర్ణయాన్ని బీసీఐ ఉపసంహరించుకుంది. ముందు లేఖపై సుదీర్ఘంగా చర్చించామని, ఆ ఉత్తర్వులను సవరిస్తున్నామని మనన్ కుమార్ మిశ్రా వెల్లడించారు.

# దేశభక్తిని చాటి చెప్పేలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**అమడగూరు ఆగస్టు 14 ( అనంత జనశక్తి న్యూస్ )**

అమడగూరు మండల కేంద్రంలోని, స్థానిక జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ నుండి బస్టాండ్ వరకు, ర్యాలీ నిర్వహించారు, ఎంపీడీవో శకుంతల, ఎంఈఓ జిలాన్ భాష, మాట్లాడుతూ,సమాజంలో ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని దేశభక్తిని చాటి చెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు అంతేకాకుండా, ప్రతి ఒక్కరు ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగరవేద్దామని ఎంపీటీవో శకుంతల,ఎంఈఓ జిలాన్,భాష తెలియజేశారు, అధికారులు ఉపాధ్యాయుల,,ఆధ్వర్యంలో శుక్రవారం, విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ బస్టాండ్ వరకు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో మానహారంగా ఏర్పడి హర్ ఘర్ తిరంగా ఉద్దేశం గురించి వివరించారు. 80,వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలో సందర్భంగా ఆగస్టు 2 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి భారత స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపడానికి, స్వాతంత్రం కోసం పోరాడిన ఆ మహానుభావుల స్మరించుకోవడం కోసం వారి త్యాగాలను భవిష్యత్తు తరాలకు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు సమాజంలోని ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీవో శకుంతల, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, యు ఆర్ డి రాజశేఖర్,ఎంఈఓ జిలాన్ భాష, మమత కార్యదర్శి మమత స్కూల్ హెచ్ఎం ఉపాధ్యాయులు రమణారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాదేవి, ఐకెపి ఎపిఎం భారతి, డిజిటల్ అసిస్టెంట్, అశోక్, సోమశేఖర్, ఎం ఆర్ సి నుండి నాగరాజు, మునికిష్ట, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెంగన్నపల్లి గ్రామాన్ని తనిఖీ చేసిన సిఐ



**యాడికి, ఆగష్టు 14,, అనంత జనశక్తి న్యూస్ :**

మండల పరిధిలోని వేములపాడు గ్రామాన్ని శుక్రవారం సిఐ శ్రీనివాసులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు ప్రజలతో మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, ఫ్యాక్షన్ ను వీడి ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. ఫ్యాక్షన్ తో కుటుంబాలు నాశనం అవుతాయని, పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వ్యక్తి ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు



**యల్లనూరు, ఆగస్టు 14, అనంత జనశక్తి న్యూస్ ;**

మండలంలోని చిలంకూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్ (22) అనే యువకుడు పుట్లూరు మండలం శనిగలగూడూరు సమీపంలో ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో అపస్మారక స్థితిలోకి వెల్లాడు. ఈ సంఘటనను గుర్తించిన కొందరు 108వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మ కు శ్రావణ మాస పూజలు

**యాడికి, ఆగష్టు 14,,అనంత జనశక్తి న్యూస్**



మండల కేంద్రంలోని కోన రోడ్డు వద్ద శ్రీ చౌడేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాస పూజలు ప్రారంభించారు.ఉదయం శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మకు సుప్రభాత సేవ, గంగా పూజ, పంచామృతాలతో అభిషేకం చేసి,నూతన పట్టు వస్త్రాలచే,వివిధ పూలమాలతో అలంకరణ చేశారు. అర్చనలు చేసి,ప్రత్యేక హారతులను సమర్పించారు. సాయంత్రం శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, టెంకాయలను, కానుకలను సమర్పించారు. ఖడ్గా పద్యాలు పాడినారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరి దేవాలయం ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం

**అనంతపురం, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా స్థానిక పోలీస్ పెరియడ్ గ్రౌండ్ లో జరిగే కార్యక్రమాలకు సంబంధించి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సర్వం సిద్ధం చేసినట్లు డిఆర్ఓ మాలోల తెలిపారు.ఈసందర్భంగాపతాకావిష్కరణ, వేదిక పనులు ,స్టాల్స్, శకటాల ఏర్పాట్లు, మైదానం అలంకరణ, సిట్టింగ్ అరేంజ్మెంట్స్ తదితర పనులను డిఆర్ఓ పరిశీలించారు. వేడుకలలో భాగంగా రాష్ట్ర ఆర్థిక మరియు ప్రణాళిక వాణిజ్య పనులు మరియు శాసనసభ వ్యవహార శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ గారు పతాకావిష్కరణ చేసి ప్రజలకు వేడుకల సందర్భంగా సందేశమి స్తారని తెలిపారు. పరేడ్ కమాండ్ చే రాష్ట్రీయ సెల్యూట్ సమర్పణ, మార్చ్ ఫాస్ట్, సకటాల ప్రదర్శన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అన్ని కార్యక్రమాలను సజావుగా నిర్వహించేలా ఏర్పాటులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్ డి ఓ ప్రేమంథకుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున్ రెడ్డి, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూ కొఠారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రమేష్ రెడ్డి తాసిల్దారులు రాజా ,ఉదయ భాస్కర్, ఆర్. ఐ .తేజ తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమైన శ్రీ సత్యసాయి జిల్లా

### జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 14:అనంత జనశక్తి న్యూస్**




శ్రీ సత్యసాయి జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు.ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పుట్టపర్తి స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పి అంకిత సురన ..లతో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మైదానంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేదిక, డెకరేషన్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.శనివారం (ఆగస్టు 15) ఉదయం 9 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజలు, విద్యార్థులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొననున్న ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఈఓ క్రిస్టప్ప , డీఆర్డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి సత్యకుమార్ చొరవతో మెరుగైన వైద్య సేవలు

**-ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో నూతన ఓపీ కౌంటర్ ప్రారంభం.....**

**ధర్మవరం ఆగష్టు 13 అనంత జనశక్తి న్యూస్ :**




ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో నూతన ఓపీ కౌంటర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, సత్య కుమార్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి శానిటరీ ఇంచార్జ్ బిల్లే. శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. కొత్త ఓపీ కౌంటర్ ఏర్పాటుతో రోగులకు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ఓపీ నమోదు మరింత సులభతరం కానుంది. ప్రత్యేక కౌంటర్ ద్వారా వేగంగా ఓపీ నమోదు చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశం కలుగుతుందని బిల్లే. శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా మంత్రి సత్యకుమార్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## మా సహనం పరీక్షించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

88 గంటల పాటు సాగిన ఈ సైనిక ఆపరేషన్ వెనక ఉన్న వ్యూహాలు, నిర్ణయ ప్రక్రియపై దోవల్ ఇందులో వివరించనున్నారు. భారత్ సహనంగా ఉంటే దేశమైనప్పటికీ, ఇది బలహీన దేశం కాదని అజిత్ దోవల్ స్పష్టం చేశారు. ''మా సహనాన్ని బలహీనతగా పొరబడకండి. భారత్ రిస్కులు తీసుకోగలదు. అవసరమైతే గట్టి దెబ్బకొట్టగలదు'' అని ఆయన అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాద సంస్థల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని దోవల్ వెల్లడించారు. భారత సైనిక, జాతీయ భద్రతా నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను కూడా ఈ డాక్యుమెంటరీ చూపించనుంది. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ లో జరిగిన దారుణమై ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మే 7న ఆపరేషణ్ సిందూర్ చేపట్టారు. పాకిస్తాన్, పీఓకేలోని లష్కరే తోయిబా, జైషే మహ్మద్‌కు చెందిన ట్రైనింగ్ క్యాంపులు, కార్యాలయాలను ధ్వంసం చేశారు. పాక్ సైన్యం భారత్‌పై దాడి చేసేందుకు ప్రయత్నిస్తే, భారత్ తన క్షిపణులు, యుద్ధ విమానాలతో పాక్ ఎయిర్ ఫోర్స్ బేసుల్ని ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో పాకిస్తాన్ లోని 10కి పైగా వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఇందులో పాక్ ఎయిర్ ఫోర్స్, న్యూక్లియర్ కమాండ్ సెంటర్‌గా ఉన్న రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్ కూడా ఉంది. చివరకు పాక్ శరణు కోరడంతో కాల్పుల విరమణ జరిగింది. అణ్వాయుధ దేశాలైన భారత్, పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణ దాదాపు 88 గంటల పాటు కొనసాగింది.

## భారతీయులపై దాడులు

(మొదటి పేజీ తరువాయి)

202125 మధ్య మొత్తం 302 దాడులు నమోదయ్యాయి. 2021లో 15, 2022లో 31, 2023లో 67, 2024లో 85, 2025లో 104 దాడులు జరిగాయి. అమెరికాలో గత ఐదేళ్లలో అత్యధికంగా 33 దాడులు జరిగాయి. ఆ తర్వాత యూఏఈలో 32, యూకేలో 31, కెనడాలో 30, ఐర్లాండ్‌లో 24, రష్యాలో 23, జర్మనీలో 19 ఘటనలు నమోదయ్యాయి.

విదేశాల్లో భారతీయులపై జరుగుతున్న దాడులపై అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్పందించారు. విదేశాల్లో భారతీయుల భద్రత, రక్షణ భారత ''అత్యంత ప్రాధాన్యత'' అని చెప్పారు. ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ఆ దేశ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమగ్ర విచారణ జరిగేలా, నిందితులకు ఆ దేశ చట్టాల ప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

## 'కడప స్మార్ట్ కిచెన్'కు నీతిఆయోగ్ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం ప్రత్యేకంగా 95 డెలివరీ వాహనాలు అందుబాటులో ఉంచారని.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా స్మార్ట్ కిచెన్ల ద్వారా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొంది.

సెంట్రలైజ్డ్ మెకనైజ్డ్ కుకింగ్‌తో పాటుగా ఆహారాల నాణ్యతలో స్టాండర్డ్ ప్రోటోకాల్స్, వాహనాలకు జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటు, డ్యాష్‌బోర్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉందని.. ఆహారం రుచి, నాణ్యతపై క్యూఆర్ కోడ్ ఆధారంగా అభిప్రాయాలు కూడా తెలుసుకుంటున్నారని నీతిఆయోగ్ పేర్కొంది. స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా భోజన పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం, ట్రేసింగ్ వీలవుతుందని ప్రశంసించింది. ఈ నేపథ్యంలో కడప స్మార్ట్ కిచెన్లను గుర్తించినందుకు నీతిఆయోగ్‌కు మంత్రి నారా లోకేష్ ధన్యవాదాలు తెలియజేశారు. స్మార్ట్ కిచెన్ నమూనాలో స్వయం సహాయక బృందాల మహిళలు భాగస్వామ్యులుగా ఉండటం సంతోషం కలిగిస్తోందన్న నారా లోకేష్.. పిల్లలకు సంరక్షణ, పోషకాహారాన్ని అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత బలోపేతం చేస్తామని ట్వీట్ చేశారు.

ఏంటీ స్మార్ట్ కిచెన్లు..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తోంది. స్మార్ట్ కిచెన్‌లలో పనిచేసే వారికి ఫైవ్ స్టార్ హోటల్ తరహాలో డ్రెస్ కోడ్ ఉంటుంది. పరిశుభ్రతా చర్యలు కూడా అదే తరహాలో ఉంటాయి.ఈ స్మార్ట్ కిచెన్లలో కూరగాయలను కోయడం మొదలుకుని, వంట వరకూ అంతా ఆటోమేటెడ్ మెషీన్ల సాయంతో చేపడతారు. అలాగే వండిన ఆహారాన్ని జిల్లాలో వేర్వేరు ప్రాంతాలలో ఉన్న స్కూళ్లకు చేరవేసేందుకు ఎలక్ట్రికల్ వాహనాలను సమకూర్చారు.

ఆహారం వండిన తర్వాత వంట గదిలో ఏర్పడే సేంద్రీయ వ్యర్థాలను మిథేన్ గ్యాస్‌గా మార్చుకుని స్మార్ట్ కిచెన్ అవసరాలకు తిరిగి ఉపయోగిస్తున్నారు. ఆహార వ్యర్థాన్ని నివారించేందుకు ఆరోజు పాఠశాలలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే సమాచారాన్ని రియల్ టైమ్ డేటా ద్వారా తెలుసుకుని అందుకు అనుగుణంగా ఆహారాన్ని తయారు చేస్తారు. ఇక స్మార్ట్ కిచెన్లలో ఉండే ఓవెన్లు, కుక్కర్లు, ఫ్రిడ్జిల నుచి ఆహారాన్ని స్కూళ్లకు చేరవేసే వాహనాల ట్రాకింగ్ వరకూ అన్నీ కూడా స్మార్ట్ ఫోన్ ద్వారా నియంత్రిస్తున్నారు. వాహనాలను ట్రాక్ చేసేందుకు వీలుగా జీపీఎస్ ట్రాకర్లు కూడా ఏర్పాటు చేశారు.

## శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి శ్రావణ పూజలు

**యాడికి, ఆగష్టు 14, అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రావణ మాస పూజలు నిర్వహించారు.ఉదయం కన్యకాపరమేశ్వరి దేవి మాత కు పంచామృత అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు.జీఎస్టీ రవితేజ ద్వారా వచ్చిన రూ. 25వేల నూతన కరెన్సీ తో ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి విశేష అలంకరణ నిర్వహించారు.అర్చనలు చేసి, ప్రత్యేక హారతులు సమర్పించారు. సాయంత్రం ఏడు గంటలకు కుంకుమార్చన, మణిద్వీప వర్ణన, రథోత్సవం, కోలాటా కార్యక్రమం ను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం యాడికి ఆర్య వైశ్య సంఘం బంగారు బాల , లయన్ పవన్,రాజేష్, సంఘ సభ్యులు, మహిళా మండలి సభ్యులు ,యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అగాపే ఆశ్రమం లో అన్నదానం

**యాడికి, ఆగష్టు 13, అనంత జనశక్తి న్యూస్**

**మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమం లో వృద్ధులకు శుక్రవారం అన్నదానం కార్యక్రమం ను నిర్వహించారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు. పేరం లక్ష్మినారాయణ రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు భార్య ప్రమీలమ్మ, కుమారుడు రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , నాగార్జున, సాయి, వెంకట్ రెడ్డి,కోన రెడ్డి లు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. పేరం లక్ష్మినారాయణ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని,కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు. ఈ కార్యక్రమంలో కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.**



# రెండు జతల డ్రెస్‌లతో హాలీడే ట్రిప్.. క్యూట్ ఫొటో పంచుకున్న సమంత



నటి సమంత ప్రస్తుతం ప్రెగ్నెన్సీలో ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సామ్.. తాజాగా ఓ క్యూట్ ఫొటోను పంచుకున్నారు. "నా దగ్గర చాలా డ్రెస్‌లు ఉన్నాయి. కానీ, ఇప్పుడు నాకు అవేవీ సరిపోవడం లేదు. ఆ విషయం తెలిసి 'మినీ బ్రేక్‌డౌన్' వచ్చింది. రెండు సెకన్లు కంగారు పడ్డాను. ఏది ఏమైనా.. ఈ హాలిడేకి కేవలం 2 జతల డ్రెస్‌లు మాత్రమే సర్దేస్తున్నా" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతోంది.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాతృత్వం గురించి సమంత మాట్లాడారు. తాను ఈ క్షణాల కోసం ఎంతో ఎదురుచూసినట్లు చెప్పారు."అమ్మ' అనే పిలుపు కోసం ఎంతో పరితపించాను. . ఈ ప్రయాణంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నాను. ప్రతి రోజూ కొత్తగా అనిపిస్తోంది" అని అన్నారు. ప్రస్తుతం సమంత కొంతకాలం సినిమాల నుంచి విరామం తీసుకున్నారు.

# 'సనాతన ధర్మం'పై నా మాటలు వక్రీకరించారు: అనసూయ పోస్ట్



నటి అనసూయ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల హిందూ ధర్మంపై ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సనాతన ధర్మాన్ని అవమానించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారంపై అనసూయ స్పందిస్తూ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. తన వ్యాఖ్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించారని, తాను ఏ మత విశ్వాసాలనూ కించపర్చేలా మాట్లాడలేదని వివరణ ఇచ్చారు.

"నా మాటలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారు. అందుకే ఈ వివరణ ఇవ్వాల్సి వస్తోంది. నేను మాట్లాడింది కొంతమంది గురించి మాత్రమే. నాపై అభ్యంతర కామెంట్లు చేస్తూ, వ్యక్తిగత దాడులు, బెదిరింపులకు దిగే వాళ్ల గురించే నేను చెప్పాను. అది ఏ మతాన్ని గానీ, వర్గాన్ని గానీ ఉద్దేశిస్తూ చెప్పిన మాట కాదు. నన్ను టార్గెట్ చేస్తున్న వాళ్లకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. నేను సనాతన ధర్మాన్ని పాటించే హిందువుని. నా ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల నాకు ఎలాంటి చింత లేదు. ధైర్యంగా ఉండటం.. నిజం వైపు నిలబడటం, తప్పును తప్పు అని చెప్పడం, ఎదుటివారిని మనిషిగా గౌరవించడం.. ఇవన్నీ నాకు ధర్మమే నేర్పింది. హనుమాన్ జీ ధైర్యం, బలమే నాకు స్ఫూర్తి. అందువల్ల అన్యాయం జరిగినప్పుడు మాట్లాడకుండా ఉండలేను. నా మాటల నుంచి అసలు విషయం తొలగించి.. సనాతన ధర్మాన్ని అవమానించినట్లుగా వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదు. మతం ఆధారంగా నేను ఎవరిపైనా ఓ నిర్ణయానికి రాను. వేధించే వాళ్లను మాత్రమే ప్రశ్నిస్తా. అందువల్ల ఎడిట్ చేసిన క్లిప్‌లు, సగం సగం కథనాల వలలో పడకండి. అన్ని విషయాలు తెలుసుకున్న తర్వాతే ఓ అభిప్రాయానికి రండి" అని అనసూయ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# నా అనుభవమే వారికో హెచ్చరిక!



తెరపై ఆడిపాడుతూ.. ప్రేక్షకులకు వినోదాన్ని పంచే తారల జీవితాల వెనుక కూడా ఎన్నో సమస్యలు ఉంటాయి. ఈ క్రమంలోనే తనదైన నటనతో కుర్రకారుని ఉర్రూతలూగించే నాయిక అనుపమ పరమేశ్వరన్ గత రెండేళ్లుగా నరకం అనుభవించానని, ప్రతి రాత్రి ఏడ్చేదాన్నని అంటోంది. ఈమధ్యే ఆమె 'మనశ్శాంతి దక్కాలంటే కొన్ని డెడ్‌ఎండ్స్ దాటి ముందుకు వెళ్లాలి' అంటూ పోస్ట్ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ.. ఆ పోస్ట్ వెనుక అసలు నిజాన్ని పంచుకుంది. "ఆ పోస్ట్ ఏదో రాత్రికి రాత్రి పెట్టింది కాదు. దాని వెనుక రెండేళ్ల బాధ ఉంది. నేను పూర్తిగా కోలుకొని ధైర్యంగా నిలబడే స్థాయికి వచ్చిన తర్వాతే ఆ విషయాన్ని ప్రపంచంతో పంచుకున్నాను. తన గురించి, తన జీవితం గురించి ఓ గొప్ప విషయాన్ని గుర్తించి.. కోలుకోవడానికి, ఒక ముఖ్యమైన విషయాన్ని వ్యక్తపరచడానికి సమయం తీసుకున్న ఒక అమ్మాయి ప్రయాణం ఇది. నేను రెండేళ్ల పాటు నార్సిసిస్టిక్ అబ్యూజ్ (మానసిక వేధింపుల)ను ఎదుర్కొన్నాను. ఇన్‌స్టాలో నటి మడోన్నా దీని గురించి మాట్లాడిన ఓ వీడియో చూసినప్పుడు నా శరీరం భయంతో వణికిపోయింది. ఒక రిలేషన్‌షిప్‌లోకి వెళ్లాక అందంగా వికసించాల్సిన నేను.. రోజురోజుకూ బరువు తగ్గి కుంగిపోయాను. ప్రతి రాత్రి ఏడ్చేదాన్ని. నా పరిస్థితిని చూసి కొందరు నెగిటివ్ కామెంట్స్ చేశారు. మరికొందరు అర్థం చేసుకున్నారు. కానీ అసలు ఈ వేధింపులను గుర్తించలేని మూడో కేటగిరీ వ్యక్తుల కోసమే నేను నోరు విప్పుతున్నాను. చాలా కాలం తర్వాత ఈ మానసిక గాయం నుంచి కోలుకున్నా. ఇటువంటి విషపూరితమైన బంధాలలో చిక్కుకున్న వారికి నా అనుభవం ఒక హెచ్చరికగా నిలవాలనే ఉద్దేశ్యంతోనే ఈ విషయాల గురించి బహిరంగంగా మాట్లాడుతున్నా" అని చెప్పుకొచ్చింది అనుపమ.

# శ్రీదేవి త్వరలో వస్తోంది




నటి శ్రీదేవి.. ఈ పేరు వింటే చాలు.. ఇప్పటికీ ఆమె నటించిన పాత్రలు ప్రేక్షకుల ముందు మెదులుతూనే ఉంటాయి. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి సినీప్రియుల్ని మెప్పించారీమె. గురువారం ఈ దివంగత నటి జయంతి. ఈ సందర్భంగా కథానాయిక ప్రియాంక చోప్రా.. ఆమె జీవిత చరిత్ర పుస్తకానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. 'ఎంప్రెస్-ది డెఫినిటివ్ బయోగ్రఫీ ఆఫ్ శ్రీదేవి' అనే పుస్తక ముఖచిత్రాన్ని పంచుకుంటూ సామాజిక మాధ్యమాల వేదికగా శ్రీదేవికి నివాళులర్పించింది. "మీరు ఎంతో గుర్తుకొస్తున్నారు. స్వర్గంలో ఉన్న మీకు జన్మదిన శుభాకాంక్షలు. శ్రీదేవి త్వరలో వస్తోంది" అని వ్యాఖ్యను జోడించింది ప్రియాంక. ఈ పోస్ట్‌ను శ్రీదేవి భర్త, నిర్మాత బోనీ కపూర్ రీపోస్ట్ చేయడం విశేషం. రచయిత ధీరజ్ యు.కుమార్ రచించిన ఈ పుస్తకం శ్రీదేవి సినీప్రయాణం, వ్యక్తిగత జీవితం గురించి తెలియజేయనుంది. 2023లోనే శ్రీదేవి జీవిత చరిత్ర పుస్తకంగా రాబోతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తెరపై శ్రీదేవి బయోపిక్‌లో ఎవరు నటిస్తారు? దర్శకత్వం ఎవరు? లాంటి ప్రశ్నలకు సమాధానం కోసం కొన్ని రోజులు ఆగాల్సిందే.

# ఇదే నా చివరి ప్రపంచ కప్ కావచ్చు



ఆగస్టు 15 నుంచే హాకీ ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. ఇందులో భారత్‌ను చివరిసారిగా 1975లో స్వర్ణం వరించింది. ఆ తర్వాత పతకం రాలేదు. ఈసారి ఎలాగైనా ఆ లోటును భర్తీ చేయాలనే లక్ష్యంతో టీమ్‌ఇండియా బరిలోకి దిగుతోంది. తనకు ఇదే చివరి ప్రపంచ కప్ కావచ్చని సీనియర్ మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ వ్యాఖ్యానించాడు. అదే దృక్పథంతో బరిలోకి దిగి గెలిచేందుకు ప్రయత్నిస్తానని తెలిపాడు.

"ఈ వరల్డ్ కప్ నాకెంతో స్పెషల్. ఇది నాకు నాలుగో ఎడిషన్. మేం ఒలింపిక్ మెడల్స్ గెలిచాం. కానీ, వరల్డ్ కప్‌లో పతకం అందుకోలేకపోయాం. ఇప్పుడున్న జట్టులో ప్రతి ఒక్కరి కల కూడా అదే. నావరకైతే ఇదే చివరి ప్రపంచ కప్ కావొచ్చు. అదే మైండ్‌సెట్‌తో బరిలోకి దిగుతా. ఇప్పటి వరకు మేం సాధించలేకపోయిన దానిని అందుకొనేందుకు ప్రయత్నిస్తాం. అదే సమయంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. మేం పోషించాల్సిన పాత్రపై స్పష్టత ఉంది. క్రమశిక్షణతో ఆడతాం. అప్పుడే గెలిచే అవకాశాలు మనకు మెరుగ్గా ఉంటాయి. జట్టులో ప్రతి ఒక్కరికీ గొప్ప అనుభవం ఉంది. అందరూ అద్భుతమైన టాలెంట్ ఉన్న ప్లేయర్లే. మా సన్నద్ధత కూడా చాలా బాగుంది. ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంటామని బలంగా చెప్పగలను. ప్రతి ట్రైనింగ్ సెషన్‌లోనూ మేం వందశాతం కష్టపడ్డాం. జట్టులోని ప్రతి ఒక్కరూ ఏదో సాధించాలనే లక్ష్యంతోనే ఉన్నారు. ఫిట్‌నెస్‌పై మా కోచ్ ప్రధానంగా దృష్టి పెట్టారు. ఎందుకంటే.. ఫిట్‌గా ఉంటే అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ఆస్కారం ఎక్కువ. గోల్స్ కొట్టడం మీదనే కాకుండా.. డిఫెన్స్‌పైనా వర్కౌట్ చేశాం. ప్రత్యర్థి పాకిస్థానా? ఇతర జట్టా? అనేది ముఖ్యం కాదు. మా ప్రణాళిక ప్రకారం ఆడతాం. గెలిచి తీరుతాం" అని మన్‌ప్రీత్ సింగ్ వెల్లడించాడు.

ప్రపంచ కప్ పూల్ Dలో వేల్స్, ఇంగ్లాండ్, పాకిస్థాన్‌తోపాటు భారత్ ఉంది. తొలి మ్యాచ్ ఆగస్టు 15న సాయంత్రం 4.30 గంటలకు వేల్స్‌తో టీమ్‌ఇండియా తలపడనుంది. ఆగస్టు 17న ఇంగ్లాండ్(సాయంత్రం 6.30గంటలు), ఆగస్టు 19న పాకిస్థాన్‌ను(సాయంత్రం 6.30 గంటలు) భారత్ ఢీకొట్టనుంది. నెదర్లాండ్స్ వేదికగా వరల్డ్ కప్ జరగనుంది.

# 600వ టెస్టుకు నాయకత్వం గర్వంగా ఉంది.. ఆ బెర్తే మా లక్ష్యం




శనివారం నుంచి శ్రీలంకతో టీమ్‌ఇండియా తొలి టెస్టు మ్యాచ్‌లో తలపడనుంది. మరోవైపు టెస్టు సారథిగా శుభ్‌మన్ గిల్ సంవత్సర కాలం పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కిది 600వ మ్యాచ్. ఇలాంటి మైలురాయి టెస్టుకు నాయకత్వం వహించనుండటం గర్వంగా ఉందని కెప్టెన్ గిల్ వ్యాఖ్యానించాడు. భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున మ్యాచ్ ప్రారంభం కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంటుందని తెలిపాడు.

"కెప్టెన్ పాత్రలో నేను చాలా సౌకర్యంగానే ఉన్నా. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తు ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. కనీసం మేం ఏడు టెస్టుల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి మొదలుపెడతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజునే భారత్ 600వ టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి పోరుకు నాయకత్వం వహించడం గొప్ప గౌరవం" అని గిల్ తెలిపాడు.

సమయం ఇవ్వాలి..

"మెరుగ్గా మారేందుకు ఆటగాళ్లకు తగినంత సమయం ఇవ్వాలి. కొందరికి కాస్త ఎక్కువ టైమ్ పడుతుంది. అయినా సరే వారికి మద్దతుగా నిలుస్తాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ బాగా ఆడాడు. అతడు గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ - మేనేజ్‌మెంట్ మధ్య సంబంధాలు సరిగా లేవని వస్తోన్న ఆరోపణలన్నీ అవాస్తవం. మేం అనుకొన్నంత వేగంగా సాయి సుదర్శన్ ఇంప్రూవ్ కాలేదు. అయితే, మా స్క్వాడ్‌లోని 15 మందిపై నమ్మకం ఉంది. తుది జట్టు ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పలేను. పేసర్ల విషయంలోనూ ఎంపిక కష్టంగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేస్తాడు. బౌన్స్‌ను రాబడతాడు. అయితే, ప్రసిద్ధ్ వార్మప్ మ్యాచ్‌లో చాలా చక్కగా బంతులేశాడు. సిరాజ్‌తోపాటు మరొక పేసర్ ఎవరనేది తేల్చడం కాస్త క్లిష్టమైన నిర్ణయమే. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఫైనల్ XIను ప్రకటిస్తాం" అని శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు.

# టోకెన్ అమౌంట్ రూ.100కే జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ షేర్లు బదిలీ!

జంషెడ్‌పుర్ ఫుట్‌బాల్ క్లబ్ కొత్త యాజమాన్యం చేతుల్లోకి వెళ్లింది. టాటాల ఆధ్వర్యంలో నడిచిన ఈ క్లబ్‌ను చర్చిల్ బ్రదర్స్ సొంతమైంది. తాజాగా జంషెడ్‌పుర్ ఎఫ్‌సీలోని షేర్లను రూ.100 టోకెట్ అమౌంట్‌కే ట్రాన్స్‌ఫర్ చేయడం గమనార్హం. అయితే, ఇది మొత్తం డీల్ విలువ అయి ఉండకపోవచ్చని సమాచారం. ఇండియన్ సూపర్ లీగ్‌లో గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్ సంస్థ యాజమాన్యంలో జంషెడ్‌పుర్ ఫుట్‌బాల్ క్లబ్ ఆడే అవకాశం ఉంది. టాటా స్టీల్ డైరక్టర్స్ కమిటీ 4.08 కోట్ల ఈక్విటీ షేర్లను బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది. కొనుగోలు ఒప్పందం మీద సంతకాలు కూడా జరిగాయి. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అప్రూవల్‌తోపాటు ఇతర ఫార్మాలిటీలు పూర్తయ్యేందుకు దాదాపు 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. టాటా స్టీల్ - చర్చిల్ బ్రదర్స్ సంస్థ డీల్‌లో జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ స్పోర్టింగ్ లైసెన్స్, 12 మంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌ల కాంట్రాక్ట్‌లు ఉంటాయి. తాము లైసెన్స్‌ను తీసుకుంటున్నట్లు ఇప్పటికే ఏఐఎఫ్ఎఫ్ దృష్టికి చర్చిల్ బ్రదర్స్ సంస్థ తెలియజేసింది. ఫెడరేషన్ ఆమోదం లభించిన వెంటనే జంషెడ్‌పుర్ ఎఫ్‌సీ చర్చిల్ బ్రదర్స్ చేతికి వెళ్తుంది. టాటా స్టీల్ నిర్ణయం వెనుక..

భారత్‌లో ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దశాబ్దం కిందట జంషెడ్‌పుర్ క్లబ్ ను టాటా స్టీల్ ప్రారంభించింది. అయితే, ఇటీవల ఇండియన్ సూపర్ లీగ్‌లో ఆడేందుకు ఎంట్రీ ఫీజును యాజమాన్యం చెల్లించలేదు. ఈ డీల్‌కు కొద్ది రోజుల ముందు నుంచే క్లబ్ నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకుంది. టాటా ఫుట్‌బాల్ అకాడమీని మరింత విస్తృతపరిచి క్షేత్రస్థాయిలో గేమ్‌కు సహకారం అందించాలనేది లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు చర్చిల్ బ్రదర్స్‌కు షేర్స్‌ను బదిలీ నేపథ్యంలో టాటా స్టీల్‌కు జంషెడ్‌పుర్ ఎఫ్‌సీతో బంధం ముగిసినట్లయింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314